

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

అక్టోబర్, 2025

సంపుటి - 11 సంచిక-10 పేజీలు- 52 వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



"ద సీక్రెట్ ఆఫ్ సక్సెస్" అనే అంశంపై ఉపన్యాసం ఇస్తున్న ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



విశ్వవిద్యాలయం మరియు ఎన్ఐపిహెచ్ఎం సంయుక్తంగా పిజీ డిప్లమా కోర్స్ ఆఫర్ చేయడానికి అవగాహన ఒప్పందం



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్



విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మల్యాల్ సందర్శించి అక్కడి రైతులు మరియు శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

అక్టోబర్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర ఆశ్వయుజ శుద్ధ నవమి నుండి కార్తీక శుద్ధ దశమి వరకు



## సంపాదక వర్గం



**ప్రధాన సంపాదకులు**

**డా॥ సి. పద్మవేణి**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

**సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు**

**డా॥ పి. లీలా రాణి**

ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

**డా॥ బి. పద్మజ**

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

**పర్యవేక్షణ**

**డా॥ ఆర్. సునీత దేవి**

ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



**చిరునామా :**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.......... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.......... 14
4. సాంకేతిక వ్యాసాలు
   - ఖరీఫ్ వరిలో దోమపోటు నివారణ చర్యలు.......... 15
   - మొక్కజొన్నలో కోతకు ముందు పురుగుల నియంత్రణకు ఉపయోగించే మందుల వాడకంలో పాటించవలసిన సురక్షిత కాలం.......... 17
   - తెలంగాణలో యాసంగి వేరుశనగ సాగు - యాజమాన్య పద్ధతులు.......... 19
   - యాసంగి ప్రొద్దుతిరుగుడులో అధిక దిగుబడుల కొరకు మేలైన యాజమాన్య పద్ధతులు.......... 21
   - ఆయిల్ పామ్‌లో పోషకాల లోపాలు - యాజమాన్యం.......... 23
   - ప్రత్తి కొనుగోలుకు నూతన విధానం...కపాస్ కిసాన్ యాప్.......... 26
   - వ్యవసాయ పదవినోదం.......... 28
   - ప్రత్తి పంటలో తెగుళ్ళు - యాజమాన్యం.......... 29
   - సోయాచిక్కుడు సాగు, వంట నూనె ఉత్పత్తి మరియు విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం మరియు ఆరోగ్యం.......... 31
   - పి.జె.టి.ఎ.యు గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమం: నాణ్యమైన విత్తనోత్పత్తిలో రైతులకు ముఖ్య సూచనలు.......... 33
   - అక్టోబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......... 36
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......... 38
   - కృత్రిమ మేధస్సుతో కీటకాల నియంత్రణ - పంటలకు స్మార్ట్ రక్షణ.......... 39
   - దశరథ గడ్డి (హెడ్జ్‌లూసర్న్) - పోషక విలువలు కలిగిన పశుగ్రాసం.......... 42
   - చేపల చెరువులో నీటి యాజమాన్యం.......... 44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......... 46
6. రైతన్నకో ప్రశ్న.......... 47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......... 48
8. రైతు విజయగాథ
   - ఆముదం విత్తనోత్పత్తి - రైతు విజయగాథ.......... 49

# అక్టోబర్ మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర ఆశ్వయుజ శుద్ధ నవమి నుండి కార్తీక శుద్ధ దశమి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | | | 1<br>ఆశ్వయుజ శుద్ధ<br>నవమి ప. 2-23<br>ఉత్తరాషాఢ పూర్తి<br>ప.వ. 1-18 ల 3-00 | 2<br>దశమి ప. 2-41<br>ఉత్తరాషాఢ ఉ. 6-11<br>ఉ.వ. 10-17 ల<br>11-56 | 3<br>ఏకాదశి ప. 2-33<br>శ్రవణం ఉ. 6-51<br>ప.వ. 10-53 ల<br>12-29 | 4<br>ద్వాదశి ప. 1-56<br>ధనిష్ఠ ఉ. 7-02<br>ప.వ. 2-10 ల<br>3-44 |
| 5<br>త్రయోదశి రా. 12-52<br>శతభిషం ఉ. 6-46<br>పూర్వాభాద్ర తె. 6-02<br>ప.వ. 12-58 ల 2-31 | 6<br>చతుర్దశి ప. 11-24<br>ఉత్తరాభాద్ర తె. 4-59<br>ప.వ. 3-13 ల<br>4-44 | ○ 7<br>పూర్ణిమ ఉ. 9-35<br>రేవతి తె. 3-42<br>సా.వ. 4-20 ల<br>5-51 | 8<br>ఆశ్వయుజ బ॥<br>పాడ్యమి ఉ.7-31<br>విదియ తె. 5-13<br>అశ్విని రా. 2-12<br>రా.వ. 10-27 ల<br>11-57 | 9<br>తదియ రా. 2-51<br>భరణి రా. 12-35<br>ఉ.వ. 11-09 ల<br>12-38 | 10<br>చవితి రా. 12-26<br>కృత్తిక రా. 10-55<br>ప.వ. 11-45 ల<br>1-14 | 11<br>పంచమి<br>రా. 10-04<br>రోహిణి రా. 9-16<br>ప.వ. 1-49 ల<br>3-18<br>రా.వ. 2-31 ల 4-01 |
| 12<br>షష్ఠి రా. 7-50<br>మృగశిర<br>రా. 7-46<br>తె.వ. 3-43 ల<br>5-14 | 13<br>సప్తమి<br>సా.5-49<br>ఆర్ద్ర సా.6-29<br>ఉ.వ.5-59 ల | 14<br>అష్టమి సా. 4-05<br>పునర్వసు<br>సా. 5-28<br>ఉ.శే.వ. 7-30 వ<br>రా.వ. 1-15 ల<br>2-48 | 15<br>నవమి ప. 2-40<br>పుష్యమి<br>సా. 4-47<br>తె.వ. 5-26 ల | 16<br>దశమి<br>ప. 1-40<br>ఆశ్రేష సా. 4-31<br>ఉ.శే.వ. 7-01 వ<br>తె.వ. 4-37 ల | 17<br>ఏకాదశి<br>ప. 1-08<br>మఘ సా. 4-42<br>ఉ.శే.వ. 6-13 వ<br>రా.వ. 12-56 ల<br>2-34 | 18<br>ద్వాదశి ప. 1-06<br>పుబ్బ సా. 5-23<br>రా.వ. 12-56 ల<br>2-37 |
| 19<br>త్రయోదశి<br>ప. 1-37<br>ఉత్తర సా. 6-35<br>తె.వ. 3-34 ల<br>5-16 | 20<br>చతుర్దశి<br>ప. 1-37<br>హస్త రా. 8-15<br>తె.వ. 4-56 ల | ● 21<br>అమావాస్య<br>సా. 4-03<br>చిత్ర రా. 10-18<br>ఉ.శే.వ. 6-40 వ<br>తె.వ. 4-27 ల | 22<br>కార్తీక శు॥ పాడ్యమి<br>సా. 5-52<br>స్వాతి రా. 12-41<br>ఉ.శే.వ. 6-13 వ | 23<br>విదియ<br>రా. 7-55<br>విశాఖ తె. 3-16<br>ఉ.వ. 6-53 ల<br>8-39 | 24<br>తదియ<br>రా. 10-01<br>అనూరాధ<br>తె. 5-51<br>ఉ.వ. 7-42 ల<br>9-28 | 25<br>చవితి<br>రా. 12-01<br>జ్యేష్ఠ పూర్తి<br>ప.వ. 12-02 ల<br>1-48 |
| 26<br>పంచమి<br>రా. 1-46<br>జ్యేష్ఠ ఉ.8-20<br>సా.వ.5-03 ల<br>6-47 | 27<br>షష్ఠి తె. 3-07<br>మూల<br>ఉ. 10-29<br>ఉ.వ. 8-44 ల<br>10-29<br>రా.వ. 8-46 ల<br>10-29 | 28<br>సప్తమి తె. 4-02<br>పూర్వాషాఢ<br>ప. 12-13<br>రా.వ. 8-39 ల<br>10-20 | 29<br>అష్టమి తె. 4-26<br>ఉత్తరాషాఢ<br>ప. 1-31<br>సా.వ. 5-39 ల<br>7-18 | 30<br>నవమి తె. 4-20<br>శ్రవణం<br>ప. 2-19<br>సా.వ. 6-22 ల<br>7-59 | 31<br>దశమి తె. 3-42<br>ధనిష్ఠ ప. 2-37<br>రా.వ. 9-46 ల<br>11-21 | |

02 మహాత్మాగాంధీ జయంతి/ విజయ దశమి

01 మహార్నవమి

04 యజ్ ధహుమ్ షరీఫ్

03 విజయ దశమి తదుపరి దినం

20 దీపావళి

19 నరక చతుర్థి

### హస్త-చిత్త కార్తెలు (28.09.25 నుండి 24.10.25)

| | | |
|---|---|---|
| జొన్న | : | జులై నెలలో విత్తిన పైరులో సస్యరక్షణ. రబీ జొన్న విత్తుట, సస్యరక్షణ. |
| కాయధాన్యాలు | : | కోతలు, దీర్ఘకాలపు కందికి సస్యరక్షణ, ఉలవ, శనగ విత్తుట. |
| వేరుశనగ | : | కాయ తీయుట. |
| కుసుమ | : | విత్తుట |
| వరి | : | ఎలుకల నిర్మూలన |
| మొక్కజొన్న | : | కోతలు. |
| ప్రత్తి | : | సస్యరక్షణ. |
| ఆముదం | : | పైరులో కాయ తీయుట ప్రారంభించుట. |
| కొర్ర | : | కోతలు. |

### స్వాతి కార్తె (25.10.25 నుండి 06.11.25)

| | | |
|---|---|---|
| ఆముదం | : | రబీ ఆముదం నీటి వసతి ఉన్నచోట విత్తుట |
| జొన్న | : | రబీ జొన్నలో సస్యరక్షణ, ఖరీఫ్‌లో వేసిన తక్కువ పంట కాలపు రకాలు కోతకు వచ్చుట. |
| వేరుశనగ | : | కాయ తీయుట. |
| ప్రొద్దుతిరుగుడు | : | కోయుట. |
| మొక్కజొన్న | : | రబీ పంటకు విత్తనాలు వేయుట. |
| పశుగ్రాసాలు | : | చలి కాలపు పశుగ్రాసాలు విత్తుట (పిల్లి పెసర, లూసర్న్). |
| మంచిశనగ | : | విత్తుట. |
| కుసుమ | : | సస్యరక్షణ. |

# డిజిటల్ వ్యవసాయం అవలంభిద్దాం... మానవ రహిత వ్యవసాయం వైపు అడుగులు వేద్దాం...



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక వంటిది. అయితే, ఈ రంగం అనేక సంక్లిష్ట సవాళ్ళను ఎదుర్కొంటోంది. చిన్న భూ కమతాలు, ప్రచ్ఛన్న నిరుద్యోగిత వల్ల పెరుగుతున్న కార్మిక వ్యయాలు, అధిక ఎరువుల వినియోగం, యువత వ్యవసాయం పై మక్కువ చూపకపోవడం వంటి సమస్యలు ప్రధానంగా నిలుస్తున్నాయి. గ్రామీణ యువత వ్యవసాయాన్ని తక్కువ లాభదాయకమైన, వీటితోపాటు శ్రమాధారితమైన, కొత్త ఆవిష్కరణలు లేని వృత్తిగా భావిస్తూ దూరంగా వెళ్తున్నారు. ఈ వాస్తవ పరిస్థితులు సంప్రదాయ పద్ధతులను ఆధునిక సాంకేతికతలతో మేళవించి వ్యవసాయాన్ని తెలివైన, స్థిరమైన, భవిష్యత్ సిద్ధమైనదిగా మార్చే కొత్త దృక్పథాన్ని కలుగజేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఆఫ్ ఇండియా కృత్రిమ మేధస్సు (ఏఐ), ఐఓటి, డ్రోన్లు, భౌగోళిక సాంకేతిక పరిష్కారాలను వినియోగిస్తూ ఖచ్చితత్వం, సామర్థ్యం, స్థిరత్వాన్ని సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

తెలంగాణ రాష్ట్రం డిజిటల్ వ్యవసాయ రంగంలో దేశంలో ముందంజలో ఉంది. అగ్రికల్చరల్ డేటా ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫాం, ఎన్ఇజిపిఏ వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు పారదర్శకత, సామర్థ్యం, డేటా ఆధారిత సూచనలను అందిస్తోంది. చిన్న మరియు సన్నకారు రైతులకు ఈ వేదికలు విశేష ప్రాముఖ్యత ఇస్తున్నాయి. సమయానుకూలంగా సమాచారాన్ని అందించడం ద్వారా అధిక రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ఖర్చులను తగ్గించడం, మార్కెట్ లభ్యతని పెంచడం వీలవుతుంది. ముఖ్యంగా, ఇవి వ్యవసాయాన్ని ఆకాంక్షించదగిన వృత్తిగా మార్చి యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వ్యవసాయాన్ని సాంకేతికత ఆధారిత, అవకాశాలతో నిండిన రంగంగా పున:కల్పన చేసుకునేలా చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ & టెక్నాలజీ (డిజిటల్ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం)ను ఏర్పాటు చేసింది. పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఏకీకృతం చేస్తూ, ఫార్మ్ ఇంప్లిమెంట్స్ అండ్ మెషినరీ రీసెర్చ్ స్కీమ్, వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, డ్రోన్ అకాడమీ, రిమోట్ సెన్సింగ్ & జిఐఎస్ ల్యాబ్ వంటి యూనిట్లను ఒకే వేదిక కింద సమన్వయం చేసింది. ఈ కేంద్రం, డిజిటల్ ఇండియా, పిఎమ్‌కెఎస్‌వై, నాబార్డ్, ఆత్మనిర్భర్ భారత్ వంటి జాతీయ కార్యక్రమాలతో అనుసంధానమై వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెంచి తద్వార రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడం వంటి లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తుంది.

పిజెటిఏయు డిజిటల్ వ్యవసాయ కేంద్రం (సిడిఏటి) అనేక ప్రత్యేక ప్రయోగశాలలు; అగ్రికల్చర్ ఆటోమేషన్ ల్యాబ్ (స్మార్ట్ యంత్రాల అభివృద్ధి), స్మార్ట్ & ప్రిసిషన్ అగ్రికల్చర్ ల్యాబ్ (డేటా ఆధారిత ప్రణాళికలు, ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లోలు), అగ్రానమీ టెక్నాలజీ సొల్యూషన్స్ ల్యాబ్ (ఏఆర్/విఆర్ ఆధారిత స్థిరమైన అగ్రానమీ శిక్షణ), అడ్వాన్స్ డ్రోన్ టెక్నాలజీ ల్యాబ్ (పంటల పర్యవేక్షణ, స్ప్రేయింగ్, మ్యాపింగ్, స్వదేశీ డ్రోన్ అభివృద్ధి), అగ్రికల్చరల్ ఎక్విప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ (యంత్రాల రూపకల్పన, మెకనైజేషన్), జియోస్పేషియల్ ఫార్మింగ్ సొల్యూషన్స్ ల్యాబ్ (జిఐఎస్, జిపిఎస్, రిమోట్ సెన్సింగ్ వినియోగాలు) మరియు ఇంక్యుబేషన్ & ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఐ, ఐఓటి, డ్రోన్ ఆధారిత స్టార్టప్‌లకు మద్దతు) ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమై ఉంది. ఇవన్నీ కలిపి విద్యార్థులు, రైతులు, అగ్రిప్రెన్యూర్లను డిజిటల్ వ్యవసాయ నైపుణ్యాలతో సన్నద్ధం చేస్తున్నాయి. ఈ దృష్టితో తెలంగాణలో ప్రతి చిన్న రైతుకూ స్మార్ట్ వ్యవసాయం అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా సమగ్రతను, నైపుణ్యాభివృద్ధిని, వ్యవసాయ పారిశ్రామికోత్పత్తిని పెంపొందించే దిశగా పనిచేస్తోంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానమై, తెలంగాణను డిజిటల్ వ్యవసాయంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. మన రైతాంగం కూడ డిజిటల్ వ్యవసాయంపై అవగాహన పెంచుకొని సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసుకొని అధిక లాభం సాధిస్తారని ఆశిస్తూ.....

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- వానాకాలం వరి పంటలో అక్టోబర్ మాసం అత్యంత కీలకమైనది. ఎందుకంటే ఈ మాసంలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వరి పంట ఎక్కువ శాతం పిలకలు తొడిగే దశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నది. చిరుపొట్ట దశలో ఉన్న వరి పొలాలకు ఆఖరి దఫా ఎరువులను (25-30 కిలోల యూరియా మరియు 12 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) బురద పదునులో వేయాలి.
- రైతులు క్రమం తప్పకుండా పొలంలోను, గట్ల వెంబడి తిరుగుతూ పురుగుల / తెగుళ్ళ ఉధృతిని గమనిస్తూ ఉండాలి. సమగ్ర సస్యరక్షణ పద్ధతిలో పురుగుల / తెగుళ్ళ నివారణ చేపట్టడం వలన ఖర్చు, వాతావరణ మరియు ఆహార కాలుష్యం తగ్గుతుంది. నష్టపరిమితిస్థాయి దాటిన పరిస్థితుల్లోనే మందులు పిచికారి చేసుకోవాలి.
- వరి పంట పూతదశలో ఉన్నప్పుడు వర్షాలు కురిసినచో వరిలో మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉంది. ముందుగా వేసిన ప్రాంతాల్లో పూతదశలో కనుక వర్షాలు సెప్టెంబర్ మాసంలో పడినప్పుడు తెగుళ్ళ మందులను మధ్యాహ్నం తర్వాత పిచికారి చేయాలి. మానిపండు తెగులు నివారణకు వరి పంట పూతదశలోనే తెగుళ్ళ మందులు పిచికారి చేయాలి. తర్వాత దశలో అనగా గింజ గట్టిపడే దశలో పిచికారి చేసినా ఎటువంటి ప్రయోజనం ఉండదు. వరిపైరు ఈనే దశలో (10-15% పూతదశ) ఆ తర్వాత 7-10 రోజుల వ్యవధిలో రెండవసారి ఎకరానికి కార్బండాజిమ్ 200 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 160 గ్రా. పిచికారి చేయాలి.
- పొట్టకుళ్ళు మరియు గింజ నల్లమచ్చ తెగులు నివారణకు మానిపండు తెగులుకు సిఫారసు చేయబడిన తెగుళ్ళ మందులను పూతదశలో మధ్యాహ్నం సమయంలో పిచికారి చేయాలి.

**బ్యాక్టీరియా ఎండాకుతెగులు:** ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే నత్రజని ఎరువును వేయటం తాత్కాలికంగా నిలిపి వేయాలి. తొలిదశలో వ్యాప్తిని నివారించడానికి వరి పైరు చిరుపొట్ట దశలో మాత్రమే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + ప్లాంటామైసిన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**అగ్గితెగులు:** ఈ తెగులును ఆకుమచ్చ దశలో నివారించకపోతే మెడవిరుపు తెగులు రావటానికి అధికంగా అవకాశం ఉంది. ముందుగా వరి పంటను వేసిన ప్రాంతాల్లో అధికంగా ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. అధిక మోతాదులో నత్రజని వేయడం, వాతావరణ పరిస్థితులు, గట్ల వెంబడి కలుపు అధికంగా ఉండటం వలన సన్నగింజ రకాలలో ఈ తెగులు అధికంగా ఆశిస్తుంది. గింజపాలు పోసుకునే దశలో లక్షణాలు గమనించిన వెంటనే నివారణకు ఐసోప్రోథయోలిన్ 1.6 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కాండం తొలిచే పురుగు:** చిరుపొట్ట దశలో రెక్కల పురుగులు లేదా గ్రుడ్ల సముదాయాలు గమనించిన వరి పైర్లలో తప్పనిసరిగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎస్‌పి 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుముడత:** కాండం తొలిచే పురుగు / మొగి పురుగు నివారణకు సిఫారసు చేసిన మందులతో ఈ పురుగును నివారించవచ్చును. వీటికి అదనంగా ఫ్లూబెండమైడ్ 48 ఎస్.సి 0.1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవచ్చును.

**ఆకు మరియు కంకినల్లి:** నల్లి ఆకుల వెనుక భాగంలో చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు పచ్చగా మారతాయి. పొట్టదశలో లేతకంకుల నుండి రసాన్ని పీల్చడం వలన గింజ తాలు పోవడం లేదా రంగు మారడం జరుగుతుంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**సుడిదోమ:** దోమ ఉధృతిని బట్టి పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. చిరుపొట్ట దశలో దోమ ఉధృతికి దోహదపడే పురుగు మందులు పిచికారి చేయరాదు. ఈ పురుగు పిల్ల దశలో గమనిస్తే



బ్యుప్రొఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిల్ల మరియు పెద్ద పురుగులు గమనిస్తే డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.48 మి.లీ. లేదా ఎథిప్రోల్ + ఇమిడాక్లోప్రిడ్ 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి మొదళ్ళ దగ్గర పడేలా పిచికారి చేయాలి.

**డా॥ ఐ. స్వర్ణలత దేవి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218**

## మొక్కజొన్న

- మొక్కజొన్నలో గింజ పాలు పోసుకునే దశ మరియు గింజ గట్టి పడే దశలు చాలా సున్నితమైనవి కావున పంట బెట్టకు గురికాకుండా నీటిని అందజేయాలి.
- గింజ పాలు పోసుకునే దశలో పక్షులు మరియు అడవి పందుల బెడద తీవ్రంగా ఉంటుంది. పక్షుల బెడద నుండి కాపాడుటకై కంకులను ప్రక్కనున్న ఆకులతో చుట్టవలెను. పంట నలువైపులా 2-3 వరుసలలో ఈ పద్ధతి పాటించాలి. అలానే ఎరుపు రంగు మెరిసే రిబ్బన్లను ఉత్తర-దక్షిణ దిక్కుగా పంటకు రెండు అడుగుల ఎత్తులో కట్టి పంటను పక్షుల బారి నుండి కాపాడుకోవచ్చును.
- పక్వానికి వచ్చిన పైరులోని కండెల పైపొర ఎండిపోయి, గింజల అడుగు భాగంలో నల్లటి మచ్చ ఏర్పడినప్పుడు కోత చేపట్టాలి. కండెలను ఎండబెట్టి తేమను 15 శాతంకు తగ్గిన తర్వాత నూర్పిడి చేయాలి. నూర్పిడి అయిన గింజలను 10-12 తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టి నిలువ చేయాలి.
- యాసంగిలో మొక్కజొన్న విత్తుకోడానికి అక్టోబరు 15 నుండి నవంబరు 15 వరకు సరియైన సమయం. ఈ సమయంలో విత్తుకున్నట్లయితే పంటలో దిగుబడులు అధికముగా పొందుటకు అవకాశముంది.
- కిలో విత్తనానికి 6.0 మి.లీ సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేసి నీడలో ఆరబెట్టిన తర్వాత కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ మందును పట్టించి విత్తుకోవాలి. విత్తేటప్పుడు యాసంగిలో ఎకరాకు 50 కిలోల యూరియా, 75 కిలోల డి.ఎ.పి. మరియి 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి. చదును చేసిన పొలంలో 60 సెం.మీ. దూరంలో ఉత్తర-దక్షిణ దిశలలో బోదెలు వేసుకుని 20 సెం.మీ. దూరంలో బోదెకు దక్షిణం వైపున పై నుంచి 1/3 వ వంతు ఎత్తులో విత్తుకోవాలి. విత్తిన రెండు రోజుల లోపల నేలలో తేమ ఉండగానే అట్రజిన్ 50%, కలుపు మందును తేలిక నేలల్లో 800 గ్రా లేక బరువు నేలల్లో 1200 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినచో వెడల్పాకు కలుపును నివారించవచ్చును.

## చిరుధాన్యాలు

**జొన్న:** జూన్ మాసంలో విత్తుకున్న జొన్న పంట కోత దశకు వస్తుంది. పంటకోత లక్షణాలు అనగా గింజ క్రింది భాగంలో నల్లని చార ఏర్పడటం, గింజలోని పాలు ఎండిపోయి పిండిగా మారడం, గింజను నొక్కి చూస్తే గట్టిగా ఉండటం, మొదలగు లక్షణాలు గమనించి గింజలో తేమశాతం 12-15% ఉండేలా చూసుకొని పంటకోత చేపట్టాలి.

**యాసంగి జొన్న:** అక్టోబర్ రెండవ వారం నుండి నవంబర్ రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. క్రింద తెలిపిన రకాలు యాసంగి కాలముకు అనుకూలమైనవి. యం.35-1, సి.ఎస్.వి. 29 ఆర్, ఎస్.వి.టి. 68, ఎస్.వి.టి. 55. పైన తెలిపిన రకాలే కాకుండా సి.ఎస్.వి. 41, సి.ఎస్.వి. 31, పి.ఎస్.వి. 56, పి.వై.పి.ఎస్. 2 రకాలు కూడా యాసంగి కాలంలో సాగుచేసుకోవచ్చు.

**సజ్జ:** ప్రస్తుతము సజ్జ పంట గింజ గట్టి పడే దశలో ఉంది. అధిక వర్షాల వల్ల పొలంలో నిలిచి ఉన్న నీటిని తొలగించుకోవాలి. మొక్కలు పుష్పించే దశలో మబ్బులతో కూడిన ఆకాశం మరియు వర్షపు తుంపరులు తేనెబంక తెగులు వ్యాప్తికి దోహదం చేస్తాయి.



దీని నివారణకు పైరు పూత దశలో కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**రాగి:** రాగి పంట ప్రస్తుతం గింజ పాలుపోసుకునే దశల్లో ఉంటుంది. అధిక వర్షాల వల్ల పొలంలో నిలిచి ఉన్న నీటిని తొలగించుకోవాలి. యాసంగి పంటను అక్టోబర్ నుండి నవంబర్ వరకు విత్తుకోవచ్చు.

**కొర్ర:** ఈ మాసంలో పంట కోత దశలో ఉంటుంది. ఆలస్యంగా విత్తుకున్న పంటలను గులాబిరంగు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9182968409**

## వేరుశనగ

- వానాకాలంలో విత్తుకున్న వేరుశనగలో పురుగులు మరియు తెగుళ్ళు రాకుండా నివారణ చర్యలు చేపట్టే సమయమిది.
- లద్దె పురుగు ఆశించినట్లైతే ఎకరానికి 40 మి.లీ. ఫ్లూబెండమైడ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- శనగపచ్చ పురుగు ఆశించినట్లైతే క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకై 400 గ్రా. క్లోరోథాలోనిల్ లేదా 200 మి.లీ. టెబ్యుకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- వేరుశనగను ముఖ్యంగా యాసంగి కాలంలో సాగు చేస్తారు. (సెప్టెంబర్ 15-అక్టోబర్ 15) రబీలో సాగు చేసే వేరుశనగ పంటకు చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా మరియు నాణ్యమైన విత్తనాన్ని అధిక మోతాదులో ఉత్పత్తి చేయవచ్చు.
- ఎకరానికి 60-80 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ 2 డి.ఎస్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాండంకుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాలలో 2.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- వరి మాగాణుల్లో లేదా క్రొత్తగా వేరుశనగ సాగుచేసేటప్పుడు ఎకరాకు సరిపడే విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ని పట్టించాలి. వేరుకుళ్ళు మరియు కాండం కుళ్ళు తెగుళ్ళు ఎక్కువగా ఆశించే పరిస్థితులలో కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడిని పట్టించి విత్తుకోవాలి.
- ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండే విధంగా వరుసల మధ్య 23.5 సెం.మీ. మరియు వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఉండు విధంగా విత్తుకోవాలి.
- ఆఖరు దుక్కిలో ఎకరాకు 4-5 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 18 కిలోల యూరియాను విత్తే సమయంలోనే వేసుకోవాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో మరో 10-15 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. విత్తిన 2 రోజులలోపు (24-48) గంటలలోపు ఎకరాకు డైక్లోసులాం 84% డబ్ల్యుడిజి 12.4 గ్రా. లేదా పెండిమిథాలిన్ 38.7% సి.ఎస్ 700 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పంట విత్తిన 20 రోజుల వరకు కలుపు తీయడానికి వీలుకాని పరిస్థితులలో పైరులో మొలచిన కలుపును (వెడల్పాటి మరియు గడ్డిజాతి) 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపైర్ 10% ఎకరాకు 300 మి.లీ. లేదా ఎకరాకు ఇమాజామాక్స్ 35% + ఇమాజితాపైర్ 35% డబ్ల్యుజి కలుపు మందును 40 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.



## ఆముదం

- వానాకాలంలో విత్తుకున్న ఆముదంలో మొదటి గెల కోతకు వచ్చే సమయం. కోత కోసిన తర్వాత సరైన తేమశాతం వచ్చే వరకు ఎండబెట్టి నూర్పిడి చేసుకోవాలి.
- యాసంగిలో ఆముదం పంటను అక్టోబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 2.0 నుండి 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.
- కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ (మొలక కుళ్ళు తెగులు నివారణ), 3 గ్రా. కార్బండాజిమ్ (వడలు తెగులు నివారణ)తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ఆఖరి దుక్కిలో 2-3 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్, 24 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వేసుకోవాలి.
- పంట విత్తిన 40-60 రోజుల వరకు గుంటకతో వరుసల మధ్య అంతరకృషి చేసి కలుపును నివారించవచ్చు.
- విత్తిన తరువాత ఒక నీటి తడిని ఇవ్వాలి. తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా 10-15 రోజులకొక నీటి తడి ఇస్తే సరిపోతుంది.
- ఆముదంను రబీలో నల్లరేగడి నేలల్లో వరుసకు వరుసకు మధ్య 120 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 90 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. తేలిక నేలల్లో అయితే వరుసకు వరుసకు మధ్య 120 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య 45 సెం.మీ. దూరం ఉంటే సరిపోతుంది.
- పంటలో మొలక కుళ్ళు తెగులు గమనించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళను తడపాలి. ఎండుతెగులు గమనించినట్లైతే కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళలో పోసుకోవాలి. పంట విత్తిన 40-60 రోజుల వరకు కలుపు లేకుండా తీసివేయాలి. అంతరకృషిలో మట్టిని మొక్క మొదళ్ళ పైకి తోయాలి.
- పంట పై పొగాకు లద్దెపురుగు ఆశించిన ఆకులను ఏరి నాశనం చేయాలి. పురుగు తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 1.0 మి.లీ. నొవాల్యురాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దాసరి పురుగు గమనించినట్లైతే తొలిదశలో వేపనూనె 5 మి.లీ. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## నువ్వులు

- ఆగష్టు మాసంలో వేసిన నువ్వులు ప్రస్తుతం పూత మరియు కాయకట్టే దశలో ఉన్నాయి.
- ఈ సమయంలో వెర్రితెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. నివారణకు ఆక్సీడెమాటాన్ మిథైల్ 1.2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
- బూడిద తెగులు గమనించినట్లైతే నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బీహారి గొంగళి పురుగును గమనించిన వెంటనే క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- రసంపీల్చే పురుగుల నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పేనుబంక నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కాయతొలిచే పురుగు ఆశించినట్లైతే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- వానాకాలంలో విత్తుకున్న ప్రొద్దుతిరుగుడు ప్రస్తుతం ఆకర్షక పత్రాలు వికసించే దశలో ఉంది. ఈ దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఈ దశలో శనగపచ్చ పురుగు ఆశించే అవకాశం ఎక్కువ. తొలిదశలో ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లైతే థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



- పొగాకు లద్దెపురుగును గమనించినట్లైతే నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నెక్రోసిస్ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలను పాటించవలెను. పార్థీనియం కలుపును తీసివేయాలి. ఇమిడాక్లోప్రిడ్ 4.0 మి.లీ. 10 లీటర్ల నీటికి, థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు మరియు బూడిద తెగులు ఉధృతిని గమనించినట్లైతే ప్రొపికొనజోల్ 25% ఇసి 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బీహారి గొంగళి పురుగు పుష్పించే దశలో ఆశించి ఆకులను తిని మొక్కలు మోడుబారిపోతాయి. నివారణకై క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

డా॥ ఎమ్. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838

## సోయాచిక్కుడు

- ప్రస్తుతం సోయాచిక్కుడు పంట, గింజ గట్టిపడే దశ నుండి కోత దశలో ఉంది.
- గత నెల రోజులుగా మన రాష్ట్రంలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల పొలాలలో నీరు చేరడం వలన ఆంత్రాక్నోస్ కాయకుళ్ళు తెగులు గమనించడం జరిగింది.
- అలాగే, కొన్ని ప్రాంతాలలో మసి బొగ్గు మరియు రైజోక్టోనియా ఏరియల్ బ్లైట్ తెగుళ్ళు ఆశించి పంట ఎండిపోవడం గమనించడం జరిగింది.
- ఈ తెగుళ్ళతో పాటు, కాండం ఈగ ఉధృతి కూడా అధికంగా ఉండడం వలన పంట దిగుబడిపైన ప్రభావం చూపే అవకాశం ఉంది.
- అధిక వర్షాల నుండి పంటను కాపాడుకోవడానికి ముందుగా పొలాలలో నిలిచిన నీటిని తీసివేయాలి.
- తర్వాత, ఆంత్రాక్నోస్ కాయకుళ్ళు తెగులు, మసి బొగ్గు తెగులు మరియు రైజోక్టోనియా ఏరియల్ బ్లైట్ తెగుళ్ళ నివారణకు, ముందస్తు చర్యగా, 2.5 గ్రా. టెబ్యుకొనజోల్ 10% + సల్ఫర్ 65% డబ్ల్యు.జి లేదా 0.6 మి.లీ. పైరాక్లోస్ట్రోబిన్ + ఫ్లక్సాపైరోక్సాడ్ లేదా 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లేదా 2.0 గ్రా. మేథిరం + పైరాక్లోస్ట్రోబిన్ లేదా 1 మి.లీ. ప్రొపికోనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పైన తెలిపిన ఏదైనా ఒక శిలీంధ్ర నాశినితోపాటు, 0.4 మి.లీ. థయోమిథాక్సామ్ 12.6% + లామ్డాసైహలోత్రిన్ 9.5% లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 9.3% + లామ్డాసైహలోత్రిన్ 4.6% లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ వంటి పురుగుమందులను 10 గ్రా. 13:0:45 తో కలిపి పిచికారి చేయడం వలన కాండంతొలిచే ఈగను అదుపు చేయటంతో పాటు, పోషకాలు పైపాటుగా అందించడం వల్ల పంట దిగుబడి కూడా పెరుగుతుంది.
- పంట పూర్తి కాలం తర్వాత లేదా మొక్కల పైన మూడో వంతు కాయలు ఎండిన తర్వాత పంటను కోయాలి. పంట కోత సమయంలో గింజ తేమ శాతం 17-18 ఉండేటట్లు చూసుకోవాలి.
- కోత తర్వాత పంటను అలాగే ఒకరోజు పొలంలో ఆరనివ్వాలి. ఒకవేళ మబ్బులతో కూడిన వాతావరణం ఉంటే అదే రోజు కుప్ప వెయ్యాలి. ప్రతిరోజు సాయంత్రం కుప్పలను టార్పాలిన్లతో కప్పి ఉదయం తీసివేయాలి.
- కోత తర్వాత వీలైనంత తొందరగా నూర్పిడి చేయాలి. నూర్పిడి చేసేటప్పుడు గింజ పగలకుండా తక్కువ వేగంతో నూర్పిడి చేయాలి.
- నూర్పిడి అనంతరం, గింజలను 8-10% తేమ వచ్చే వరకు బాగా ఎండబెట్టి కొత్త గోనె సంచులలో నిలువ చేయాలి.

డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304



# అపరాలు

వానాకాలంలో విత్తిన కంది శాఖీయ దశలో ఉంది. అంతరకృషి ద్వారా కలుపు లేకుండా చూసుకోవాలి. మన రాష్ట్రంలో యాసంగిలో కందిని నీటి వసతి ప్రాంతాలలో సాగుచేసే అవకాశం ఉంది.

**యాసంగికి అనువైన కంది రకాలు:** డబ్ల్యు.ఆర్.జి-65, డబ్ల్యు.ఆర్.జి-53, డబ్ల్యు.ఆర్.జి-255, టి.డి.ఆర్.జి-59, యల్.ఆర్.జి-41, ఐ.సి.పి.యల్-87119, ఐ.సి.పి.హెచ్-2740, టి.డి.ఆర్.జి-4

**విత్తే సమయం:** సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు నల్లరేగడి నేలలు మరియు ఎర్రనేలలు అనుకూలం.

**విత్తన మోతాదు:** 5-6 కిలోలు / ఎకరాకు

**విత్తే దూరం:** 45-90×10 సెం.మీ. వరుసల మధ్య మొక్కల మధ్య దూరం నేల స్వభావం మరియు వర్షపాతంను బట్టి విత్తుకోవాలి.

**ఎరువులు:** 20 కిలోల నత్రజని మరియు 50 కిలోల భాస్వరంను ఆఖరి దుక్కిలో వేయాలి, పైరు 30-40 రోజుల మధ్య మరో 20 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

**అంతరకృషి:** తొలిదశలో కంది పైరు పెరుగుదల తక్కువగా ఉంటుంది. మొదటి రెండు నెలల వరకు తరచుగా గొర్రు / దంతి / గుంటకు ద్వారా అంతరకృషి చేసి కలుపు నివారణతో పాటు భూమిలో తేమను కూడా నిలుపుకోవచ్చును.

**కలుపు యాజమాన్యం:** పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3-1.6 లీ. చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గాని పిచికారి చేయాలి. సెప్టెంబర్ మాసంలో సాగు చేసిన కంది పైరులో అంతరకృషి చేసుకోవాలి.

**యాసంగికి అనువైన పెసర మరియు మినుము రకాలు:**

**పెసర:** యం.జి.జి-385, యం.జి.జి-351, యం.జి.జి-295, యం.జి.జి-347 మరియు డబ్ల్యు.జి.జి-42, ఐ.పి.యం-2-14, టి.యం-96-2.

**మినుము:** యం.బి.జి-1070, యం.బి.జి-207, ఎల్.బి.జి-707, ఎల్.బి.జి-752, టి.బి.జి-104, జి.బి.జి-1, పి.యు-31

**విత్తే సమయం:** పెసర మరియు మినుము సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు:** 7-8 కిలోలు / ఎకరాకు

**విత్తనశుద్ధి:** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసి తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసంపీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి పంటను కాపాడుకోవచ్చు. చివరగా విత్తే ముందు ఎకరానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను 10 కిలోల విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.

**అంతరకృషి:** పెసర / మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. 20 రోజుల, 30 రోజుల దశలో గొర్రు / దంతి ద్వారా అంతరకృషి చేస్తే కలుపు నివారణతో పాటు తేమను కూడా నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉంటే విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30 శాతం ఇసి ఎకరానికి 1.0-1.4 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గాని పిచికారి చేయాలి.

**శనగ:**

**దేశీ రకాలు:** నంద్యాల శనగ-1, జెబి-11, జెఎకెఐ-9218, జెబి-130, ధీర, నంద్యాల గ్రామ్-49, నంద్యాల గ్రామ్-452, నంద్యాల గ్రామ్-776 (ఎన్‌బిఇజి)-776.

**కాబులి రకాలు:** కెఎకె-2, పూలెజి-95311, లాం శనగ-7 (ఎల్‌బిఇజి-7), నంద్యాల గ్రామ్-119 (ఎన్‌జిఇజి-119), నంద్యాల గ్రామ్-810 (ఎన్‌బిఇజి-810)

**విత్తే సమయం:** అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షం వరకు



**విత్తన మోతాదు:** 34-36 కిలోలు / ఎకరాకు దేశీ, 40-44 కిలోలు / ఎకరాకు కాబులీ రకాలు,

**ఎరువులు:** 8 కిలోల నత్రజని మరియు 20 కిలోల భాస్వరం ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

**కలుపు నివారణ:** పెండిమిథాలిన్ 30% ఎకరానికి 1.0-1.4 లీ. 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే తగిన తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- ప్రస్తుతం రాష్ట్రంలో ప్రత్తి పంట పూత, కాత మరియు కాయ తయారీ దశలో ఉంది.
- మూడు నెలలు పైబడిన ప్రత్తి పంటకు పైపాటుగా యూరియా, పొటాష్ లేదా కాంప్లెక్స్ వంటి ఎరువులను వేయరాదు.
- పూత, కాత దశలో ఉన్న ప్రత్తి పంటపై 10 గ్రా. 13:0:45 (మల్టీ-కె) లేదా 19:19:19 (పాలిఫీడ్) లీటరు నీటికి చొప్పున లేదా 20 గ్రా. యూరియాను 10 నుండి 15 రోజుల వ్యవధిలో 2 లేదా 3 సార్లు పిచికారి చేసినట్లైతే కాయ ఎదుగుదల బాగుండి మంచి దిగుబడికి దోహదపడుతుంది.
- పూత, పిందె రాలకుండా మరియు కాయపై పగులు రాకుండా ఉండటానికి లీటరు నీటికి 2 గ్రా. బోరాన్ కలిపి పిచికారి చేయాలి.
- పూత, కాత దశలో ఉన్న చేనులో ముదురు ఆకులు పండాకుగా మారడం, ఈనెల మధ్య ఎరుపుగా మారడం, పసుపు పచ్చగా ఉండటం జరుగుతుంది. దీనికి గాను లీటరు నీటికి 10 గ్రా. చొప్పున మెగ్నీషియం సల్ఫేట్ మరియు యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో 2 లేదా 3 సార్లు పిచికారి చేసుకోవాలి.
- పొలంలో మరియు గట్లపైన వయ్యారిభామ, ఉత్తరేణి, తుత్తురు బెండ వంటి కలుపు మొక్కలు ఉంటే తల/ఆకు మాడు తెగులు (టొబాకో స్ట్రీక్ వైరస్ (టిఎస్‌వి)) లేదా గులాబి పురుగు ఆశించే అవకాశముంది కాబట్టి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- పచ్చదోమ, తామర పురుగుల నివారణకు లీటరు నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా సల్ఫోక్సాఫ్లోర్ 0.75 గ్రా. లాంటి మందులను మారుస్తూ పిచికారి చేయాలి.
- గులాబి రంగు పురుగు ఆశించినచో థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ + లామ్డా సైహలోత్రిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతిని బట్టి 7-10 రోజుల వ్యవధిలో 2 లేదా 3 సార్లు మందులను మార్చి పిచికారి చేయాలి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను పెట్టుకొని, పురుగు ఉధృతిని గమనించాలి.
- చేనులో ఎక్కడైనా 4 నుండి 5 మొక్కల్లో పిండినల్లి ఉన్నట్లు గమనించినట్లైతే ఆ మొక్కలను తీసివేసి కాల్చాలి. అవసరాన్ని బట్టి లీటరు నీటికి 3 మి.లీ. ప్రొఫెనోఫాస్ మందుతో పాటుగా జిగురు లాంటి శాండోవిట్ లేదా ట్రిటాన్ 1 మి.లీ. కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.
- ప్రత్తి పంట పూత, కాత దశలో వాతావరణం మబ్బులతో ఉండి చిరుజల్లు వర్షాలు పడినప్పుడు ముందుస్తుగా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ + 0.1 గ్రా. ప్లాంటామైసిన్ లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసినట్లైతే ప్రత్తిలో కాయకుళ్ళు రాకుండా ఉంటుంది.
- ప్రత్తి మొక్క కాండంపైన మచ్చలు మరియు ఆకు, కాయ పై నల్లని మచ్చలు లేదా కాయకుళ్ళు పోవడం లేదా ఎదగకపోవడం గమనించినట్లైతే లీటరు నీటికి 2.5 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ లేదా 3 గ్రా. కాపర్‌ఆక్సీక్లోరైడ్



లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లేదా 1 మి.లీ. క్రెసోక్సిమ్ మిథైల్ లాంటి మందులను మారుస్తూ 1 లేదా 2 సార్లు 10 నుండి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 8332970247**

## చెఱకు

నవంబర్ – డిసెంబర్ మాసాల్లో చెఱకును నాటుటకు అక్టోబర్ నుంచే నేలను తయారు చేసుకోవాలి. చెఱకు పంట ఒక మొక్క తోట మరియు రెండు మోడెం తోటలుగా 2–3 సంవత్సరాలు ఉంటుంది. కాబట్టి నేలను 45 సెం.మీ. లోతు వరకు ఇనుప నాగలితో దున్ని మెత్తగా లోతు దుక్కి చేసుకోవాలి. 4–6 వారాల ముందు సేంద్రియ ఎరువులను వేసి కలియదున్నాలి. చదును తరువాత కాలువలను, బోదెలను రిడ్జ్ మార్ లేదా రెక్కల నాగలితో వేసుకోవాలి. కాలువ వెడల్పు 30 సెం.మీ. లోతు 20 సెం.మీ. ఉండాలి. నీటి ముంపుకు గురయ్యే నల్లరేగడి మరియు ఒండ్రు నేలల్లో చెఱకు నాటటానికి ముందే ప్రతి 24 మీటర్ల దూరానికి 60 సెం.మీ. వెడల్పు, 40 సెం.మీ. లోతు గల మురుగు నీటి కాలువలను తీసుకోవాలి.

దీని వల్ల మండలం బాగా విస్తరించి పంట ఎదుగుదల అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత బాగా కుళ్ళిన పశువుల ఎరువు లేదా కంపోస్ట్ ఎరువును ఎకరానికి 10 టన్నుల చొప్పున వేసి చెఱకును నాటుటకు 4 నుండి 6 వారాల ముందు పళ్ళెపు దంతితో భూమిలో కలియదున్నాలి. బరువు నేలల్లో 5–6 టన్నులు వేసుకోవాలి. ఫిల్టరు మడ్డి దొరుకు ప్రాంతాల్లో ఎకరానికి 5–6 టన్నుల బాగా ఎండిన ఫిల్టరు మడ్డిని భూమిలో వేసి కలియదున్నాలి. ఒక టన్ను ఫిల్టరు మడ్డి వాడడం వల్ల 17 కిలోల నత్రజని, 7 కిలోల భాస్వరం మరియు 2 కిలోల పొటాష్ పంటకు అందించవచ్చు. ఈ ఎరువులు లభ్యం కాని ప్రాంతాల్లో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద వంటి వాటిని పెంచి 60 రోజుల తర్వాత నేలలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లను పళ్ళెపు దంతితో కలియదున్నితే పంట త్వరగా చివికి సారవంతమైన సేంద్రియ ఎరువుగా మారుతుంది. పచ్చిరొట్ట పంటలు భూమికి చేర్చడం వల్ల పంటకు భాస్వరం లభ్యత పెరగడమే కాకుండా, భూమికి నీటిని నిలుపుకునే శక్తి కూడా పెరిగి పంట బాగా పెరగడానికి దోహదపడుతుంది.

ప్రధానంగా వర్షాకాలంలో వచ్చే అధిక వర్షాలు, బలమైన గాలుల వలన చెఱకు తోటలు పడిపోయి దిగుబడి మరియు రసనాణ్యతలో తరుగుదల ఏర్పడుతుంది. ఈ పడిపోయిన చెఱకు తోటల నుండి తయారయిన బెల్లం నిల్వకు పనికి రాకుండా పోయి మార్కెట్లో సరైన ధర రాక రైతాంగం ఎంతో నష్టపోతున్నారు. ఏపుగా పెరిగే సమయంలో చెఱకు తోటను జడచుట్టినట్లైతే ఎలాంటి నష్టం జరుగకుండా నివారించుకోవచ్చు. చెఱకు పంటకాలం మరియు ఎదుగుదలను బట్టి 2–3 సార్లు జడచుట్టు వేసుకుంటే తోట పడిపోకుండా నివారించుకోవచ్చు. చెఱకులో ఆకురాల్చుట, జడ చుట్టడం వంటి పైపాటి పనులు పరోక్షంగా రసనాణ్యతను పెంచడానికి దోహదం చేస్తాయి. అదేవిధంగా మట్టిని ఎగద్రోయటం వలన చెఱకు పడిపోకుండా ఉండి, పిలకలు కూడా ఒకేసారి పక్వానికి వచ్చి రసనాణ్యతను పెంచేలా దోహదం చేస్తాయి. దీనివలన పీకపురుగులను మరియు కాండంతొలుచు పురుగులను కూడా తగ్గించవచ్చును. ఆకులను రెలచుట మొక్కలకు లాభదాయకం అయితే కొంతమంది రైతులు ఎండి ఎండని ఆకులను తీసివేసి 3 లేదా 4 పచ్చని ఆకులను మాత్రమే ఉంచి మిగిలినవి జడ కట్టుతుంటారు. కాని ఇలా చేయటం వలన తోటకు ప్రయోజనం చేకూరదు. అయితే జడ చుట్లు వేసుకునేటప్పుడు, అడుగు భాగాన మరియు ప్రక్కన ఉన్న ఆకులను మెలివేసి 5 సెం.మీ. వ్యాసం గల గడలకు వరుస పొడవునా జడచుట్లు వేసుకోవాలి. దీనివలన మొక్కకు సూర్యరశ్మి బాగా అందుతుంది. రైతాంగం జడ చుట్టునప్పుడు చెఱకు మొక్కపై కనీసం ఎనిమిది పూర్తిగా రూపొందిన పచ్చని ఆకులు ఉండునట్లు జాగ్రత్తపడితే లాభదాయకంగా ఉంటుంది.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం నైరుతి ఋతుపవనాలు మే 24వ తేదీన కేరళలో ప్రవేశించాయి. రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు మే 26వ తేదీన ప్రవేశించి రెండు రోజుల వ్యవధిలో అంటే మే 28వ తేదీ వరకు రాష్ట్రమంతటా విస్తరించాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 01.06.2025 నుండి 30.09.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 740.7 మి.మీ. గాను 988.3 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే 33 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైనది. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే -20 శాతం తక్కువ వర్షపాతం, జులై మాసంలో 5 శాతం సాధారణ వర్షపాతం, ఆగష్టు మాసంలో సాధారణ వర్షపాతం కంటే 75 శాతం మరియు సెప్టెంబర్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే 60 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి ఇప్పటి వరకు (24.09.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 108 శాతం (6730408), జొన్న - 71 శాతం (36239), మొక్కజొన్న - 124 శాతం (644652), ప్రత్తి - 94 శాతం (4594685), కంది - 73 శాతం (491690), పెసర - 72 శాతం (61696), మినుములు - 87 శాతం (28706) మరియు వేరుశనగ - 39 శాతం (10865) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 100 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 119 శాతం, పప్పుదినుసులు 74 శాతం, నూనె గింజల పంటలు 66 శాతం సాగుచేయటం జరిగింది.

వాతావరణ విభాగం సమాచారం ప్రకారం అక్టోబర్ మాసంలో భారతదేశంలో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం (115 శాతం) నమోదయ్యే సూచనలున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో అక్టోబర్ మాసంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి మరియు గరిష్ఠ ఉష్ణోగ్రతలు మధ్య తెలంగాణ మండలంలోని కొన్ని జిల్లాలలో సాధారణం కంటే ఎక్కువ మరియు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలలో సాధారణం కంటే తక్కువగా మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.

## అధిక వర్షాల నుండి పంటల సంరక్షణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు

- భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుండి మురుగు నీటిని తీసివేయాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు మొక్కల మొదళ్ళ చుట్టూ పోయాలి.
- ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి పాలిఫిడ్ (19:19:19) లేదా మల్టీ-కే (13-0-45) లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- తడిచిన ధాన్యాన్ని ఎండ పెట్టుకోవడం.
- కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట తడిచినట్లైతే వర్షం తగ్గిన తరువాత కంకులను నేరుగా ఎండ తగిలేలా రేకులను విడదీసి 3-4 రోజులు ఆరనివ్వాలి.
- సోయాచిక్కుడు, ప్రత్తి మొదలగు పంటలను శుభ్రంగా ఆరనిచ్చి నిలువ చేసుకోవాలి లేనట్లైతే రంగు మారడం మరియు బూజు పట్టడం జరుగుతుంది.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- దక్షిణ తెలంగాణ జిల్లాల్లో నల్ల రేగడి నేలల్లో నిలువ ఉండే తేమను ఉపయోగించుకుంటూ శనగ మరియు కుసుమ పంటలను అక్టోబర్ రెండవ పక్షంలో విత్తుకోవలెను.
- నీటి వసతి గల ప్రాంతాలలో ఆరు తడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, కంది, పెసర, మినుము, ఆవాలు మరియు జొన్న పంటలను విత్తుకోవాలి, అక్టోబర్ మొదటి పక్షం నుండి విత్తుకోవలెను.
- వరి పంట పూతదశలో అధిక వర్షాలు కురిసినట్లైతే మానిపండు మరియు గింజ నల్ల మచ్చ తెగులు ఆశించే అవకాశం కలదు. నివారణకు, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25% + టెబ్యుకొనజోల్ 50% (75 డబ్ల్యుజి) 160 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. లేదా పికాక్సీస్ట్రోబిన్ 7% + ప్రొపికోనజోల్ 12% ఎస్ సి 400 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.
- బత్తాయిలో మంగునల్లి ఆశించుటకు అనుకూలం. నివారణకు, 3 గ్రా. నీటిలో కరిగే గంధకము లేదా 3 మి.లీ. డైకోఫాల్ లేదా 1 మి.లీ. ప్రాపర్ జైట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# ఖరీఫ్ వరిలో దోమపోటు నివారణ చర్యలు

వై. స్వాతి, డా॥ ఎన్. సుమలత, కె. రామకృష్ణ, డా॥ ఎన్. సాయినాథ్, డా॥ పి. మధుకర్,
డా॥ పి. స్పందన భట్ మరియు డా॥ హరీష్ కుమార్ శర్మ
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల





తెలంగాణ రాష్ట్రంలో అతి ముఖ్యమైన ఆహార పంట అయిన వరి పంటను రైతాంగం ప్రధానంగా ఖరీఫ్ మరియు రబీ కాలాల్లో అధిక విస్తీర్ణంలోను, అతి తక్కువ విస్తీర్ణంలో వేసవిలో కూడా సాగు చేస్తున్నారు. ఈ పంటలో అధిక దిగుబడులు సాధించడానికి అధిక దిగుబడులనిచ్చే రకాలు ఉన్నప్పటికీ సరైన సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వలన కొన్ని రకాల చీడపీడల ఉధృతి అధికమై సగటు దిగుబడులు తగ్గుతున్నాయి. నత్రజనిని అధిక మోతాదులో వాడినప్పుడు, పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు మరియు పైరు తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకు క్లోరిపైరిపాస్ లేదా ప్రొఫెనోపాస్ లేదా లామ్డా సైహాలోత్రిన్ వంటి సింథటిక్ పైరిత్రాయిడ్ పురుగు మందులను వాడినప్పుడు సుడిదోమ ఉధృతి ఎక్కువవుతుంది. కావున, రైతులు నత్రజనిని సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడాలి. తొలిదశలో సుడిదోమ ఉధృతికి దోహదపడే మందులు వాడకుండా, దీపపు ఎరలను వాడి కొంతవరకు వాటిని అరికట్టి తదుపరి సరైన పురుగుమందులను వాడాలి.

### పురుగు లక్షణాలు:

తొలిదశలో పిల్ల పురుగులు తెలుపు వర్ణంలో ఉండి తదుపరి వర్ణంలోకి మారతాయి. తల్లి పురుగులు గోధుమ రంగులో ఉండి రెక్కలను కలిగి ఉండిగాని మరియు రెక్కలు లేనివిగాను ఉంటాయి. తల్లి పురుగులు 300-400 గుడ్లను ఆకు తొడిమలలో వరుసగా పెడతాయి. ఈ గ్రుడ్లు అరటిపండు ఆకారంలో ఉండి మెలితిరిగి ఉంటాయి. ఈ గ్రుడ్ల నుండి వచ్చిన పిల్ల పురుగులు మొదట్లో తెలుపు వర్ణంలో ఉండి తదుపరి గోధుమ వర్ణంలో మారతాయి. తెల్లమచ్చ దోమ పిల్ల పురుగులు లేత గోధుమ రంగులో ఉండి తల్లి పురుగులు తెలుపు వర్ణంలో ఉండి ముందు రెక్కల పైన ఒక నల్లటి మచ్చను కలిగి ఉండును. సుడిదోమ మరియు తెల్లమచ్చ దోమ పిల్ల మరియు తల్లి పురుగులు మొక్క మొదళ్ళ నుండి రసాన్ని పీల్చుకుంటాయి.

### నష్టపరచు విధానం:

పిల్ల మరియు తల్లి దోమలు నీటి పై భాగంలో దుబ్బుల మొదళ్ళ దగ్గర ఉండి రసాన్ని పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పొలంలో నీటిని గమనించినట్లైతే తెట్టులాగా తేలియాడుతూ కనబడుతాయి. పిలకదశలో మొదళ్ళ నుండి రసాన్ని పీల్చటం వలన పోషకాలు మొక్క పై భాగానికి చేరక ఎండిపోవటం జరుగుతుంది. దీనినే "హాపర్ బర్న్" లేదా "దోమపోటు" అంటారు. దోమలు దుబ్బుల నుండి రసాన్ని పీల్చి తేనె లాంటి చెక్కర పదార్థాన్ని విసర్జిస్తాయి. కొన్ని రోజుల తర్వాత ఈ చక్కెర పదార్థం పై నల్లటి మసి తెగులు అభివృద్ధి చెందుతుంది. దీనినే "సూటిమోల్డ్" అని అంటారు. ఇటువంటి గడ్డిని పశువులు తినడానికి ఇష్టపడవు. దోమ ఉధృతి పెరిగినప్పుడు కంకులు బయటకు రావు. గింజపాలు పోసుకునే దశలో దోమ ఆశించినట్లైతే గింజల్లో పోషకాలు నిండక తాలు గింజలుగా మారతాయి.

### నివారణ చర్యలు:

- పొలం గట్లపై పురుగుకి ఆశ్రయమిచ్చే సైపరస్ రోటండస్ మరియు పానికమ్ రిపెన్స్ అను కలుపు మొక్కలను లేకుండా చేయాలి.
- సిఫారసు చేసిన ఎరువులనే వాడాలి మోతాదుని మించి నత్రజని ఎరువులను వాడకూడదు.
- పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెట్టాలి.

- నాటే ముందు ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. ఖాళీ బాటలను తీయాలి. ఖాళీ బాటలు తీయలేని సమక్షంలో సెప్టెంబర్ మరియు అక్టోబర్ మాసాలలో పురుగు ఉధృతిని గమనించుకొని దుబ్బులను ఎడంగా చేయాలి.
- సుడిదోమను తొలిదశలో గమనించినప్పుడు పాయలను ఎడంగా చేసి మొదళ్ళ దగ్గర సూర్యరశ్మి తగిలే విధంగా చేసుకోవాలి. పిలకదశలో దుబ్బుకు 10-15, అంకురం నుండి ఈనిక దశలో దుబ్బుకు 20-25 దోమలు గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇథోఫిన్ప్రాక్స్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే బూప్రొఫెజిన్ 1.6 మి.లీ. లేదా డైనోటేఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ ఎథిప్రోల్ 0.25 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిం 0.485 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసే ముందు పొలంలో నీటిని తగ్గించి పాయలను తూర్పు పడమరల దిశలలో ఎడంగా చేసి మొక్కల మొదళ్ళ పై పురుగు మందు పడేటట్లు పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7032697271**

# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం"

## రైతు వేదికల వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శాస్త్రవేత్తల - రైతుల ముఖాముఖి - అక్టోబర్ 2025

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 1 | 07.10.2025 | యాసంగి అపరాల సాగులో ముఖ్య సూచనలు | డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర ఫోన్ నెం.: 8333818207/ 7675050041 |
| 2 | 14.10.2025 | యాసంగి నూనెగింజల సాగులో మేలైన యాజమాన్యము | డా॥ కె. సదయ్య, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం ఫోన్ నెం.: 8885331799 |
| 3 | 21.10.2025 | యాసంగి మొక్కజన్న సాగులో ముఖ్య సూచనలు | డా॥ డి. భద్రు, ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 8008572006 |
| 4 | 28.10.2025 | వరి మరియు ప్రత్తి కోతానంతరం పంట అవశేషాల వినియోగం - సూచనలు | డా॥ ఆర్ ఉమారెడ్డి, సహ పరిశోధన సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ ఫోన్ నెం.: 8332970385 |

# మొక్కజొన్నలో కోతకు ముందు పురుగుల నియంత్రణకు ఉపయోగించే మందుల వాడకంలో పాటించవలసిన సురక్షిత కాలం

డా॥ కె. వాణిశ్రీ, డా॥ జి. శ్రీదేవి, డా॥ యస్. ఉపేంధర్, యం. రాజశేఖర్, డా॥ బి. అపర్ణ, డా॥ యం. అరుణ, డా॥ సి. స్వాతి మరియు డా॥ డి. రాకేష్

పురుగుమందుల అవశేషాల పరిశోధన శాల, రాజేంద్రనగర్, హైదరాబాద్



ప్రపంచ వ్యాప్తంగా అత్యంత విస్తృతంగా సాగుచేసే పంటల్లో మొక్కజొన్న ఒకటి. ఇది ఒక బహుపరిమాణ ఉపయోగాలు గల పంట. మొక్కజొన్నను ముఖ్యంగా ధాన్యం కోసం, తీపిమొక్కజొన్నగా మరియు బేబీకార్న్‌గా ఉపయోగిస్తారు. ఈ మూడు రకాలు ఆహారంలో భాగం అయ్యే విధంగా ఉండడంతోపాటు కోళ్ళ పరిశ్రమలలో, పశువుల మేతగా మరియు ఇథనాల్ వంటి పరిశ్రమల ఉత్పత్తులకు ప్రధాన ముడిసరుకుగా ఉపయోగపడుతుంది. ఈ తరహా అవసరాలు పెరుగుతుండటంతో రైతులు అధిక దిగుబడి కోసం కృషి చేస్తున్నారు. అయితే ఈ దిగుబడులు సాధించాలంటే పంటను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా పేనుబంక వంటి హానికర కీటకాల నుండి పంటను కాపాడటానికి రైతులు విస్తృతంగా కీటకనాశన మందులను వాడుతున్నారు. కానీ ఈ మందులు వాడేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోతే పురుగుమందు అవశేషాలు పంటలో ఉండి మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని చేసే ప్రమాదం కలదు.

పురుగుమందుల అవశేషాలు అనగా పంటలపై చల్లే కీటకనాశిని లేదా శిలీంధ్రనాశనులు పూర్తిగా ఆవిరైపోకుండా కొంతశాతం పంట భాగాల్లో ముఖ్యంగా గింజల్లో, ఆకుల్లో, కాండాల్లో లేదా నేలల్లో మిగిలిపోతాయి. ఇవి తినే ఆహారంతో శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యానికి హానిని కలుగచేస్తాయి.

**పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉండటానికి గల కారణాలు:**

- అనుమతికి మించిన మోతాదులో మందులను వాడటం.
- అనుమతి లేని రసాయనాలను వాడటం.
- కోతకు ముందు సురక్షిత కాలం పాటించకపోవడం.
- పిచికారి సరిగా చేయకపోవటం మరియు ఎక్కువ సార్లు పిచికారి చేయటం.

ముఖ్యంగా తీపిమొక్కజొన్న మరియు బేబీకార్న్ రకాలు పంటకోత కోసిన వెంటనే వినియోగిస్తారు కాబట్టి, అత్యంత శ్రద్ధ అవసరం. వీటిలో తక్కువ ప్రాసెసింగ్ ఉంటుంది కనుక పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లైతే అది నేరుగా మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అలాగే బేబీకార్న్ పూత ప్రారంభమైన 3–5 రోజులకు కోతకు వస్తుంది. ఈ దశలో పురుగుమందుల అవశేషాలు అత్యధికంగా ఉండే ప్రమాదం ఉంటుంది, కావున ఆరోగ్యానికి హాని కలుగజేసే ప్రమాదం ఉంది. పురుగుమందుల అవశేషాలు మానవ ఆరోగ్యానికే కాకుండా మిత్రపురుగులు, సూక్ష్మజీవులు మరియు పర్యావరణానికి హాని చేస్తాయి. పురుగుమందుల అవశేషాలు నీటిలో కలిసిపోయి చెరువులు, బావులు, నదులను కలుషితం చేసి, జలచరాల జీవనానికి ప్రమాదం కలిగించవచ్చు. అందువలన

పురుగుమందులను సూచించిన పరిమాణంలో వాడటం అనేది రైతు యొక్క బాధ్యత మాత్రమే కాదు, సమాజం పట్ల తనకున్న కర్తవ్యం కూడా! కావున రైతులు తప్పనిసరిగా కొన్ని నియమాలు పాటించాలి.

**రైతులు పాటించాల్సిన ముఖ్యమైన నియమాలు:**

1. సి.ఐ.బి.ఆర్.సి సిఫార్సు చేసిన మందులనే వాడాలి.
2. ప్రతి మందుకు (సురక్షిత కాలం అంటే) - పంట కోతకు ముందు గడువు ఖచ్చితంగా పాటించాలి.
3. వ్యక్తిగత రక్షణ పరికరాలు (గ్లౌజులు, మాస్కులు) తప్పనిసరిగా వాడాలి.
4. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తూ, పురుగు నిర్ణీత తీవ్రత స్థాయి (ఇటిఎల్) దాటినప్పుడు మాత్రమే పురుగుమందులను వాడాలి.
5. పంట కాలాన్ని బట్టి సరైన మందులను మాత్రమే వాడాలి.

**కత్తెర పురుగు మరియు కాండంతొలుచు పురుగు నివారణకు:**

| మందు పేరు | మోతాదు (ఎకరానికి) | సురక్షిత కాలం |
|---|---|---|
| సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్ (విత్తనశుద్ధి కొరకు) | 6 మి.లీ. కిలో విత్తనానికి | 15-21 రోజులు |
| క్లోరాంట్రానిలిప్రోల్ | 80 మి.లీ. | 21 రోజులు |
| స్పినటోరం | 100 మి.లీ. | 21 రోజులు |
| ఇమామెక్టిన్ బెంజోయేట్ | 80 గ్రా. | 10 రోజులు |
| ఫ్లూబెండమైడ్ | 400 గ్రా. | 14 రోజులు |
| **పేనుబంక నివారణకు** | | |
| డైమిథోయేట్ | 400 మి.లీ. | 10-14 రోజులు |
| ఇమిడాక్లోప్రిడ్ | 50 మి.లీ. | 10 రోజులు |
| థయోమిథాక్సామ్ | 40 గ్రా. | 10 రోజులు |
| ఎసిటామిప్రిడ్ | 40 గ్రా. | 7-10 రోజులు |

పంటలు పండించడం ఒక్కటే కాకుండా పండిన పంట ఆరోగ్యకరంగా ఉండాలనే లక్ష్యాన్ని పొందాలంటే తప్పనిసరిగా సురక్షిత కాలం పాటించాలి. సురక్షిత కాలం పాటించడం వలన

- పురుగుమందు అవశేషాలు తగ్గుతాయి.
- వినియోగదారుల ఆరోగ్య భద్రత పెరుగుతుంది.
- మార్కెట్‌లో పంటకు మంచి విలువ (సరైన ధర) లభిస్తుంది.
- ఎగుమతులపై నిషేధాలను నివారించవచ్చును.

కాబట్టి రైతులు పైన సూచించిన జాగ్రత్తలను పాటిస్తూ సరైన మందులను వాడుతూ, సురక్షిత కాలాలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఆశిస్తున్నాం.



**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9494407924**

# తెలంగాణలో యాసంగి వేరుశనగ సాగు - యాజమాన్య పద్ధతులు

భావాజిగుడి శోభ రాథోడ్, డా॥ ఎస్. కవిత, డా॥ ఎమ్. శ్రీధర్ మరియు డా॥ టి. రాంప్రకాశ్
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం





ప్రపంచంలో వేరుశనగ ఉత్పత్తి 51.67 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉండగా, చైనా మొదటి స్థానంలో (16 మిలియన్ మెట్రిక్ టన్నులు), భారతదేశం రెండవ స్థానంలో (11.31 మిలియన్ మెట్రిక్ టన్నులు), నైజీరియా మూడవ స్థానంలో (4.30 మిలియన్ మెట్రిక్ టన్నులు) ఉంది. మనదేశంలో సోయాచిక్కుడు మరియు ఆవాలు తరువాత వేరుశనగ మూడో ముఖ్యమైన నూనెగింజ పంట. దీనిలో నూనె శాతం 48-50% వరకు, ప్రోటీన్‌లు 26-28% వరకు, అధిక శాతం పీచు, ఖనిజ లవణాలు మరియు విటమిన్‌లు కలిగి ఉంటుంది. కాబట్టి మన తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న ప్రధానమైన నూనెగింజ పంట వేరుశనగ.

వేరుశనగను "పీనట్, మంకీనట్, గ్రౌండ్‌నట్, ఎర్త్‌నట్, పల్లీకాయలు" అని వివిధ పేర్లతో పిలుస్తారు. ఇది వానాకాలంలో వర్షాధారంగా, యాసంగి మరియు వేసవిలో నీటిపారుదల క్రింద సాగు చేయబడుచున్నది. వేరుశనగ పంటను ప్రధానంగా యాసంగిలో నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల్, నారాయణపేట, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు.

నూనెగింజల పంటల్లో వేరుశనగ విస్తీర్ణం, ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ దానికి తగ్గ ఉత్పాదకత పొందలేక పోవడానికి గల ప్రధానమైన కారణం నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే విత్తనాలు వాడకపోవడం మరియు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవటం. వేరుశనగ సాగుచేసే ప్రాంతాన్ని బట్టి రకాల ఎంపిక, విత్తనశుద్ధి, సకాలంలో కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం, సాగు నీటి యాజమాన్యం మరియు సస్యరక్షణ చర్యలు సకాలంలో పాటించినట్లైతే పంట నష్టాన్ని తగ్గించి అధిక దిగుబడిని సాధించవచ్చు.

**విత్తనోత్పత్తి మరియు విత్తే సమయం:** వేరుశనగను ముఖ్యంగా వానాకాలం మరియు యాసంగిలో సాగు చేస్తారు. విత్తనోత్పత్తి చేయుటకు యాసంగి కాలం చాలా అనుకూలమైనది. యాసంగిలో సాగు చేసే వేరుశనగ పంటకు చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది మరియు నాణ్యమైన విత్తనాన్ని అధిక మోతాదులో ఉత్పత్తి చేయవచ్చు. ఈ పంటను యాసంగిలో ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండవ పక్షంలోపు, దక్షిణ తెలంగాణలో సెప్టెంబర్ మొదటి పక్షం నుండి నవంబర్ రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. వేసవిలో వేరుశనగ సాగును జనవరి మొదటి వారం నుండి చివరి వారం వరకు నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో విత్తుకోవచ్చు.

**నేలలు మరియు నేల తయారీ:** వేరుశనగకు ఇసుకతో కూడిన గరప నేలలు శ్రేష్ఠము. ఎర్రగరప నేలలు, చల్కా భూములు కూడా అనుకూలం. చౌడునేలలు, నీరు ఇంకని బంకనేలలు పనికిరావు. విత్తే ముందు నేలను మెత్తగా దుక్కి చేసి చదును చేసుకోవాలి.

**విత్తన ఎంపిక:** విత్తనాన్ని/రకాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు రైతులు తమ ప్రాంతానికి అనుకూలమైన రకాలను మరియు చీడపీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. యాసంగి నీటి వసతి క్రింద తెలంగాణ రాష్ట్రంలో సాగు చేయడానికి అనువైన వేరుశనగ రకాలు కదిరి-6, కదిరి-7, కదిరి-8, కదిరి-9, కదిరి హరితాంధ్ర (కె-1319), కదిరి లేపాక్షి (కె-1812), ధరణి (టి.సి.జి.యస్-1043), నిత్యహరిత (టి.సి.జి.ఎస్-1157), విశిష్ట (టి.సి.జి.ఎస్. 1694), జగిత్యాల పల్లి (జె.సి.జి. 2141), టి.ఏ.జి-24, అభయ, ఇ.సి.జి.వి-9114, జగిత్యాల-88

(జె.సి.జి-88), గిర్నార్-4 (జి.సి.జి.వి-15083) మరియు గిర్నార్-5 (ఐ.సి.జి.వి-15090) మొదలైనవి.

**విత్తన మోతాదు మరియు విత్తే దూరం:** ఒక ఎకరానికి కావలసిన విత్తనం అనేది దాని యొక్క 100 గింజల బరువు పై ఆధారపడి ఉంటుంది మరియు విత్తే సమయాన్ని బట్టి విత్తన మోతాదు మారుతుంది. నీటి పారుదల క్రింద ఎకరానికి 60-80 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. యాసంగిలో సాగు చేసేటప్పుడు వరుసల మధ్య 22.5 సెం.మీ. మరియు మొక్కలు మధ్య 10 సెం.మీ. దూరం ఉండే విధంగా ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలి.

**విత్తే పద్ధతి:** విత్తనాన్ని 5 సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి. విత్తనాన్ని గొర్రుతో గాని లేదా ట్రాక్టరుతో నడిచే విత్తే యంత్రంతో గాని విత్తుకోవాలి. ట్రాక్టరు ద్వారా నడిచే సీడ్ డ్రిల్ వాడినట్లైతే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవడమే కాక ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు. ఒక ఎకరానికి 2.5 నుండి 3 గంటల సమయం పడుతుంది.

**విత్తనశుద్ధి:** మొదలు కుళ్ళు తెగులు లేదా కాండంకుళ్ళు తెగులు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ 2 డి.సి లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. పొడిమందును పట్టించాలి. కాండంకుళ్ళు వైరస్ తెగుళ్ళు ఆశించే ప్రాంతాలలో ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ. లను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరుపురుగు ఆశించే ప్రాంతాలలో క్లోర్‌పైరిఫాస్ 6.5 మి.లీ. ఒక కిలో విత్తనానికి పట్టించాలి. కొత్తగా వేరుశనగ సాగు చేసే ప్రాంతాలలో ఒక ఎకరానికి సరిపడా విత్తనానికి 200 గ్రా. రైజోబియం అనే జీవన ఎరువుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. కుళ్ళు తెగుళ్ళు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేసుకోవాలి.

**ఎరువులు యాజమాన్యం:** సరియైన ఎరువును, సరియైన మోతాదులో, సరియైన సమయంలో, సరియైన పద్ధతిలో వాడటం అన్నది ఎరువుల యాజమాన్యంలో కీలకం. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా ఎకరానికి 3-4 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 18 కిలోల యూరియాను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. 10-15 కిలోల యూరియాను పూత దశలో వేసుకోవాలి. వేరుశనగకు కావలసిన ముఖ్యమైన పోషకాలను (కాల్షియం మరియు గంధకం) అందించే జిప్సంను ఎకరానికి 200 కిలోల ఊడలు దిగే సమయంలో మొదళ్ళ దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 48 గంటలలోపు డైక్లోసులామ్ 84% డబ్ల్యుడిజి అనే కలుపు మందును ఎకరానికి 12.4 గ్రా. లేదా పెండిమిథాలిన్ 38.7% అనే కలుపు మందును ఎకరానికి 700 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేసుకోవాలి. ఆ తరువాత దశలో ఆశించే కలుపును నివారించడానికి, కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు క్విజలోఫాప్-పి-ఈథైల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. వెడల్పాకు మరియు గడ్డిజాతి కలుపు ఉన్నట్లైతే ఇమాజితాపైర్ 10% ఎకరానికి 300 మి.లీ. లేదా ఇమాజితపైర్ + ఇమాజమాక్స్ అనే కలుపుమందును ఎకరానికి 40 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. విత్తిన 40 రోజుల తరువాత ఎటువంటి అంతర సేద్యం చేయరాదు.

**నీటి యాజమాన్యం:** విత్తే ముందు నేల బాగా తడిచేలాగా నీరు పెట్టి తగినంత పదును ఉన్నప్పుడు విత్తనం వేసుకోవాలి లేదా పొడి దుక్కిలో విత్తుకొని నీరు కట్టుకోవాలి. రెండవ తడిని మొలక వచ్చిన 20-25 రోజుల సమయంలో ఇవ్వాలి. ఇలా చేయడం వలన పంట ఒకేసారి పూతకు వస్తుంది. తర్వాత నీటి తడులను నేల లక్షణం, బంకమట్టి శాతాన్ని బట్టి 7-10 రోజులకు ఒక నీటితడిని ఇవ్వాలి. తేలికపాటి నేలల్లో 6-8 నీటితడులు అవసరం అవుతాయి. చివరి తడిని పంట కోతకు 4-7 రోజుల ముందు ఇవ్వాలి. సున్నిత దశలైన ఊడలు దిగే దశ నుండి కాయలు ఊరే దశ వరకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. నీటిని తుంపర్లు ద్వారా ఇచ్చినట్లైతే దాదాపు 25 శాతం నీరు ఆదా అయి, అధిక దిగుబడులు పొందవచ్చు.

**పంటకోత:** వేరుశనగ కాయలు భూమి లోపల ఏర్పడతాయి. కాయ లోపలి భాగం ముదురు గోధుమ రంగుకి మారినప్పుడు పంటకోత దశకు వచ్చిందని గుర్తించాలి. కోత అనంతరం మొక్కలకు కట్టలుగా కట్టి నీడ ఉన్న ప్రదేశంలో ఆరబెట్టడం వలన యాసంగిలో పండించే విత్తనం మొలకెత్తే సామర్థ్యం తగ్గడం అనే సమస్యను అధిగమించవచ్చును. కాయలలో తేమ 8-9 శాతం తగ్గే వరకు నీడలో ఆరబెట్టుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8142793155**

# యాసంగి ప్రొద్దుతిరుగుడులో అధిక దిగుబడుల కొరకు మేలైన యాజమాన్య పద్ధతులు


డా॥ డి.శ్వేత, డా॥ సిహెచ్. పల్లవి, డా॥ జి. సంతోష్ కుమార్, డా॥ ఎ. రమాదేవి మరియు ఎ. సరిత

వ్యవసాయ పరిశోధన స్థానం మరియు ఏరువాక కేంద్రం, తోర్నాల




భారతదేశంలో పండించే వివిధ రకాల నూనెగింజ పంటలలో ప్రొద్దుతిరుగుడు పంట చాలా ప్రాముఖ్యమైనది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 78% ప్రజలు వంట నూనెగా ప్రొద్దుతిరుగుడు నూనెను ఉపయోగిస్తారు. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి ఈ పంట యొక్క విస్తీర్ణం, ఉత్పత్తి మరియు ఉత్పాదకతను పెంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. తక్కువ కాల పరిమితి కలిగి త్వరగా పెరిగే గుణం ఉండి, ఏ కాలంలోనైన పండించుటకు అనువైన పంట ప్రొద్దుతిరుగుడు. యాసంగిలో వరికి బదులుగా మరియు ఆరుతడి పంటగా ప్రొద్దుతిరుగుడు లాభదాయక ప్రత్యామ్నాయ పంట. తెలంగాణాలో యాసంగిలో 21,491 ఎకరాలలో ప్రొద్దుతిరుగుడు సాగు చేయగా, అందులో ముఖ్యంగా సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి మరియు మెదక్ జిల్లాలో పండిస్తున్నారు. ప్రొద్దుతిరుగుడులో కింద పేర్కొన్న యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చు.

**నేలలు:** ప్రొద్దుతిరుగుడు సాగుకు సారవంతమైన నేలలు బాగా అనుకూలం. నీరు నిల్వ ఉండని సారవంతమైన ఎర్ర చల్కా, రేగడి, ఒండ్రు నేలలు మరియు నీటి వసతి ఉన్నట్లైతే తేలిక నేలలు ప్రొద్దుతిరుగుడు పంట సాగుకు అనుకూలం.

**రకాలు:** ప్రొద్దుతిరుగుడులో రకాల కంటే సంకరాలు ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థల సంకర రకాలైన తిల్హన్ టెక్-ఎస్.యు.ఎస్.హెచ్-1, ఎన్.డి.ఎస్.హెచ్-1012, కె.బి.ఎస్.హెచ్-44, డి.ఆర్.ఎస్.హెచ్-1 మరియు ప్రైవేటు కంపెనీలకి చెందిన మంచి సంకర రకాలు అందుబాటులో కలవు.

**విత్తన మోతాదు మరియు విత్తనశుద్ధి:** సాధారణంగా ఒక ఎకరానికి 2.5-3.0 కిలోల విత్తనం సరిపోతుంది. పంట మొదటి దశలో ఆశించే చీడపీడల నివారణకు విత్తనశుద్ధి తప్పనిసరిగా అవలంభించాలి. ప్రొద్దుతిరుగుడులో నెక్రోసిస్ వైరస్ తెగులు సమస్యను అధికమించడానికి ఒక కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 3.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 5.0 మి.లీ. కలిపి శుద్ధి చేయాలి.

**విత్తే సమయం:** యాసంగిలో సాధారణ దుక్కి పద్ధతిలో లేదా వరికోతలు తర్వాత జీరో టిల్లేజ్ పద్ధతిలో నవంబర్ మరియు డిసెంబర్ నెలలో విత్తుకోవచ్చు. వరికోతలు ఆలస్యమైన ప్రాంతాలలో మరియు వేసవిలో జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.

**విత్తే పద్ధతి మరియు దూరం:** సాధారణంగా కాలువలు బోదెల పద్ధతిలో, తేలిక నేలల్లో 45 సెం.మీ × 20-25 సెం.మీ. (ఎకరాకు 35,555 - 44,444 మొక్కలు), నల్ల రేగడి భూముల్లో 60 సెం.మీ. × 30 సెం.మీ. (ఎకరాకు 27,777 మొక్కలు) దూరం ఉండేలా విత్తుకోవడం వలన అధిక దిగుబడులను సాధించవచ్చు. యాంత్రిక పద్ధతి సీడ్ డ్రిల్ ఉపయోగించి కూడా

ప్రొద్దుతిరుగుడు విత్తుకోవచ్చు విత్తిన 15 రోజులు కుదురుకు ఒక మొక్క ఉంచి మిగిలినవి మొక్కలను తీసివేయాలి.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరాకు 2-3 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫారసు చేయబడిన మోతాదులో పోషకాలు వాడాలి. యాసంగి పంటకు ఎకరాకు 30 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఎరువులు వేయాలి. నత్రజని ఎరువులను సగం విత్తే ముందు, మిగతా సగం 2 దఫాలుగా 30 రోజులు మరియు 55 రోజులకు వేయాలి. బోరాన్ పూత దశలో చాలా కీలకమైన పాత్రను పోషించి పంట ఎదుగుదలలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. బోరాన్ లోపించిన యెడల మొక్కలు లేత మరియు మధ్య ఆకులలో చివర్లు గుండ్రంగా మారి వంకర్లు తిరుగుతాయి. పువ్వు చిన్నదిగా ఉండి పుప్పొడి ఉత్పత్తి తగ్గి గింజలు తక్కువగా ఏర్పడతాయి. కాబట్టి ఆకర్షక పత్రాలు వికసించు దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఒక ఎకరాకు 55 కిలోల జిప్సమ్‌ని వేయడం వలన నూనె శాతం పెరుగుతుంది. పూత దశలో ప్రొద్దుతిరుగుడు మొక్క తలల యొక్క పుప్పొడిని దూదితో లేదా చేతితో జాగ్రతగా ఉదయం 8 నుండి 12 గం.ల వరకు రోజు విడిచి రోజు సున్నితంగా అద్దడం వల్ల ఎక్కువ గింజ కట్టి అధిక దిగుబడి వచ్చే ఆస్కారం ఉంది.

**కలుపు నివారణ:** ప్రొద్దుతిరుగుడులో మొదటి 20-25 రోజులు కీలక దశ. విత్తిన 24-48 గంటలలోపు తేమ గల నేలపై పెండిమిథాలిన్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంట 25-30 రోజుల దశలో అంతర సేద్యం గుంటక/దంతి ద్వారా లేదా యాంత్రికంగా చేయాలి.

**నీటి యాజమాన్యం:** ప్రొద్దుతిరుగుడులో మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ మరియు గింజ కట్టే దశ కీలకం. ఈ పంట దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. నేల రకము మరియు వాతావరణ పరిస్థితులను బట్టి ఎర్ర నేలల్లో 8-10 రోజుల్లో, నల్ల రేగడి నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి. బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్రతి 2-3 రోజుల కొకసారి 40-60 నిమిషాలు పాటు ఇవ్వాలి. ఈ పద్ధతి ద్వారా 20-25% నీరు ఆదా అవుతుంది.

**పంట కోత:** పువ్వు వెనక భాగం నిమ్మ పచ్చ రంగులోకి మారిన తర్వాత కోత యంత్రం చేత లేదా కూలీల సాయంతో పంటను కోయాలి. కోత అనంతరం పువ్వులను 2-3 రోజులు ఆరనిచ్చి కర్రలతో కొట్టి గాని, ట్రాక్టర్‌తో నడిపి నూర్పిడి చేసి గింజను వేరుచేసుకోవచ్చు. గింజల్లో తేమ 9-10 శాతం వచ్చేవరకు ఎండబెట్టాలి.

సరైన యాజమాన్య పద్ధతులను పాటించినప్పుడు ఎకరాకు 8-9 క్వింటాళ్ళ దిగుబడి ఆశించవచ్చు. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటాలుకు 6,700-7,200 రూపాయలు వరకు ఉంది ఎకరాకు 25,000 వరకు ఖర్చు అయినా 33,000-35,000 వరకు నికరాదాయంను ఆశించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9493218700**

**సెప్టెంబర్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1 | 08.09.2025 | ప్రత్తిలో తలమాడు తెగులు - నివారణ |
| 2 | 09.09.2025 | పసుపు - దుంప తొలుచు ఈగ నివారణ |
| 3 | 11.09.2025 | వరి బ్యాక్టీరియా ఎండాకు తెగులు - నివారణ |
| 4 | 15.09.2025 | 50-60 రోజుల దశలో ప్రత్తిలో కలుపు నివారణ |
| 5 | 18.09.2025 | కందిలో కలుపు నివారణ |
| 6 | 19.09.2025 | వరిని ఆశిస్తున్న ఈగ - నివారణ చర్యలు |
| 7 | 20.09.2025 | మొక్కజొన్నలో కలుపు నివారణ |
| 8 | 24.09.2025 | అధిక వర్షపాతం - మొక్కజొన్నలో సూచనలు |
| 9 | 30.09.2025 | వరిలో మానిపండు తెగులు - నివారణ |

# ఆయిల్ పామ్‌లో పోషకాల లోపాలు - యాజమాన్యం



డా॥ యం.వి. ప్రసాద్, డా॥ ఆర్.పి. ప్రేమలత,
ఆర్. సాయి కిరణ్ మరియు కె. వంశీ కృష్ణ

**ఐ.సి.ఏ.ఆర్-భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ, పెదవేగి, ఏలూరు, ఆంధ్ర ప్రదేశ్**

వంట నూనె దిగుబడినిచ్చే పంటలలో కెల్లా అత్యధిక నూనె దిగుబడి నిచ్చే పంట ఆయిల్ పామ్. ఈ పంటను తెలుగు రాష్ట్రాల్లో సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగునీటి ఆధారంగా సాగు చేస్తున్నారు. ఈ పంట మంచి దిగుబడికి ప్రధానంగా రెండు అంశాలు ప్రభావితం చేస్తాయి. ఒకటి సాగు నీటి యాజమాన్యం రెండవది సమగ్ర పోషకాల యాజమాన్యం. ఆయిల్ పామ్‌కు క్రమం తప్పకుండ ప్రతిరోజూ (వర్షం కురిసినప్పుడు కాకుండా) సిఫారసు చేసిన మేరకు సాగు నీరందించాలి. అత్యధిక లేదా అత్యల్ప సాగు నీటి వాడకం ఈ పంట దిగుబడి మీద ప్రభావం చూపుతుంది. ఆయిల్‌పామ్ సాలీనా సరాసరి హెక్టారుకు 20-25 టన్నుల గెలల దిగుబడినిస్తుంది. ఈ పంట 25-30 సంవత్సరాలు ఏడాది పొడవునా దాదాపు 24-30 ఆకులను మరియు 10-12 గెలలను ఉత్పత్తి చేస్తుంది.

ప్రతి నెలా గెలల కోత జరుగుతున్న క్రమంలో గెలలతో పాటు దాని క్రింద నున్న ఆకులను కూడా కొయ్య వలసి వస్తుంది. ఇలా చెట్టునుండి కోసిన గెలల మరియు ఆకుల ద్వారా పోషకాల నిల్వలు తగ్గిపోతాయి. మంచి దిగుబడులకు గాను ఇలా క్రమంగా తగ్గి పోతున్న పోషకాలను తిరిగి మొక్కలకు అందించాలి. ఈ పంటలో పోషకాల వినియోగ పరిమాణం తోటకు తోటకు (వయసును బట్టి, నేలను మరియు ఎదుగుదలను బట్టి) మారుతుంది. కావున ఈ పంట మంచి ఎదుగుదలకు మరియు సుస్థిర దిగుబడికి సమగ్ర, సమతుల్యమైన మరియు సమృద్ధయిన పరిమాణంలో సూక్ష్మ మరియు స్థూల పోషక పదార్థాలను అందించాలి. ఈ పంటకు సిఫారసు చేసిన పోషకాలు, పోషక లోప లక్షణాలు మరియ వాటి యాజమాన్యం గురించి తెలుసుకొందాం.

## ఆయిల్‌పామ్‌లో ముఖ్యమైన పోషకాలు మరియు వాటి ఆవశ్యకత

మొక్కలు లేదా పంట సక్రమంగా పెరిగి, సరైన దిగుబడులు ఇవ్వాలంటే గాలి, నీటితో పాటు పలురకాల పోషకాలు అందుబాటులో ఉండాలి. అయితే ఈ పోషకాల్లో కొన్ని పోషకాలు మొక్కలకు ఎక్కువ పరిమాణంలో మరికొన్ని తక్కువ పరిమాణంలో అవసరం అవుతాయి. మొక్కకు అధిక పరిమాణంలో కావలసిన నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలను ముఖ్య పోషకాలని, ఒక మోస్తరు పరిమాణంలో కావలసిన పోషకాలైనటువంటి కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్లను ఉపపోషకాలని, అత్యంత స్వల్ప పరిమాణంలో కావలసిన పోషకాలను సూక్ష్మపోషకాలని అంటారు. జింకు, రాగి, మాంగనీసు, బోరాన్‌ను, మాలిబ్డినం, క్లోరిన్ వంటి పోషకాలు సూక్ష్మపోషకాల కోవకు చెందినవి.

మొక్కలకు అవసరమైన పోషకాల్లో ఏ పోషకం లోపించినా అది చేసే పని కుంటుపడి దాని ప్రభావం వల్ల దిగుబడి తగ్గుతుంది. అందువల్ల పోషక లోప లక్షణాలను సరైన సమయంలో గుర్తించి వాటి నివారణ చర్యలు చేపట్టినట్లయితే సరైన దిగుబడులు పొందే అవకాశం ఉంది. మొక్కలపై ముఖ్యపోషక, ఉపపోషక లోప లక్షణాలు ముదురు ఆకుల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఇప్పుడు మనం వివిధ పోషకాలు మొక్కలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, పోషకాలు మొక్కల అవసరానికి మించిగాని లేదా తక్కువగాని ఉన్నప్పుడు మొక్కలపై ఏవిధమైన ప్రభావం ఉంటుందో తెలుసుకుందాం.

**నత్రజని:** పంటకు పచ్చదనాన్ని కలుగజేస్తుంది. మొక్కల్లో జీవకణాల నిర్మాణానికి, అమైనోఆమ్లాలు, మాంసకృత్తుల శాతం పెరుగుదలకు ఉపయోగపడుతుంది. నత్రజని మొక్క అవసరానికన్నా తక్కువైనపుడు ముదురు ఆకులు ఆకుపచ్చదనాన్ని కోల్పోయి పాలిపోయి రంగు మారుతుంది. పెరుగుదల మందగించి పంట దిగుబడి తగ్గుతుంది. నత్రజనిని అధికంగా వేసినప్పుడు మొక్కలు విపరీతంగా పెరిగి ఒరిగి నేలపై పడిపోవడం, పంట చీడపీడలకు సులభంగా గురి కావడం, పూత ఆలస్యంగా రావడం జరుగుతుంది.

**భాస్వరం:** వేర్ల పెరుగుదలకు, పూత, కాత, గింజ కట్టడానికి, మొక్క శాఖోప శాఖలుగా, గుబురుగా పెరుగుటకు, త్వరగా పూతకు రావడానికి ఉపయోగపడుతుంది. అధిక మోతాదులో భాస్వరాన్ని రైతులు మొక్కలకు వేస్తే ఎరువుల ఖర్చు పెరగడమే గాక భాస్వరం వృధాతో పాటు ముఖ్యంగా సూక్ష్మపోషక లోపాలకు కూడా కారణమవుతుంది, భాస్వరం లోపించినపుడు ముదురు ఆకుల్లో లోప లక్షణాలు కనిపిస్తాయి. ఆకులు రాగి వర్ణంలోకి మారి ఆకు అడుగు భాగంలో ఎర్రని, గోధుమ రంగు లేదా తుప్పు రంగు మచ్చలేర్పడతాయి. వేర్ల పెరుగుదల బలహీనంగా ఉంటుంది.

దీనిని సరిదిద్దటకు సేంద్రియ ఎరువులు, పాస్ఫో బాక్టీరియా, భాస్వరమును కరిగించు శిలీంద్రం, భాస్వరంను అందించే మైకోరైజా వంటి జీవన ఎరువులను వాడాలి. ఇవి అందుబాటులో లేనపుడు భాస్వరం లోప నివారణకు భూసార పరీక్ష ఫలితాలు, మనం వేసుకునే పంటను బట్టి సిఫారసు మేరకు సాధారణ నేలల్లో భాస్వరం ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. "మనం వేసిన భాస్వరాన్ని మొక్క మొదటి దశలో ఎక్కువగా వినియోగించుకోవడం వల్ల వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది.

**పొటాషియం:** పైరుకు రోగ నిరోధక శక్తిని కలిగించి పురుగులకు తెగుళ్లకు లొంగనీయదు. చలి, వర్షాభావం వంటి ప్రతికూల పరిస్థితులను తట్టుకునేటట్లు చేస్తుంది. పొటాషియం అధికంగా వాడితే పోషకాల మధ్య ఏర్పడే అసమతుల్యత వల్ల మెగ్నీషియం మరియు కాల్షియం లోపాలు ఏర్పడే అవకాశం ఉంది. పొటాష్ లోపించినప్పుడు ముదురు ఆకుల అంచులు ఆకుపచ్చని రంగు నుండి పసుపుగా మారి పోవడం, ఆకు మొనలు గోధుమ రంగుగా మారి దిగువ భాగానికి విస్తరించడం జరుగుతుంది. పెరుగుదల నెమ్మదిగా ఉండి మొక్క గిడసబారుతుంది. కాండం బలంగా ఉండక సులభంగా వాలిపోతుంది. పొటాషియం లోప సవరణకు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా మనం వేసుకునే పంటను బట్టి సిఫారసు మేరకు పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వెసి నేలలో బాగా కలియదున్నాలి. తేలిక నేలల్లో పలు దఫాలుగా వేయడం వల్ల పంటకు బాగా ఉపకరిస్తుంది.

**కాల్షియం:** మొక్కల్లో గింజలు బాగా ఊరడానికి వేరుకొనలు, కాండం కొనల అభివృద్ధికి, పిండి పదార్థాలు చక్కెరగా మారడానికి కాల్షియం చాలా అవసరం. దీని లోపం వల్ల మొక్కల్లో కాండం కొనలు లేదా వేరుకొనలు చచ్చిపోతాయి. దానివల్ల పెరుగుదల దెబ్బతింటుంది. కాల్షియం అమ్మోనియం నైట్రేట్ లేదా సూపర్ పాస్ఫేట్ వంటి కాల్షియం ఉన్న ఎరువులను తగినంత వేసి లోపాన్ని సవరించాలి.

**మెగ్నీషియం:** మొక్కల్లో పిండి పదార్థం, ఆకుపచ్చని పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. మెగ్నీషియం లోపం వల్ల మొదట ముదురు ఆకుల అంచులు, అంచుల సమీపంలో ఈనెల మధ్యభాగం పాలిపోతుంది. ఈనెలు మాత్రం ఆకుపచ్చగానే ఉంటాయి. మెగ్నీషియం సల్ఫేట్ ఉపయోగించి లోపాన్ని సరిదిద్దవచ్చు. అధిక మెగ్నీషియం వాడినట్లయితే కాల్షియం మరియు పొటాషియం పోషకాల అసమతుల్యత ఏర్పడుతుంది.

**గంధకం:** పంట నాణ్యత పెంచడానికి, నూనెగింజల్లో నూనెశాతం పెంచడానికి, ఆయిల్‌పామ్‌లో నూనె శాతం మరియు నూనె నాణ్యతను పెంచడానికి ఉపయోగపడుతుంది గంధకం అధికంగా వాడటం వల్ల మొక్కల్లో పూర్తిగా అభివృద్ధి చెందకుండా ఆకులు రాలిపోతాయి. గంధకం లోపం వల్ల లేత ఆకులు పసుపు పచ్చ వర్ణానికి మారి ఆ తరువాత మొక్క అంతా విస్తరిస్తుంది. లోప నివారణకు నేలకు ముఖ్య పోషక ఎరువులు వేయడంలో గంధకం ఉన్న ఎరువులను ఎంపిక చేసుకోవడం వల్ల ప్రయోజనం చేకూరుతుంది.

**సూక్ష్మపోషకాలు:** జింకు: జింకు చెట్టు పెరుగుదలకు అవసరమైన హార్మోనులు, ఎంజైములు తయారీకి, మొక్కల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ సమర్ధవంతంగా వినియోగించడానికి ఉపయోగపడు తుంది. జింకు అధికంగా ఉన్న లేదా అధికంగా వాడినపుడు ఇనుము లోప లక్షణాలు కనిపించును. జింకు లోపించినపుడు లేత ఆకుల్లో ఈనెల మధ్య భాగాలు పసుపు రంగుకు మారడం, ఆకుల చివర్లలో ఈనెలకు ఇరువైపుల తుప్పు రంగు మచ్చలేర్పడడం, కణుపుల మధ్య దూరం తగ్గి పొట్టిగా కనిపించడం చూడవచ్చు.

**ఇనుము:** అధిక క్షార భూముల్లోను, సున్నపు పాలు ఎక్కువ గల నేలల్లోను, తేలిక నేలల్లోను, సేంద్రియ పదార్థం తక్కువ గల నేలల్లోను సాధారణంగా ఇనుము లోపాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇనుము లోపించినప్పుడు ఈనెల మధ్య భాగం పసుపుగా మారుతుంది. లోపం తీవ్రమయ్యే కొద్ది క్రమంగా పాలిపోయి, తెల్లగా మారి, ఆకుల కొనలు ఎండిపోతాయి. లోప లక్షణాలు లేత ఆకుల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఇనుము లోప నివారణకు ప్రథమ దశలో చర్యలు చేపట్టాలి. ఆకులు పూర్తిగా మారిన తర్వాత నివారణ సాధ్యం కాదు.

**బోరాన్:** బోరాన్ అతి తక్కువ పరిమాణంలో అవసరమయ్యే సూక్ష్మపోషకం. పరిమితికి మించి ఉన్నప్పుడు మొక్కకు హాని కలిగిస్తుంది. అధిక బోరాన్ వల్ల పంటల్లో ఆకు అంచులు పసుపుకు మారి ఎండిపోవును. ఆకులు ఎండి రాలిపోవును. బోరాన్ లోపించినపుడు లేత చిగురు ఆకులు మెలి తిరిగి చనిపోవడం, ఆకులు వంకరలు తిరిగి రూపం మారిపోవడం, పూత, పిందె రాలిపోవడం, కాయలపై పగుళ్లు రావడంవంటి లక్షణాలు కనిపిస్తాయి.

**మాంగనీసు:** పత్రహరితం, ఆహార పదార్థాల తయారీలో ఉపయోగపడుతుంది. మాంగనీసు లోపించినప్పుడు ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు వర్ణంతో మారుతుంది.

**రాగి (కాపర్):** మొక్కల పెరుగుదల మరియు అభివృద్ధికి అవసరమైన అమైనో ఆమ్లాల ఉత్పత్తికి మద్దతు ఇస్తుంది. ఎంజైమ్‌లను సక్రియం చేయడంలో, పత్రహరితం ఉత్పత్తిలో మరియు విత్తన ఉత్పత్తిలో సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది మొక్కల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది.

### ఆయిల్‌పామ్‌లో తరుచుగా కనిపించే పోషక పదార్థ లోపాలు మరియు వాటి యాజమాన్యం:

ఆయిల్‌పామ్ తోటలలో, అక్కడక్కడ నత్రజని మరియు పొటాషియం (ఎన్:కె) సమతుల్యత లోపం, పొటాషియం (కె) లోపం, మెగ్నీషియం (ఎమ్‌జి) లోపం మరియు బోరాన్ (బి) లోపం వంటి పోషక పదార్థాల లోపాలను గమనించవచ్చు.

నత్రజని మరియు పొటాషియం సమతుల్యతా లోప లక్షణాలు: ఆకు పొడవునా తెల్లటి చారలు ఏర్పడుతాయి. ఈ చారలు లేత మొవ్వ అకులు లేదా మొవ్వ చుట్టూ ఉన్న ఆకులలో మొదటగా కనిపిస్తాయి. ఈ లోపం తీవ్రంగా ఉన్న మొక్కలలో మొవ్వ నిట్టనిలువుగా గాని, నిలువుగా ఉన్న శంఖం ఆకారంలో గాని పెరుగుతుంది.

**యాజమాన్యం:** అధిక మొత్తంలో నత్రజని వేయడం వలనగాని ఆకుల్లోని నత్రజని, పొటాష్‌ల నిష్పత్తి సమన్వయ లోపం వలన గాని, బోరాన్ లోపం ఉన్నప్పుడు గాని ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఈ లోపం ఉన్న ప్రతి మొక్కకు 2.5 నుండి 4.5 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి. నత్రజని ఎరువులు వేయడం కొంతకాలం వరకు మానివేయాలి. పత్ర పోషకాల విశ్లేషణ అనంతరం సిఫారసు మేరకు ఎరువులను వేసుకోవాలి.

**పొటాషియం లోప లక్షణాలు:** ఆకులపై నారింజ రంగులో చిన్న చిన్న మచ్చలు కనిపించడం పొటాషియం ధాతు లోపం యొక్క అతి సాధారణమైన లక్షణం. లోప లక్షణాలు మొదట ముదురు ఆకుల అంచులలో లేత పసుపురంగు మచ్చల రూపంలో ఏర్పడతాయి. క్రమంగా ఈ మచ్చలు నారింజ రంగులోకి మారుతాయి. లోప లక్షణాలు ఉన్న ఆకును సూర్యరశ్మి దిశగా పెట్టినప్పుడు ఈ మచ్చలు కాంతిని ప్రసరింప చేస్తాయి. లోపం తీవ్రంగా వున్న ఆకుల్లోని ముదురు నారింజ మచ్చల మధ్య భాగం గోధుమ రంగు మచ్చల్లాగా మారతాయి. ఆకుల చివర్ల నుండి ఎండుతూ క్రమేణా కణజాలం చనిపోతుంది. ఈనెల భాగం కూడా ఎండి, వాడి, పెళుసుగా మారి విరిగిపోతాయి.

**యాజమాన్యం:** 3-4 కిలో గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ఈ లోపం కనపడిన ప్రతి మొక్కకు సంవత్సరానికి నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దఫాలుగా సమభాగాల్లో వేయాలి. సిఫారసు చేసిన మేరకు పొటాషియంను వాడినా గాని లోపం కనిపించిన యెడల పత్ర పోషకాల విశ్లేషణ అనంతరం సిఫారసు మేరకు మాత్రమే పొటాషియంను వాడాలి.

**మెగ్నీషియం లోప లక్షణాలు:** సాధారణంగా ఈ లోప లక్షణాలున్న ఆకును నారింజ రంగు ఆకు లేదా పసుపు లేదా పండు ఆకు అంటారు. లోప లక్షణాలు ముందుగా క్రింది వరుసలో ఉన్న ముదురు ఆకులలో కనిపిస్తాయి. ఎందుకంటే మెగ్నీషియం ముదురు అకు భాగాల నుండి కదిలి లేత భాగాలకు చేరుతుంది.

మెగ్నీషియం లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకులు ముదురు పసుపు రంగులోకి మారి వడిలిపోతాయి. మెగ్నీషియం లోపం యొక్క ప్రత్యేక లక్షణం ఏమనగా సూర్యరశ్మి సోకని ఆకు భాగాలు మెగ్నీషియం లోపం ఉన్నా కూడా ఆకుపచ్చగా ఉంటాయి. కానీ సూర్యరశ్మి సోకిన ఆకులు మాత్రం పసుపు రంగులోకి మారుతాయి.

**యాజమాన్యం:** 2-4 కిలోగ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లోపం కనిపించిన మొక్కలకు మాత్రమే వేయాలి. మిగతా మొక్కలకు పత్రపోషక విశ్లేషణ అనంతరం సిఫారసు మేరకు వేయాలి.

**బోరాన్ లోప లక్షణాలు:**

- బోరాన్ లోపం ఉన్నప్పుడు ఆయిల్‌పామ్ మొక్కలలో కుచించుకు పోయిన ఆకులు, కొక్కేలు వంటి ఆకులు, మొండి ఆకులు, చేప ముల్లు లాంటి ఆకులు, కుంచెను పోలి ఉన్న మొవ్వ ఆకులు ఏర్పడతాయి. ఆకులు చివర్లు విడిపోకుండా ఉండటం, ఆకులు నలిగి ఈనెలు వేరుబడటం, ఆకులు ఈనెలతో సహా జడ లాగా అల్లుకోవడం, మొవ్వులోని ఆకులు మెలి తిరగడం, తీవ్ర బోరాన్ లోపం ఉన్నప్పుడు చిన్న లేదా పొట్టిగా ఉన్న ఆకులు మెలికలు తిరగడం మరియు చెట్టు వంకర తిరగడం వంటి లక్షణాలు గమనించవచ్చు
- ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులో, పెళుసుబారి ఉంటాయి. నీటి పారుదల సౌకర్యం చాలినంతగా ఉన్నా గాని ఆయిల్ పామ్ మొవ్వులోని ఆకుల మూడు లేదా ఎక్కువ ఆకులు పూర్తిగా విచ్చుకోకుండా ఉన్నట్లయితే బోరాన్ లోప లక్షణంగా గుర్తించవచ్చు.

**యాజమాన్యం:** ఈ లక్షణాలు కనిపించిన మొక్కకు వెంటనే 100-200 గ్రా. బోరాక్స్‌ను వేయాలి. రెండు నెలల తరువాత పత్రపోషకాల విశ్లేషణ అనంతరం సిఫారసు మేరకు బోరాన్‌ను వేయాలి. తీవ్రమైన బోరాన్ లోపం వల్ల ఆయిల్‌పామ్ మొక్కలలో చిన్న లేదా మరుగుజ్జు ఆకులు మెలికలు తిరగడం మరియు చెట్టు వంకర తిరగడం వంటి లక్షణాలు గమనించినట్లయితే, ప్రతి నెల 20.5% బోరాన్ లభ్యత ఉన్న బోరాక్స్‌ను మూడు నెలల పాటు (మొదటి నెల 50 గ్రాములు, రెండవ నెల 50 గ్రాములు, మూడవ నెల 100 గ్రాములు) వాడాలి. పైన పేర్కొన్న లోప లక్షణాలున్న మొక్కలకు మాత్రమే మొక్క మొదలు నుండి రెండు అడుగుల దూరంలో తేమ ఉన్న ప్రదేశంలో బోరాక్స్‌ను వేయాలి.

ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న భూముల్లో స్వతః సిద్ధంగా నేల నుండి పోషకాలందుతున్నప్పటికీ, మొక్క ఎదుగుదలకు స్థిరమైన దిగుబడికి సేంద్రియ ఎరువులతో పాటు రసాయనిక ఎరువులు వాడకం అనివార్యం. మొక్క ఎదుగుదల, వయస్సు మరియు నేలలోని పోషకాల లభ్యతను బట్టి సిఫారసు చేసిన స్థూల మరియు సూక్ష్మ పోషకాలను రసాయనిక ఎరువుల రూపంలో, భూమిపై పాదులలో వేసి, నాలుగు దఫాలుగా క్రమం తప్పకుండా వాడాలి. ఫెర్టిగేషన్ ద్వారా ప్రతినెలా సిఫారసు చేసిన ఎరువుల ద్వారా ఆయిల్ పామ్ తోటలకు పోషకాలను అందివ్వవచ్చు. ఎదిగిన మరియు అధిక దిగుబడి ఇచ్చే ఆయిల్‌పామ్ తోటల్లో భూసార మరియు పత్ర పోషకాల విశ్లేషణ ఆధారంగా సిఫారసు మేరకు ఎరువులు వాడినట్లైతే ఆయిల్‌పామ్ తోటలనుండి క్రమం తప్పకుండా మంచి దిగుబడులు సాధించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8812259532

# ప్రత్తి కొనుగోలుకు నూతన విధానం... కపాస్ కిసాన్ యాప్

భారతదేశం అంతటా ప్రత్తి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కేంద్ర జౌళి మంత్రి శ్రీ గిరిరాజ్ గారు సెప్టెంబర్ 2, 2025న కపాస్ కిసాన్ యాప్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ యాప్‌ను కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి) పథకం క్రింద ప్రత్తి సేకరణను డిజిటలైజ్ చేయడానికి రూపొందించబడింది.

కపాస్ కిసాన్ యాప్ అనేది భారతదేశంలో ప్రత్తి రైతులకు కనీస మద్దతు ధర పొందడంలో సహాయపడే ఒక మొబైల్ అప్లికేషన్. ముఖ్యంగా ప్రత్తి కొనుగోళ్ళలో అక్రమాలను నివారించేందుకు జౌళి మంత్రిత్వ శాఖ క్రింద పనిచేసే కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఈ కొత్త విధానంతో వచ్చింది. ఈ విధానంలో ప్రత్తి అమ్ముకోవాలనే రైతులు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో పైలెట్ ప్రతిపాదకన విధానం మొదలైంది.

రైతులు ప్రత్తి అమ్ముకోవాలంటే మధ్యవర్తుల దోపిడి గురించి ప్రత్యేకంగా చేప్పాల్సిన పని లేదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు సిసిఐ ఈ కొత్త యాప్ "కపాస్ కిసాన్ యాప్" ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ సీజన్ రైతులు పంట అమ్ముకునేందుకు తమ వివరాలు పంట సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా సెంటర్‌ల వద్ద రైతుల రద్దీని అదుపు చేయడమే కాకుండా అక్రమాలను అడ్డుకోవచ్చని సిసిఐ చెబుతోంది.

కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత రైతు పేరు, జండర్, తేదీ, పుట్టినతేది, కులము, చిరునామా, ఆధార్, మొబైల్ నెంబరుతో నమోదు చేసుకోవాలి. అనంతరం ఏ మార్కెట్‌లో ప్రత్తి అమ్మాలను కుంటున్నారో ఆ వివరాలను నమోదు చేయాలి. అంతేకాకుండా భూమి సొంతమా, కౌలుదారా అని చెప్పవలసి ఉంటుంది. పట్టాదారు పాస్‌బుక్ నెంబరు, సర్వే నెంబరు, కౌలత, రైతుకు ఉన్న మొత్తం భూమి, ప్రత్తి సాగు విస్తీర్ణం, పంట రకం వంటి వివరాలను ఇవ్వాలి. రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలతో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలి. రైతు నమోదు చేసుకున్న మార్కెట్, తేదీ, టైం లోనే సంబంధించిన ప్రత్తి కొనుగోళ్ళను అనుమతిస్తారు. కావున సెంటర్‌ల వద్ద రైతులు వేచి ఉండవలసిన పరిస్థితి తగ్గుతుంది.









పారదర్శకంగా ప్రత్తి సేకరణ, మధ్యవర్తులను అరికట్టడానికి, రైతుల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించడానికి సిసిఐ ఈ యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరలకు ప్రత్తిని కొనుగోలు చేసి తర్వాత దానిని సిసిఐకి కనీస మద్దతు ధరకు విక్రయించేవారు. కావున కార్పోరేషన్ ఈ పద్ధతిని అరికట్టాలనే ఉద్దేశ్యంతో ఈ యాప్‌ను తీసుకురావడం జరిగింది.

**యాప్ ప్రయోజనాలు:**

- **కనీస మద్దతు ధర పొందడం:** కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు మాత్రమే సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో తమ ప్రత్తిని అమ్మి మద్దతు ధర పొందగలరు.
- **పారదర్శకత:** ఈ యాప్ ద్వారా ప్రత్తి సేకరణ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుంది.
- **స్లాట్ బుకింగ్:** రైతులు సిసిఐ కొనుగోలు కేంద్రాలలో తమ ప్రత్తిని అమ్మడానికి అనుకూలమైన సమయాన్ని స్లాట్ బుకింగ్ ద్వారా ఎంచుకోవచ్చు.
- **చెల్లింపు ట్రాకింగ్:** రైతులు తమ విక్రయాల వివరాలను, చెల్లింపు స్థితిని యాప్‌లో ట్రాక్ చేసుకోవచ్చు.
- **దళారుల దోపిడీ నివారణ:** ఈ యాప్ దళారుల ప్రమేయాన్ని తగ్గించి, రైతుల నుండి నేరుగా ప్రత్తిని సేకరించడంలో సహాయపడుతుంది.

**ఎలా ఉపయోగించాలి:**

- గూగుల్ ప్లే స్టోర్ నుండి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.
- యాప్‌లో మీ వివరాలను నమోదు చేసుకోండి.
- మీ ప్రత్తిని అమ్మడానికి ఒక స్లాట్‌ను బుక్ చేసుకోండి.
- సిసిఐ కొనుగోలు కేంద్రంలో మీ ప్రత్తిని విక్రయించండి.
- మీ చెల్లింపు స్థితిని యాప్‌లో ట్రాక్ చేయండి

ఈ యాప్ రైతుల సంక్షేమాన్ని మెరుగుపరుస్తుందని, ప్రత్తి సేకరణ ప్రక్రియను సులభతరం చేస్తుందని భావిస్తూ...





# వ్యవసాయ పదవినోదం

**కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి**




**అడ్డం:**

1. ప్రత్తి ఆకుల అంచులు ఎర్రగా మారుతున్నాయి. దీనికి కారణమైన రసంపీల్చు పురుగు పేరు? (4)
2. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఓ పంట ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉంది? అది ఏ పంట? (2)
3. భారతదేశంలోని ఏ రాష్ట్రం అత్యధిక పప్పుధాన్యాలను ఉత్పత్తి చేస్తుంది? (4) (కుడి నుండి ఎడమకు)
6. ఫెన్‌మెసిస్పెరో... ఈ అక్షరాలను అటూ.. ఇటూ మార్చితే పంటలలో నల్లి నివారణకు వాడే ఓ మందు పేరు వ్రాయండి? (6)
7. నేల అవసరం లేకుండా నీటితో మొక్కలను పెంచే వినూత్న పద్ధతిని ఏమంటారు? (5)
11. వరి పంట పూతదశలో ఉన్నప్పుడు మబ్బులతో కూడిన వర్షపు జల్లులు లేదా మంచు కురవడం వలన ఏ తెగులు ఆశిస్తుంది? (7)

సమాధానాలు 50వ పేజీలో

**నిలువు:**

2. వానపాములను ఉపయోగించి తయారుచేసే పోషక ద్రావణాన్ని ఏమంటారు? (4)
4. వేరుశనగలో ఏ పోషక లోపం వలన పూత ఆలస్యంగా రావడం, ఊడలు తక్కువగా దిగడం, కాయలు డొల్లగా తయారవడం జరుగుతుంది? (3) (క్రింది నుండి పైకి)
5. పెసర, మినుము పంటల్లో ఎల్లో మొజాయిక్ వైరస్ తెగులు ఏ పురుగు వ్యాపింప జేస్తుంది? (4) (క్రింది నుండి పైకి)
7. భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐయంఆర్) ఎక్కడ ఉంది? (5)
8. ఈ మధ్యకాలంలో పురుగు తెగుళ్ళ వల్ల కలిగే పంటల నష్టపరిమాణాన్ని ఖచ్చితంగా అంచనా వేయటంలో వేటి పాత్ర కీలకమైనది? (2) (క్రింది నుండి పైకి)
10. వరి పొలంలో ఎలుకల నివారణకు వాడే మందు పేరు? (6) (క్రింది నుండి పైకి)
12. తీగజాతి కూరగాయలలో ఆశించి అధిక నష్టం కలుగజేసే పురుగు ఏది? (4) (క్రింది నుండి పైకి)

# ప్రత్తి పంటలో తెగుళ్ళు - యాజమాన్యం

డి. అశ్విని, బి. క్రాంతి కుమార్, ఎల్. సుహాసిని మరియు డా|| కె. కవిత

కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల్







మన రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసే పంట ప్రత్తి. అయితే ప్రత్తి పంటలో రైతులు ఎక్కువగా బి.టి. ప్రత్తి హైబ్రిడ్లనే సాగుచేయడం, మారుతున్న వాతావరణ కారణంగా ప్రత్తి పంటను అనేక రకాల తెగుళ్ళు ఆశించడం జరుగుతుంది. ఈ తెగుళ్ళ యొక్క లక్షణాలు, నివారణ చర్యలను సరియైన యాజమాన్య పద్ధతుల ద్వారా, సమగ్ర సస్యరక్షణ చర్యల ద్వారా సమయానుకూలంగా చేపట్టినట్లైతే పంటను తెగుళ్ళ వల్ల కలిగే నష్టం నుండి కాపాడుకొని మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది.

ప్రత్తి పంట తొలి దశలో ఆకుమచ్చ తెగుళ్ళు, ముఖ్యంగా ఆల్టర్నేరియా ఆకుమచ్చ, కొరినెస్పోరా ఆకుమచ్చ మరియు సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగుళ్ళు ఆశించడం జరుగుతుంది. ఈ మూడు ఆకుమచ్చ తెగుళ్ళు శిలీంధ్రాల వల్ల కలుగుతాయి.

### 1. ఆల్టర్నేరియా ఆకుమచ్చ:

- ఈ తెగులు మొక్క అన్ని దశలలో ఆశిస్తుంది.
- లేత మరియు ముదురు ఆకుల మీద గోధుమ రంగు వలయాకారపు సుడులుగా, రింగులుగా మచ్చలు ఏర్పడతాయి.

### 2. సెర్కోస్పోరా ఆకుమచ్చ:

- ఈ తెగులు పంట తొలిదశలో తేలికపాటి నేలలో ఎక్కువగా ఆశించడం జరుగుతుంది. ముఖ్యంగా ముదురు ఆకుల మీద మచ్చలు చుట్టూ ముదురు గోధుమ రంగులో ఉండి మధ్య భాగంలో బూడిద రంగులో ఉంటుంది.

### 3. కొరినెస్పోరా ఆకుమచ్చ:

- ఈ తెగులు 60 నుండి 120 పంట కాలంలో ఎక్కువగా ఆశించడం జరుగుతుంది.
- లేత మరియు ముదురు ఆకుల మీద సుడులుగా రింగులుగా ఆల్టర్నేరియా ఆకుమచ్చ కన్నా పెద్ద పెద్ద మచ్చలు (7 మి.మీ.) పొడవు మచ్చలు ఏర్పడటం జరుగుతుంది.

#### అనుకూల వాతావరణ పరిస్థితులు:

- మబ్బులతో కూడిన వాతావరణం, గాలిలో తేమ ఎక్కువగా ఉండడం, ఉష్ణోగ్రతలు తక్కువ ఉండి చిరుజల్లులు పడడం.
- ఈ ఆకుమచ్చ తెగుళ్ళు గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి.
- ప్రత్తి పంట లేని సమయంలో ఈ వ్యాధి కలిగించే శిలీంధ్రాలు కలుపు మొక్కలు మరియు పంట అవశేషాల మీద జీవించి ఉంటాయి. కాబట్టి పొలంలో గాని గట్లమీద గాని కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- పంట అవశేషాలు లేకుండా పంటను శుభ్రంగా ఉంచుకోవాలి.

#### నివారణ చర్యలు:

- బి.టి. హైబ్రిడ్ విత్తనాలు ఇమిడాక్లోప్రిడ్ (కీటకనాశినితో) విత్తనశుద్ధి చేసి వస్తాయి.
- అయితే రైతులు ఈ విత్తనాలకు శిలీంధ్రనాశినితో కూడా విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి కిలో విత్తనానికి పట్టించి నీడలో ఆరబెట్టి తర్వాత విత్తుకున్నట్లైతే పంట తొలిదశలో ఆశించే వేరుకుళ్ళు, ఆకుమచ్చ తెగుళ్ళ నుండి పంటను కాపాడుకోవచ్చు.
- వాతావరణం చల్లగా ఉండి, వరుసగా 3-4 రోజుల వర్షాలు కురిసినప్పుడు, అవి (వర్షాలు) తగ్గుముఖం పట్టిన వెంటనే ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. లేదా కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమ మందు 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

### 4. వడలు తెగులు (పారా విల్ట్)

వర్షాలు ఎక్కువగా పడి, మురుగు నీరు పోయే సౌకర్యం లేనప్పుడు, నీరు ఆగిన పొలంలో వడలు తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది.,

**కారణాలు:**

- పొలంలో నీరు నిల్వ ఉండడం వల్ల, వేరుకి గాలి అందక వేరు వ్యవస్థ దెబ్బ తింటుంది. దాని వల్ల వేరు భూమిలో నీరు ఉన్నప్పటికీ తీసుకోలేక మొక్కలు వడలిపోవడం జరుగుతుంది.
- దీనికి గాను భూమిలో ఉన్న అనేక శిలీంధ్రాలు వేరును ఆశించడం జరుగుతుంది.

**లక్షణాలు:**

- మొక్కకు ఉన్న అన్ని ఆకులు వడలిపోతాయి.
- తర్వాత ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోవడం జరుగుతుంది.
- మొక్కలు పూత మరియు కాత సమయంలో కనుక ఎక్కువ వర్షం కురిసి ఇలాంటి పరిస్థితులు ఉంటే ఎక్కువ మొక్కలు వడలు తెగులు లక్షణాలను చూపించడం జరుగుతుంది.
- ఆకులు రాలిపోవడం మొక్కలు ఉన్న కాయలు పగిలిపోవడం, మొక్కలు చనిపోవడం ఈ తెగులు యొక్క ముఖ్య లక్షణం.

**నివారణ:**

- ఈ తెగులు యొక్క లక్షణాలు కనిపించిన వెంటనే పొలం నుండి నీటిని తీసివేయాలి.
- మొక్క మొదళ్ళ చుట్టూ 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ వేరు బాగా తడిసేటట్లు పోసుకోవాలి.
- మొక్క పోషకాలు తీసుకోలేదు కాబట్టి పై నుండి 10 గ్రా. పాలిఫీడ్ లేదా 10 గ్రా. మల్టీ-కె శిలీంధ్రనాశినితో కలిపి పిచికారి చేసుకోవాలి.
- పంట వేసేటప్పుడు బోదె సాళ్ళ పద్ధతిలో విత్తుకున్నట్లైతే ఈ తెగులు యొక్క సమస్య తక్కువగా ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8333818262**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. అక్టోబర్, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేదీ | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 09.10.2025 | కంది పంటలో సస్యరక్షణ | డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తాండూరు, ఫోన్ నెం. 9390898305 |
| 16.10.2025 | రబీ కంది సాగుకు అనువైన రకాలు మరియు మేలైన యాజమాన్యం పద్ధతులు | డా॥ జి. ఈశ్వర రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8808882766 |
| 23.10.2025 | చిరుధ్యానాలతో పోషక భద్రత | డా॥ డి. శశిభూషణ్, ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8919409933 |
| 30.10.2025 | యాసంగిలో పంటల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యం | డా॥ ఆర్.వి.టి. బాలాజీ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9440104717 |

# సోయాచిక్కుడు సాగు, వంట నూనె ఉత్పత్తి మరియు విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం మరియు ఆరోగ్యం



డా॥ ఎ. పోశాద్రి మరియు డా॥ ఎస్. మధుసూదన్ రెడ్డి

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్





భారతదేశంలో సోయాచిక్కుడు (గ్లైసిన్ మాక్స్) విస్తీర్ణం, ఉత్పత్తి, వాణిజ్యము మరియు ఆర్థిక లావాదేవీల పరంగా ప్రధాన నూనెగింజల పంట. గత సంవత్సరం సుమారు 12.5 మిలియన్ హెక్టార్లలో సోయాచిక్కుడు సాగు చేయడం జరిగినది. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా వాన కాలంలో సుమారు 13.0 మిలియన్ హెక్టార్లలో సోయాచిక్కుడు పంట అక్టోబర్ మాసంలో కోతకు సిద్ధంగా ఉంది. దేశవ్యాప్తంగా సుమారు 15.18 మిలియన్ టన్నుల సోయాబీన్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది దేశంలోని మొత్తం నూనె గింజల ఉత్పత్తి లో సుమారు 40 శాతం మరియు సాగు విస్తీర్ణంలో సుమారు 64.7%. తెలంగాణలో గత సంవత్సరం సుమారు 0.38 మిలియన్ హెక్టార్లలో సోయాచిక్కుడు సాగు చేయడం జరిగినది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 0.27 మిలియన్ టన్నుల సోయాచిక్కుడు ఉత్పత్తి జరుగుతుంది. ఇది మన రాష్ట్రంలోని మొత్తం నూనెగింజల ఉత్పత్తిలో సుమారు 38 శాతం. ప్రస్తుతం తెలంగాణలో వేరుశనగ తర్వాత సోయాచిక్కుడు ప్రధాన నూనె గింజల పంట. తెలంగాణలో పూర్వపు ఆదిలాబాద్ మరియు నిజామాబాద్ జిల్లాలలో సోయాచిక్కుడును అధిక మోతాదులో సాగుచేస్తున్నారు. రాష్ట్ర సోయాచిక్కుడు సాగులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాటా సుమారు 39.6 శాతం మరియు ఉత్పత్తిలో 38.2 శాతం. సోయాచిక్కుడు అతి ముఖ్యమైనటువంటి, అత్యంత చౌకగా దొరికే ప్రోటీన్స్‌కు మూలాధారం. విలువ జోడించడం ద్వారా వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేయడం వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చును. సోయాచిక్కుడు ప్రోటీన్స్‌లో మానవ శరీరానికి కావలసిన అత్యంత ఆవశ్యకమైన అమైనో ఆసిడ్స్ దొరికే శాకాహార ఆహారం. సోయాచిక్కుడు నుండి తయారుచేసే పాలు మరియు ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులు మార్కెట్లో అధిక మోతాదులో ప్రోటీన్స్ కలిగిన ఆహార పదార్థాలు. వీటిని ప్రోటీన్స్ కోసమే కాకుండా వీటిలో కొలెస్ట్రాల్ తక్కువగా ఉండడం మరియు పాలలో ఉండే లాక్టోస్ లేకపోవడం వలన దీనిని విరివిగా అన్ని రకాల ఆహార పదార్థాలలో సోయాచిక్కుడు విలువ ఆధారిత ఉత్పత్తులు కలుపుతారు. సోయాచిక్కుడు పోషక విలువల పరంగా చాలా శ్రేష్టమైనది. ఎక్కువ మోతాదులో ప్రోటీన్లు, కొవ్వు ఆమ్లాలు, ఐరన్, జింకు, క్యాల్షియం, ఐసోఫ్లవోన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ మరియు విటమిన్లు దొరికే చౌకైన ఆహార ధాన్యం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రకాల కూరలలో వంట నూనెగా మరియు మనం మార్కెట్లో చూసే చాలా రకాల ఆహార పదార్థాలతో పాటు సోయాచిక్కుడు నుండి తీసిన నూనె మరియు సోయా లిసితిన్, సోయా ప్రోటీన్ల పౌడర్, ప్లాంట్ బేస్డ్ ప్రోటీన్ల మాంసం, మీల్ మేకర్స్, సాస్ మరియు గ్రేవీస్, పొడి చేర్పులు, బేకింగ్ మిశ్రమాలు, టేస్ట్ మేకర్స్, మాంసాహార ఉత్పత్తులలో, బేకరీ, స్నాక్స్, చాక్లెట్, పానీయాలు, సౌందర్య సాధనాలు, రోగనిరోధక ఏజెంట్, ఫార్మాస్యూటికల్స్ అప్లికేషన్స్ మరియు సబ్బులు తయారీలో భాగంగా పరిశ్రమల ముడిసరుకుగా ప్రపంచవ్యాప్తంగా విరివిగా వినియోగిస్తున్నారు.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న సోయాచిక్కుడు సాగు, ఉత్పత్తి, సోయాచిక్కుడు నిల్వ, నాణ్యమైన విత్తనాల అభివృద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ మరియు

అధునాతన ఫుడ్ ప్రాసెసింగ్ పద్ధతుల ద్వారా విలువలు జోడించి రైతులకు మంచి గిట్టుబాటు ధరతో పాటు, ప్రజలకు నాణ్యమైన, బలమైన పోషక ఆహార పదార్థాలను మరియు గ్రామీణ యువతీ యువకులకు ఉపాధి కల్పన వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని, సోయాచిక్కుడు ఆహార ఉత్పత్తుల ఎగుమతి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించ వలసిన అవసరం ఉంది.

### విలువ ఆధారిత సోయాబీన్ ఆహార పదార్థాల తయారీ

**సోయాచిక్కుడు నూనె:** ఒక టన్ను సోయాచిక్కుడు నూనె ఉత్పత్తికి సుమారు 2.0 హెక్టార్ల భూమి అవసరమవుతుంది. కిలో సోయాచిక్కుడు నుండి 200 గ్రాముల వంటనూనె దొరుకుతుంది. నూనె తీసిన తర్వాత ఉండే గానుగ చెక్కను ఎండబెట్టి మరియు పొడి చేస్తారు. నూనె తీసిన గానుగ చెక్కను వివిధ ఆహార పదార్థాలలో ముడిసరుకుగా వాడుతారు.

సోయా ప్రోటీన్ కాన్సెంట్రేట్, సోయా ప్రోటీన్ ఐసోలేట్ వంటి అత్యంత విలువైన ప్రోటీన్ ఉత్పత్తులు నూనె తీసిన గానుగ చెక్క నుండి తయారు చేస్తారు. మార్కెట్లో దొరికే చిన్న పిల్లల ఆహారం మరియు బలవర్ధకమైన ప్రోటీన్ ఆధారిత ఆహారపదార్థాలలో వీటిని కలుపుతారు. ఇటువంటి మిషన్‌లకు అధిక వ్యయం ఖర్చవుతుంది.

**మీల్ మేకర్స్:** నూనె తీసిన గానుగ చెక్క పిండికి గోధుమపిండి, మొక్కజొన్న పిండి కలిపి ఎక్స్- ట్రుడర్ అనే యంత్రం ద్వారా మీల్ మేకర్స్ తయారుచేస్తారు. తక్కువ ఖర్చుతో సుమారు ఆరు నుండి ఎనిమిది లక్షల వ్యయంతో ఎక్స్- ట్రుడర్ అనే యంత్రం ద్వారా మీల్ మేకర్స్ తయారు చేయవచ్చు. మీల్ మేకర్స్‌ను సోయా చెంకుస్ అని కూడా పిలుస్తారు. వీటిని మాంసానికి ప్రత్యామ్నాయంగా తింటారు.

**ప్లాంట్ బేస్డ్ మీట్స్:** ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా తరుగుతున్న వనరులు, పెరుగుతున్న జనాభా, జంతువుల (మేక, గొర్రెలు, కోడి మరియు ఇతర పశువు మాంసము) నుండి తయారు చేసిన మాంసము తినడం వలన ప్రబలుతున్న వ్యాధులు, అనారోగ్యం గురించి ఎక్కువగా చర్చలు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ మాంసకృత్తుల మరియు ఇతర పోషక విలువలు కలిగి ఉన్న ప్లాంట్ బేస్డ్ మీట్స్ మార్కెట్‌లో ప్రాచుర్యం పొందుతున్నాయి. చాలా రకాల ప్లాంట్ బేస్డ్ మీట్స్‌లో సోయా ప్రోటీన్ మూల ఆధారం.

**బేకరీ ఉత్పత్తులు:** నూనె తీసిన గానుగ చెక్క పొడి, సోయా ఆయిల్, సోయా లెసిథిన్, సోయా ప్రోటీన్ కాన్సెంట్రేట్ మరియు సోయాచిక్కుడు పిండి మొదలైన వివిధ బేకరీ ఉత్పత్తులలో ప్రపంచవ్యాప్తంగా విరివిగా వినియోగిస్తున్నారు.

**నూడిల్స్, పాస్తా మరియు వెర్మిసెలి మొదలైన ఫాస్ట్ ఫుడ్స్:** నూనె తీసిన గానుగ చెక్క పొడిలో సుమారు 38-42% వరకు ప్రోటీన్లు ఉంటాయి. గోధుమ పిండితో పాటు నూనె తీసిన సోయాచిక్కుడు గానుగ చెక్క పొడిను కలపడం వలన నాణ్యమైన ప్రోటీన్లతో పాటు మంచి బలవర్ధకమైన ఆహారం తయారవుతుంది. సుమారు ఆరు నుండి పది లక్షల వ్యయంతో పాస్తా మరియు వెర్మిసెలి తయారుచేసే మిషన్‌ను కొనవచ్చు.

**మల్టీ గ్రేన్ ఆట:** గోధుమ పిండితో పాటు 5 నుండి 12 రకాల వివిధ ప్రధాన ధాన్యాలు, తృణ ధాన్యాలు, సిరి ధాన్యాలు, పప్పుధాన్యాలు, మెంతులు, సోయాబీన్ లేదా నూనె తీసిన సోయాచిక్కుడు గానుగ చెక్క పొడి కలపడం వలన నాణ్యమైన మల్టీ గ్రేన్ ఆట తయారు చేస్తున్నారు. వేయించిన 10-15% సోయాచిక్కుడును కలుపుతున్నారు.

**బేవరేజెస్, చాక్లెట్స్ మరియు ఇతర స్వీట్స్:** సోయాచిక్కుడు పిండి, సోయా ప్రోటీన్ కాన్సెంట్రేట్, సోయా ప్రోటీన్ ఐసోలేట్స్, సోయా లెసిథిన్, నూనె తీసిన సోయాబీన్ పిండి మొదలైనవి విరివిగా కలిపి ప్రపంచ వ్యాప్తంగా బేవరేజెస్, చాక్లెట్స్ మరియు ఇతర స్వీట్స్ తయారు చేస్తున్నారు.

### సోయా పాలు, పన్నీరు మరియు ఇతర స్వీట్స్

సోయాచిక్కుడు గింజలను నానబెట్టి వేడి నీళ్ళు కలిపి రుబ్బడం ద్వారా చిక్కని పాల లాంటి పదార్థం తయారవుతుంది. తదనంతరం వాటిని ఒక జాలి లేదా బట్ట ద్వారా వడ పోయడం వలన 1.0 కిలో సోయాచిక్కుడు నుండి 6.0 లీటర్ల చిక్కని సోయా పాలు తయారవుతాయి. వాటిని బాగా వేడి చేసి చల్లార్చి బెల్లం లేదా చక్కెర కలుపుకుని పాలలాగా తాగవచ్చు. సోయా పాలలో 94% నీళ్లు, 3% ప్రోటీన్లు, 1.5% కొవ్వు, 1.5% కార్బోహైడ్రేట్లు, మరియు ఇతర ఖనిజ లవణాలు దొరుకుతాయి.

**పన్నీరు:** సోయా పాలలో నిమ్మరసం, లేదా వెనిగర్ కలిపి పాలను విరగ్గొట్టి పన్నీరుగా మార్చవచ్చు. సోయా పన్నీర్‌ను సోయా టోఫు అని కూడా పిలుస్తారు. సోయా పన్నీర్ ద్వారా వివిధ రకాల స్వీట్ కూడా తయారు చేసుకోవచ్చు. పన్నీర్ కూర కూడా వండుకుని తినవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9492828965**

# పి.జె.టి.ఎ.యు గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమం: నాణ్యమైన విత్తనోత్పత్తిలో రైతులకు ముఖ్య సూచనలు

కె. లక్ష్మీప్రసన్న, యమ్. పల్లవి, కె. కనకదుర్గ, బి. వరప్రసాద్, డా॥ యమ్.వి. నగేష్ కుమార్ మరియు డా॥ సి.హెచ్. దామోదర్ రాజు

విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్





వ్యవసాయంలో విజయం సాధించాలంటే మంచి విత్తనం తొలిమెట్టు. నాణ్యమైన విత్తనాన్ని ఉపయోగించడం వల్ల అధిక దిగుబడితో పాటు, చీడపీడలను తట్టుకునే శక్తి లభిస్తుంది. నాణ్యమైన విత్తనం అంటే కేవలం మొలక శాతంతో కూడినది మాత్రమే కాదు. అది జన్యుపరంగా స్వచ్ఛమైనదిగా, ఇతర విత్తనాలు, కలుపు విత్తనాలు మరియు తెగుళ్ళు లేకుండా ఉండాలి. ఈ లక్షణాలున్న విత్తనాన్ని రైతులే తమ పొలంలో చిన్న జాగ్రత్తలు పాటిస్తూ ఉత్పత్తి చేసుకోవచ్చు. విత్తనోత్పత్తిలో రైతుల నుండి రైతులకు విత్తన పంపిణీ అనేది మన వ్యవసాయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. ఇది ఆర్థికంగా లాభదాయకంగా ఉండటమే కాకుండా, ఇతర రైతులకు కూడా నాణ్యమైన విత్తనాలను అందించే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో విత్తన కిట్‌ల పంపిణీ ఒక మంచి ప్రయత్నం. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రైతులు పొందిన నాణ్యమైన విత్తన కిట్లను పొలాల్లో విత్తారు. ఇప్పుడు ఆ విత్తనాల నుంచి నాణ్యమైన విత్తనోత్పత్తి సాధించడానికి ఈ క్రింది సూచనలను పాటించండి.

## విత్తనోత్పత్తిలో పాటించాల్సిన సాధారణ సూత్రాలు

**నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలంటే, అన్ని పంటలకు వర్తించే కొన్ని ప్రాథమిక సూత్రాలను పాటించాలి. అవి:**

1. **సరైన పొలం ఎంపిక:** గత సీజన్లో మనం సాగు చేయాలనుకున్న పంటను వేయని పొలాన్ని ఎంచుకోవాలి. దీనివల్ల పాత విత్తనాలు మొలకెత్తి, కొత్త విత్తనాలతో కలిసిపోకుండా ఉంటాయి. కలుపు విత్తనాలు తక్కువగా ఉన్న పొలాన్ని ఎంచుకోవడం కూడా మంచిది.
2. **వేర్పాటు దూరం:** ఒకే రకం పంటలోని రెండు వేర్వేరు రకాలను సాగు చేసేటప్పుడు, అవి రెండూ జన్యుపరంగా కలుషితం కాకుండా వాటి మధ్య పాటించాల్సిన నిర్దిష్ట దూరం. విత్తనోత్పత్తిలో ఇది చాలా ముఖ్యమైన నియమం. ఈ దూరం పాటించకపోతే, గాలి లేదా కీటకాల ద్వారా పరాగ రేణువులు ఒక పొలం నుండి మరొక పొలానికి వెళ్లి, జన్యుపరమైన కల్తీ జరుగుతుంది. దీనివల్ల విత్తనం యొక్క స్వచ్ఛత తగ్గి, నాణ్యత దెబ్బతింటుంది. విత్తన ధృవీకరణ సంస్థలు విత్తన పొలాన్ని తనిఖీ చేసేటప్పుడు వేర్పాటు దూరాన్ని ఒక ముఖ్యమైన ప్రమాణంగా పరిగణిస్తాయి. ఈ దూరం సరిగ్గా పాటించకపోతే, ఆ పొలంలో ఉత్పత్తి అయిన విత్తనాన్ని నాణ్యమైనదిగా ధృవీకరించరు.
3. **బెరుకుల ఏరివేత:** నాణ్యమైన విత్తనోత్పత్తిలో బెరుకుల ఏరివేత అనేది ఒక అతి ముఖ్యమైన ప్రక్రియ. ఇది ప్రధానంగా విత్తన పంట పొలంలో మనకు అవసరం లేని, రకానికి చెందని మొక్కలను గుర్తించి, వాటిని పూర్తిగా తొలగించే పద్ధతి. ఈ ప్రక్రియ విత్తనం యొక్క జన్యు స్వచ్ఛత ను కాపాడటానికి సహాయపడుతుంది.

**ఈ బెరుకులు అనేక రకాలుగా ఉండవచ్చు:**

**జన్యుపరంగా భిన్నమైన మొక్కలు:** ఇవి ప్రధాన పంట రకానికి చెందినవి కాకుండా వేరే లక్షణాలు కలిగి ఉంటాయి.

**కలుపు మొక్కలు:** పంటతో కలిసి పెరిగే హానికరమైన కలుపు మొక్కలు.

**తెగుళ్లు లేదా వ్యాధులు సోకిన మొక్కలు:** ముఖ్యంగా విత్తనాల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళు సోకిన మొక్కలు ఏరివేయాలి.

**4. యంత్రాల శుభ్రత:** విత్తేందుకు ఉపయోగించే యంత్రాలు, నూర్పిడి యంత్రాలు, బస్తాలు, మరియు నిల్వ ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేయకపోతే, వాటిలో గతంలో వాడిన ఇతర రకాల విత్తనాలు లేదా కలుపు విత్తనాలు మిగిలి ఉండే అవకాశం ఉంది. ఈ అవశేషాలు మన నాణ్యమైన పంటతో కలిసిపోయి, విత్తనం యొక్క జన్యు స్వచ్ఛతను దెబ్బతీస్తాయి. కాబట్టి యంత్రాలను పూర్తిగా శుభ్రపరచిన తర్వాతనే ఉపయోగించడం ద్వారా విత్తన నాణ్యతను కాపాడవచ్చు.

**5. సమగ్ర తెగులు మరియు కీటకాల నిర్వహణ:** విత్తన పంటను చీడపీడల నుండి రక్షించడం చాలా అవసరం, ఎందుకంటే తెగుళ్లు మరియు వ్యాధులు విత్తనం యొక్క మొలక శాతాన్ని, తేమ శాతాన్ని, మరియు జన్యు స్వచ్ఛతను దెబ్బతీస్తాయి. ఈ సమస్యను నివారించడానికి, రసాయన పద్ధతులు మాత్రమే కాకుండా, సేంద్రీయ మరియు సాంస్కృతిక పద్ధతులను కూడా సక్రమంగా ఉపయోగించాలి. అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన పురుగుమందులను, సరైన మోతాదులో వాడటం వల్ల పంటకు నష్టం జరగకుండా, విత్తన నాణ్యతను కాపాడుకోవచ్చు.

నాణ్యమైన విత్తనోత్పత్తిలో పాటించాల్సిన ప్రధాన సూత్రాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా పంపిణీ చేయబడిన వరి, కంది, పెసలు, జొన్న పంటలకు ఎలా వర్తింపజేయాలో ఈ క్రింది పట్టికలో వివరంగా ఇవ్వబడింది.

| విత్తనోత్పత్తిలో ప్రధాన దశలు | కంది | పెసర | వరి | జొన్న |
|---|---|---|---|---|
| వేర్పాటు దూరం | 100 మీటర్లు | 10 మీటర్లు | 3 మీటర్లు | 200 మీటర్లు (రకాలకు) |
| పొలం ఎంపిక | గత సీజన్లో కంది సాగు చేయని పొలాన్ని ఎంచుకోవాలి. | గత సీజన్లో పెసర సాగు చేయని పొలం ఉత్తమం. | గత 2 సంవత్సరాల్లో ఎర్ర వరి పెరగని పొలాన్ని ఎంచు కోవడం తప్పనిసరి. | గత సీజన్లో జొన్న సాగు చేయని పొలం మంచిది. |
| బెరుకుల ఏరివేత దశలు | పూతకు ముందు, పూత సమయంలో, కాయలు ఏర్పడే దశలో మరియు కోతకు ముందు | పూతకు ముందు, పూత సమయంలో మరియు కోతకు ముందు | వెన్నులు వేసే దశలో, పాలు పోసుకునే దశలో మరియు కోతకు ముందు | పూత దశకు ముందు, పూత సమయంలో, మరియు పక్వానికి వచ్చే సమయంలో |
| పంట కోత | కాయలు పూర్తిగా ముదురు గోధుమ రంగులోకి మారిన తర్వాత కోయాలి. గింజలు పగలనివ్వ కుండా జాగ్రత్త పడాలి. | కాయలు పూర్తిగా పక్వానికి వచ్చి, ముదురు నలుపు రంగులోకి మారిన తర్వాత కోయాలి. | గింజలు పూర్తిగా పక్వానికి వచ్చి గట్టి పడిన తర్వాత, గింజలు రాలకుండా జాగ్రత్తగా కోయాలి. | గింజలు పూర్తిగా ముదిరి, గట్టిపడిన తర్వాత మాత్రమే కోయాలి. |
| తేమ శాతం మరియు నిల్వ | 8-10% తేమ ఉండేలా ఆరబెట్టాలి. శుభ్రమైన గాలి చొరబడని సంచుల్లో నిల్వ చేయాలి. | 8-9% తేమ ఉండేలా ఆరబెట్టాలి. కీటకాలు ఆశించ కుండా నిల్వ చేయాలి. | 12-13% తేమ ఉండేలా ఆరబెట్టాలి. అధిక తేమ ఫంగస్ వృద్ధికి కారణమవుతుంది. | 10-12% తేమ ఉండేలా ఆరబెట్టాలి. నిల్వ చేసే గది చల్లగా, పొడిగా ఉండాలి. |

**బెరుకులను గుర్తించడానికి పంట దశలో గమనించవలసిన అంశాలు**

**వరి**

**మొక్క ఎత్తు:** ప్రధాన పంటలోని మొక్కల కంటే పొడవుగా లేదా పొట్టిగా ఉన్న మొక్కలను గమనించి, వాటిని వెంటనే తీసివేయాలి.

**ఆకుల రంగు:** ప్రధాన వరి రకం ఆకుల రంగు కంటే వేరుగా ఉన్న మొక్కలను (లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ లేదా పసుపు రంగులో) గుర్తించి తొలగించాలి.

**పూత దశ:** ప్రధాన పంట పూసే సమయం కంటే ముందుగా లేదా ఆలస్యంగా పూతకు వచ్చే మొక్కలను తొలగించాలి. ఇలాంటి మొక్కలు విత్తన నాణ్యతను దెబ్బతీస్తాయి.

**కంకి లక్షణాలు:** కంకి ఆకారం, పరిమాణం, లేదా గింజల అమరికలో తేడా ఉన్న మొక్కలను గుర్తించాలి. కొన్నిసార్లు, కంకిలో ముళ్ళు) ఉండటం లేదా లేకపోవడం వంటి లక్షణాలు కూడా వేరే రకానికి చెందినవని సూచిస్తాయి.

**వ్యాధి సోకిన మొక్కలు:** అగ్గి తెగులు లేదా ఇతర శిలీంధ్రాలు సోకిన మొక్కలను వెంటనే తొలగించడం వల్ల వ్యాధి ఆరోగ్యకరమైన మొక్కలకు వ్యాపించకుండా ఉంటుంది.

**ఎర్ర వడ్లు:** ఎర్ర వడ్ల మొక్కలు కూడా సాధారణంగా వరి పొలంలో కలిసి పెరుగుతాయి. వీటిని గుర్తించి తొలగించడం ద్వారా పంట నాణ్యత దెబ్బతినకుండా చూసుకోవచ్చు.

**పెసర**

**భిన్నమైన మొక్కలు:** పెసర రకానికి సంబంధం లేని, వేరే రకాల మొక్కలు పెసర పంటలో పెరగడం సహజం. వాటి ఆకుల ఆకారం, రంగు, కాండంపై నూగు, పువ్వుల రంగు, మొక్క ఎత్తు, మరియు కాయల ఆకృతి, కాయలపైన నూగు వంటి లక్షణాలలో తేడా ఉంటుంది. అలాంటి మొక్కలను గుర్తించి, అవి పూత దశకు రాకముందే తొలగించాలి.

**వ్యాధి సోకిన మొక్కలు:** పెసరలో తరచుగా కనిపించే పసుపు మొజాయిక్ వైరస్ సోకిన మొక్కలను గమనించాలి. ఈ వ్యాధి సోకిన ఆకులు పసుపు రంగులోకి మారి అక్కడక్కడా ఆకుపచ్చ మచ్చలతో కనిపిస్తాయి. ఇలాంటి మొక్కలను వెంటనే తొలగించడం వల్ల వ్యాధి ఇతర మొక్కలకు వ్యాపించకుండా ఉంటుంది. అలాగే ఆకుమచ్చ తెగులు, కాండం కుళ్ళు వంటి ఇతర వ్యాధులు సోకిన మొక్కలను కూడా ఏరివేయాలి.

**కంది**

కందిలో కూడా పెసర మాదిరిగానే ఆకుల ఆకారం, రంగు, కాండంపై నూగు, పువ్వుల రంగు, మొక్క ఎత్తు, మరియు కాయల ఆకృతి, కాయలపైన నూగు వంటి లక్షణాల ఆధారంగా బెరుకులను గుర్తించి తొలగించవచ్చు. కందిలో వచ్చే ఎండు తెగులు పసుపు మొజాయిక్ వైరస్ వంటి తెగుళ్ల సోకిన మొక్కలను గుర్తించి తొలగించాలి.

**జొన్న**

**మొక్కల తొలి దశ:** మొక్కల పెరుగుదల ప్రారంభ దశలో, ఎత్తు మరియు ఆకుల లక్షణాల్లో తేడాలు ఉన్న మొక్కలను గుర్తించి తొలగించాలి.

**పూత దశ:** ఈ దశలో పూతకు వచ్చే సమయం, పూల రంగులో తేడా ఉన్న మొక్కలను తొలగించడం సులభం.

**కంకి పక్వానికి వచ్చే దశ:** ఈ దశలో కంకి ఆకారం, పరిమాణం మరియు గింజల రంగు ఆధారంగా బెరుకులను తొలగించాలి.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం కార్యక్రమం కేవలం నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయడమే కాదు, రైతులను స్వయం సమృద్ధి సాధించే విత్తన ఉత్పత్తిదారులుగా తీర్చిదిద్దే ఒక మహోన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రైతు సోదరులు పేర్కొన్న మెళకువలను మరియు జాగ్రత్తలను పాటించడం ద్వారా, మీ పంటను రక్షించుకుని, అధిక నాణ్యత గల విత్తనాలను ఉత్పత్తి చేయగలరు.



ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9493451857



# అక్టోబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** పొలాన్ని దున్నటం, ఎరువులు వేయడం, నీరు పెట్టడం చేయకూడదు. గత సంవత్సరం తేనె మంచు పురుగు, పిండినల్లి, పొలుసుపురుగు అధికంగా ఆశించిన తోటల్లో ఎసిఫేట్ 1.5 గ్రా. + వేపనూనె 3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఈ మందును కేవలం కాండం, ప్రాథమిక కొమ్మలు తడిచేలా పిచికారి చేయాలి. మొత్తం చెట్టంతా పిచికారి చేయాల్సిన అవసరం లేదు. బలహీనంగా ఉన్న చెట్లకు 5 గ్రా. యూరియాను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**జామ:** చలికాలంలో వచ్చే పంట పిందె, కాయగా పెరిగే ఈ దశలో యూరియా 10 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం వల్ల పరిమాణం పెరిగి దిగుబడి అధికంగా వస్తుంది. సూక్ష్మపోషక లోపాల నివారణకు 4 గ్రా. జింక్ సల్ఫేట్‌తోపాటు, 2 గ్రా. బోరాక్స్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. జామలో ఆకులు పసుపు పచ్చగా మారి, నెమ్మదిగా చెట్లు ఎండి, చనిపోతుంటాయి. దీనికి ప్రధాన కారణం నులిపురుగులు. నివారణకు లక్షణాలు కనిపించిన వెంటనే చెట్టు పాదులో 50 గ్రా. పేసిలోమైసెస్ లిలాసినస్ 8-10 లీటర్లు నీటిలో కలిపి మొదలు చుట్టూ నేల తడిచేటట్లు పోయాలి.

**అరటి:** సిగటోక ఆకుమచ్చ తెగులు ఎక్కువగా సోకే రకాలు పెద్దపచ్చ అరటి, చక్కెరకేళిలపై ట్రైడిమార్ఫ్ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి రెండు మూడు సార్లు 20 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. కాయల చివర, ముచ్చిక వద్ద కుళ్ళు మచ్చలు ఏర్పడి నల్లగా మాడినట్లు కనబడుతుంది. పూర్తిగా తడిచేలా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. అరటిలో ఆకులు చివర్ల నుండి ఎండిపోవడం పొటాష్ లోపాన్ని సూచిస్తుంది. దీని నివారణకు మొక్కకు 20 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ప్రతి 15 రోజులకొకసారి మొక్కకు రెండు వైపులా పంటలలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.

**బత్తాయి, నిమ్మ:** డ్రిప్ లేకుంటే డబుల్ రింగ్ పద్ధతిలో కాయలు ఉన్న చెట్లకు నీటిని అందించాలి. ఈ మాసంలో చెట్ల కాండంపై బోర్డో పేస్టును పూసుకోవాలి. పిందె, కాయ రాలటంను నివారించుటకు 1.5 గ్రా. 2,4-డి 100 గ్రా. కార్బండాజిమ్, 1 కిలో యూరియాలను 100 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకంను 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** ద్రాక్షలో రకాన్ని బట్టి కత్తిరింపులు చేయాలి. కత్తిరించిన 48 గంటలలోపు లీటరు నీటికి 30 మి.లీ. హైడ్రోజన్ సైనమైడ్‌ను కలిపి కణుపులకు పూయాలి. కత్తిరించిన 10వ రోజు 0.8 మి.లీ. కాపర్ సల్ఫేట్, 18వ రోజు సైమెక్సానిల్ + మ్యాంకోజెబ్ మందు 3 గ్రా. లీటరు నీటికి, 25వ రోజుల ఫాసిటైల్ అల్యూమినియం 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం వల్ల పక్షికన్ను తెగులు, మజ్జిగ తెగులును నివారించవచ్చు.

**సపోట:** ఈ మాసంలో ఆకు గూడు అల్లే పురుగు, మొగ్గ తొలిచే పురుగు అధికంగా ఆశిస్తాయి. నివారణకు గోళీ పరిమాణంలో ఉన్న పిందెలపై క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**బొప్పాయి:** ఈ మాసంలో ఆకుమచ్చ తెగులు అధికంగా వచ్చి, ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోవును. నివారణకు లీటరు నీటికి మ్యాంకోజెబ్ 2.5 గ్రా. క్లోరోథలోనిల్ 2 గ్రా. కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.







**ఆపిల్ రేగు:** పండు ఈగ ఉధృతి ఈ మాసం నుండి కనిపిస్తుంది. నివారణకు 1 లీ. నీటికి 4-6 మిథైల్ యూజినాల్ ఎరలు పెట్టుకోవాలి కలిపి మొదటి గోళీకాయ పరిమాణంలో ఉన్నప్పుడు, రెండోసారి 15 రోజుల తర్వాత పిచికారి చేయాలి.

**సీతాఫలం:** కాయలపై కళ్ళ మధ్య పిండి పురుగు గుంపులు గుంపులుగా చేరి కాయ నుండి రసం పీలుస్తాయి. కాయపైన పురుగులు ఉండటం వల్ల తినటానికి అనువుగా ఉండవు. నివారణకు పిండి పురుగులను గమనించిన వెంటనే 2.5 మి.లీ. క్లోర్‌పైరిఫాస్ పిచికారి చేయాలి. కాయలు కోత దశలో ఉంటే క్రిమిసంహారక మందులు పిచికారి చేయరాదు.

**కూరగాయలు:**

**టమాట:** శీతాకాలం పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చు. 21-25 రోజుల వయస్సు ఉండి 3-4 ఆకులు గల మొక్కలను 60×60 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఆకుమాడు తెగులు నివారణకు 3 గ్రా. మ్యాంకోజెబ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**వంగ:** శీతాకాలం పంటకోసం ఈ మాసంలో నారు పోసుకోవాలి. నారుమడిలో మాగుడు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 3 గ్రా. ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 3 సార్లు తడపాలి.

**బెండ:** మొవ్వు మరియు కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తరువాత పిచికారి చేయాలి.

**పందిరి కూరగాయలు:** బీరలో పాము వంటి గీతలు ఆకులపై కనిపిస్తాయి. (పాము పొడ తెగులు) నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ చొప్పున కలిపి చెట్లపై పిచికారి చేయాలి. కాకరలో తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగులు, పేనుబంక వంటివి ఆకులు, లేత కొమ్మలు నుండి రసాన్ని పీలుస్తాయి. ఆకులు ముడుచుకుపోతాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పుచ్చ, ఖర్బూజాలు నాటుకోవడానికి అనువైన సమయం. సొరకాయలో ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిపి ఉన్న మందు 2 గ్రా. లీటరు నీటికి పిచికారి చేయాలి.

**వాణిజ్య పంటలు:**

**పసుపు:** ఈ మాసంలో ముద్రాకు తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఈ తెగులు పొలంలో ఒక చోట మొదలైన నాలుగైదు రోజుల్లోనే అన్ని మొక్కలకు వ్యాపిస్తుంది. తెగులు ఆశించిన ఆకులను తుంచి, కాల్చివేయాలి. థయోఫానైట్ మిథైల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారి చేయాలి. లోతట్టు నేలలు, నల్ల భూముల్లో పసుపును దుంప కుళ్ళు ఆశించే అవకాశం ఉంది. తోటలో మురుగు నీరు నిల్వకుండా చేసి, లీటరు నీటికి మెటలాక్సిల్ + మ్యాంకోజెబ్ 3 గ్రా. చొప్పున కలిపి దుంప కుళ్ళు చనిపోయిన మొక్కల మొదళ్ళతోపాటు, బ్రతికి ఉన్న మొక్కల మొదళ్ళకు కూడా బాగా తడపాలి.

**మిరప:** మిరపలో ఈ మాసంలో పై ముడత ప్రధాన సమస్య. ఇది తామర పురుగుల వల్ల వస్తుంది. నివారణకు 3 మి.లీ. ఫాసలోన్ లేదా ఫిప్రోనిల్ లేదా 1 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**బంతి:** తామర పురుగులు లేతాకులు, పూమొగ్గలు, ముదురాకుల కింద రసంపీల్చడం వల్ల ఆకులు తెల్లని మచ్చలు కనిపిస్తాయి. నివారణకు లీటరు నీటికి 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ కలిపి పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**





# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సం॥ ఖరీఫ్ మరియు రబీ కాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 7 నుండి 23 సం॥ల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 ఖరీఫ్ మరియు రబీ పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

**వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | మొక్కజొన్న | బాదేపల్లి | అక్టోబర్-నవంబర్ | 2380-2690 |
| 2. | రాగి | మహబూబ్‌నగర్ | అక్టోబర్-నవంబర్ | 2890-3500 |
| 3. | వేరుశనగ | గద్వాల్ | అక్టోబర్-నవంబర్ | 5600-6000 |
| 4. | ప్రొద్దుతిరుగుడు | సిద్దిపేట | అక్టోబర్-నవంబర్ | 4100-4400 |
| 5. | బత్తాయి | గడ్డిఅన్నారం | అక్టోబర్-నవంబర్ | 3000-3300 |

**2025-26 రబీ పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | మొక్కజొన్న | బాదేపల్లి | జనవరి-మార్చి | 2400-2660 |
| 2. | శనగలు | నారాయణపేట | జనవరి-ఫిబ్రవరి | 5200-5500 |
| 3. | వేరుశనగ | గద్వాల్ | జనవరి-మార్చి | 5750-6250 |
| 4. | ప్రొద్దుతిరుగుడు | సిద్దిపేట | జనవరి-మార్చి | 4400-4700 |
| 5. | టమాటా | బోయినపల్లి | డిసెంబర్-జనవరి | 1400-1700 |
| 6. | వంకాయ | బోయినపల్లి | డిసెంబర్-జనవరి | 1600-1840 |
| 7. | జామ | గడ్డిఅన్నారం | ఫిబ్రవరి-ఏప్రిల్ | 2000-2400 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

# కృత్రిమ మేధస్సుతో కీటకాల నియంత్రణ – పంటలకు స్మార్ట్ రక్షణ

ఎం. ఫణి రామ క్రిష్ణ, డా॥ ఆర్ సతీష్, బి. మధుకర్,
డా॥ ఎం. సంపత్ కుమార్ మరియు డా॥ జె సునీల్
బి.జె.ఆర్. వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల, పి.జె.టి.ఏ.యు







భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. మనదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికే సింహ భాగం. కానీ, రైతులు పండించే పంటలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో అతిపెద్ద సమస్య, పంటలకు సోకే చీడపీడలలో కీటకాలు ప్రధానమైనవి. ఏటా ఈ కీటకాల వలన రైతులు తమ పంటలో 40 నుండి 50 శాతం వరకు దిగుబడి కోల్పోతున్నారు. ఈ మధ్య కాలంలో రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి అనేక పద్ధతులను అనుసరిస్తున్నారు. ఇందులో భాగమే సాధారణ లైట్ ట్రాప్‌లు. కానీ అవి పూర్తిగా సమర్థవంతమైనవి కావు.

**వాటిలో ఉన్న లోపాలు పరిశీలించినట్లైతే అవి:**

1. **మానవ శ్రమ, సమయం:** రాత్రి వేళల్లో పురుగుల కదలికలను పరిశీలించడం కష్టం. రైతు స్వయంగా వెళ్లి చూసుకోవాల్సి ఉంటుంది.
2. **ఖచ్చితత్వం లేకపోవడం:** ఏ పురుగు వచ్చిందో ఖచ్చితంగా గుర్తించడం కష్టం. దీనివల్ల సరైన పురుగు మందు వాడకంలో గందరగోళం ఏర్పడుతుంది.
3. **అధిక మందుల వాడకం:** పురుగుల బెడద మొదలైందని ఆలస్యంగా గుర్తించడం వల్ల, రైతులు ఎక్కువ మోతాదులో పురుగుమందులను చల్లుతారు. దీనివల్ల ఖర్చు పెరగడంతో పాటు, పంట నాణ్యత మరియు పర్యావరణం కూడా దెబ్బతింటాయి.

ఈ సమస్యకు పరిష్కారంగా, ఆధునిక సాంకేతికతతో రూపొందించబడిన " స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్" అనే వినూత్న పరికరం ఇప్పుడు రైతులకు అందుబాటులోకి వచ్చింది. ఇది కేవలం ఒక పరికరం మాత్రమే కాదు, పంటల సస్య సంరక్షణలో ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది.

**స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్:**

"స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్" అనేది ఒక కృత్రిమ పరికరం. ఇది పైన పేర్కొన్న అన్ని సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారం. ఈ పరికరం కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) సాంకేతికతలను అనుసరించి పని చేస్తుంది.

**ఇందులో ఉపయోగించిన భాగాలు:**

1. **లెడ్ లైట్:** ఇది చీడపీడలను ఆకర్షించే ప్రధాన భాగం. ఈ లైట్ పురుగులకు ఎరగా పనిచేస్తుంది.
2. **అత్యంత స్పష్టత గల కెమెరా:** లెడ్ లైట్ నుండి వచ్చిన వెలుతురు ప్రభావంతో ఆకర్షితమై ట్రాప్ దగ్గర పడే కీటకాలను స్పష్టమైన చిత్రంగా కెమెరా రికార్డ్ చేస్తుంది.
3. **పర్యవేక్షణ సెన్సర్లు:** ఇవి గాలిలోని ఉష్ణోగ్రత, తేమ మరియు ఇతర వాతావరణ సూచనలను నిరంతరం పర్యవేక్షిస్తాయి. ఈ సమాచారం వలన ఏ వాతావరణ సూచనల దగ్గర ఏ రకమైన కీటకాలు ఎక్కువగా వస్తున్నాయో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.
4. **ఐఓటి కనెక్టివిటీ:** ఇది కెమెరా మరియు సెన్సర్‌ల ద్వారా సేకరించిన డేటాను వెంటనే ఇంటర్నెట్ ద్వారా మేఘ నిల్వ (క్లౌడ్) కు పంపిస్తుంది. అక్కడి నుండి సేకరించిన సమాచారం ఆధారంగా రైతుల మొబైల్ ఫోన్‌కు తక్షణమే హెచ్చరికలు (అలర్ట్‌లు) పంపబడుతాయి.
5. **ఏఐ మోడల్:** ఇది స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్ యొక్క అత్యంత కీలకమైన భాగం. ఇది పురుగుల చిత్రాలను విశ్లేషించి, ఏ రకం పురుగుల బెడద ఉందో, వాటి సంఖ్య ఎంత ఉందో ఖచ్చితంగా గుర్తిస్తుంది.

### ఇది ఎలా పని చేస్తుంది?

### దశల వారీ వివరణ:

### 1. ఆకర్షణ మరియు సంగ్రహణ:

సూర్యాస్తమయం తర్వాత, స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్ పరికరంలో అమర్చిన లెడ్ లైట్ ఆన్ అవుతుంది. ఈ ప్రత్యేకమైన లెడ్‌లైట్ ప్రత్తి, వరి, మిర్చి, శనగ వంటి పంటలకు హాని చేసే కీటకాలను ఆకర్షించే విధంగా రూపొందించబడింది. వెలుతురును చూసి కీటకాలు లైట్ దగ్గరకు చేరుతాయి, అక్కడి నుండి అవి ట్రాప్‌లోకి ప్రవేశిస్తాయి. ట్రాప్‌లోకి వచ్చిన కీటకాలు బయటకు దూరిపోకుండా ఉండే విధంగా ప్రత్యేకమైన అంటుకునే ఉచ్చు (జిగురు పూసిన అట్టలు) రూపకల్పన కలిగి ఉంటుంది.

### 2. చిత్రీకరణ:

కీటకాలు ట్రాప్‌లోకి వచ్చిన వెంటనే, ట్రాప్‌లో అమర్చిన సెన్సర్లు వాటి కదలికలను గుర్తిస్తాయి. కదలికలను గుర్తించిన వెంటనే కెమెరా కీటకాల ఫోటోలను స్పష్టంగా తీస్తుంది. దీని వలన కీటకాల ఆకృతి, పరిమాణం మరియు రెక్కల ఆకారం వంటి లక్షణాలు స్పష్టంగా ఫోటోలో బంధించబడతాయి.

### 3. డేటా విశ్లేషణ:

కెమెరా తీసిన చిత్రాలు వెంటనే ఇంటర్నెట్ ద్వారా క్లౌడ్ సర్వర్‌కు పంపబడతాయి. అక్కడ ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన కృత్రిమ మేధస్సు (ఏఐ) అల్గారిథమ్స్‌తో చిత్రాలను పరిశీలిస్తాయి. ఈ అల్గారిథమ్స్ ఇప్పటికే లక్షలాది పురుగుల ఫోటోలపై శిక్షణ పొందినందువల్ల, పంటలకు హాని చేసే పురుగులను కచ్చితంగా గుర్తిస్తాయి. ఉదాహరణకు, కాండం తొలుచు పురుగు, గులాబీ రెక్కల పురుగు, పొగాకు లద్దె పురుగువంటి ముఖ్య కీటకాలను రకాన్ని బట్టి వేరు చేస్తాయి. కేవలం రకాన్ని మాత్రమే కాదు, వాటి సంఖ్యను కూడా లెక్కించి రికార్డ్ చేస్తాయి. ఈ మొత్తం విశ్లేషణ కొన్ని సెకన్లలోనే పూర్తవుతుంది.

### 4. హెచ్చరిక మరియు సమాచారం:

ఈ విశ్లేషణ పూర్తయిన వెంటనే, ఆ డేటా రైతుల మొబైల్ ఫోన్‌కు లేదా కంప్యూటర్‌కు హెచ్చరిక రూపంలో పంపబడుతుంది. ఈ హెచ్చరికలో ఏ కీటకాలు కనుగొనబడ్డాయి?, వాటి ఉనికి ఎంత? కీటకాల దాడి ప్రారంభమవుతున్న సంకేతాలేమిటి? అనే సమాచారం స్పష్టంగా చూడబడుతుంది.

### 5. సమయానికి స్పందన:

క్లౌడ్ నుండి వచ్చిన ఈ సమాచారం ఆధారంగా రైతులు ముందుగానే సరైన చర్యలు తీసుకోవచ్చు. ముఖ్యంగా, పురుగుల దాడి ప్రారంభ దశలోనే సరైన పురుగుమందును ఎంచుకుని, సరైన సమయంలో మరియు సరైన మోతాదులో పిచికారీ చేయవచ్చు. ఇలాంటి చర్యలు తీసుకోవడం వలన పంటకు నష్టం తగ్గి, ఉత్పత్తి పెరుగుతుంది.

### రైతులకు స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్ వల్ల కలిగే ప్రయోజనాలు

### 1. ఆర్థిక పరమైన లాభం :

ఈ నూతన పరికరం రైతులకు ముఖ్యంగా సమయానికి సరైన చర్యలు తీసుకోవడం వల్ల మందుల వాడకం సుమారు 20-30 శాతం వరకు తగ్గి, పెట్టుబడులు గణనీయంగా తగ్గుతాయి. అంతేకాకుండా, ముందస్తు చర్యలు తీసుకోవడం వలన కీటకాల నుండి కలిగే నష్టాన్ని నివారించడం ద్వారా పంట ఆరోగ్యం మెరుగుపడి, దిగుబడి పెరుగుతుంది. దీంతో రైతులకు ఆర్థిక పరంగా ఎక్కువ లభిస్తుంది.

### 2. పర్యావరణ లాభం:

ఈ పరికరం పంటరక్షణకు రసాయన మందుల వాడకం తగ్గించి నేల మరియు నీరు కలుషితం కాకుండా సురక్షితమైన వ్యవసాయాన్ని అందిస్తుంది. దీంతో పర్యావరణానికి హాని తక్కువగా ఉండి, దీర్ఘకాలంలో సహజ వనరుల సంరక్షణ సాధ్యమవుతుంది.

### 3. సమాచార లాభం:

ఈ పరికరం నిజ సమయ పర్యవేక్షణ ద్వారా రోజువారీగా ఏ కీటకాలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకోవచ్చు. అంతేకాక, కీటకాలు ఏ వాతావరణ పరిస్థితుల్లో అధికంగా వస్తున్నాయో విశ్లేషణ చేయడం సాధ్యమవుతుంది. దీని ద్వారా భవిష్యత్తులో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం సులభమవుతుంది.

### 4. జీవన శ్రేయస్సు:

అదేవిధంగా, తక్కువ రసాయనాలు వాడటం వల్ల పంట నాణ్యత గణనీయంగా మెరుగుపడి, వినియోగదారులకు ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన ఆహారం అందుతుంది. ఇలా తక్కువ రసాయనాలు వాడటం వల్ల పంటలలో ఉండే కీటకాల సహజ శత్రువులైన మిత్ర పురుగుల ఉనికి పెరుగుతుంది.

### విజయం సాధించిన రైతుల ఉదాహరణ:

తెలంగాణ రాష్ట్రంలోని, సిరిసిల్ల జిల్లాలోని వరి మరియు పత్తి రైతులు "స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్" పరికరాన్ని ఉపయోగించి కీటకాల నియంత్రణలో విశేష ఫలితాలు సాధించారు. సాధారణంగా ఆ ప్రాంతంలో వరిలో కాండం తొలుచు పురుగు, పత్తిలో గులాబీ రెక్కల పురుగు, శనగ పంటలో

పొగాకు లద్దె పురుగు బెడద తీవ్రంగా ఉంటుంది. అయితే, ఈ పరికరం ద్వారా పురుగుల రాకను ప్రారంభ దశలోనే గుర్తించడం సాధ్యమై, రైతులు సమయానికిసస్య రక్షణ చర్యలు చేపట్టి పంటలను రక్షించగలిగారు. ఫలితంగా దిగుబడిలో ఎలాంటి నష్టం జరగకుండా, రైతులు పంటపై మరింత ఆత్మవిశ్వాసం పెంపొందించుకున్నారు. అలాగే, అనవసరమైన ఖర్చు తగ్గించుకోవడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

**భవిష్యత్తు వైపు అడుగులు:**

మన భారతదేశ వ్యవసాయం డిజిటల్ వైపు సాగే ప్రయాణం వేగవంతం అవుతోంది. "స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్" లాంటి టెక్నాలజీ భవిష్యత్తులో మరింత అధునాతనంగా మారే అవకాశం ఎక్కువగా ఉంది.

**పురుగు అంచనా వ్యవస్థలు:**

డేటాను విశ్లేషించి, ఏ వాతావరణ పరిస్థితుల్లో, ఏ పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందో మండల, జిల్లా స్థాయిలో అంచనా వేయవచ్చు.

**ముగింపు :**

టెక్నాలజీ అనేది కేవలం నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామ స్థాయిలో వ్యవసాయ రంగానికి ఒక కొత్త ఆశను చిగురింపజేస్తోంది. "స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్" లాంటి కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) కలిగి ఉన్న సాంకేతికత పరికరాలు రైతులకు ఒక ఆయుధం లాంటివి. అవి వారి కీటకాల బెడదను తెలుసుకునే విషయంలో కష్టాన్ని తగ్గించి, సమయానికి సస్య రక్షణ చర్యలు చేపట్టడంతో పంట నష్టాన్ని నివారించి, లాభాలను చేకూరుస్తాయి. భవిష్యత్తులో మన రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో చేస్తేనే దేశ వ్యవసాయం మరింత దృఢత్వంగా మరియు లాభదాయకంగా మారుతుంది.

"పంటకు స్మార్ట్ కెమెరా ఆధారిత ట్రాప్ – సమయానికి గుర్తింపు, సమయానికి సస్యరక్షణ చర్య"

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9392641679**

**అక్టోబర్ 2025లో పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 01.10.2025 | వరి కోతానంతరం అపరాల పంటల సాగు |
| | ప్లాస్టిక్ సౌకర్యం వెనుక దాగిన విపత్తులు |
| 08.10.2025 | తీపి మొక్కజొన్న సాగు – సూచనలు |
| | ప్రపంచ మానసిక దినోత్సవం యొక్క ప్రాముఖ్యత |
| 15.10.2025 | వేరుశనగ సాగులో యాజమాన్యం |
| | ప్రపంచ ఆహార దినోత్సవం యొక్క ప్రాముఖ్యత |
| 22.10.2025 | జీరోటిల్లేజి పద్ధతిలో మొక్కజొన్న సాగు |
| | వర్షాకాలంలో కుటుంబ ఆరోగ్యానికి పోషకాహార చిట్కాలు |
| 29.10.2025 | ప్రొద్దుతిరుగుడు పంటలో చీడపీడల నివారణ |
| | బాల్య విద్య యొక్క ప్రాముఖ్యత – అంగనవాడీలు మరియు ప్రీస్కూల్ పాత్ర |

# దశరథ గడ్డి (హెడ్జ్ లూసర్న్) - పోషక విలువలు కలిగిన పశుగ్రాసం



డా॥ యస్. శ్రీనివాస రావు, డా॥ డి. పద్మజ మరియు డా॥ జె. అరుణ కుమారి

పశుగ్రాస పంటల విభాగం, ఏఐసిఆర్‌పి, ఏఆర్‌ఐ, రాజేంద్రనగర్

అభివృద్ధి చెందుతున్న దేశంలో పశుసంపద, సామాజిక ఆర్థిక అభివృద్ధిలో మరియు ఆహార భద్రతలో చాలా విలువైన ప్రాముఖ్యతను పోషిస్తుంది. అయినాసరే, సరిపడినంత నాణ్యమైన ఆహారం మరియు పశుగ్రాసం అందుబాటులో లేకపోవడం వలన పశువుల యొక్క నికర ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా నమోదు అవుతుంది. వివిధ వనరుల ద్వారా లభ్యమయ్యే పశుగ్రాసం కేవలం 40 శాతం మాత్రమే మిగిలిన 60 శాతం పశుగ్రాసం కొరతగానే ఉంది. చాలా పెద్ద మొత్తంలో పశుగ్రాసం మరియు నాణ్యమైన పొడి పదార్థం కొరత, అదేవిధంగా పండించే భూమి లభ్యత తగ్గటం దృష్టిలో పెట్టుకొని పశుగ్రాసం ఉత్పత్తిని తీవ్రతరం చేయడానికి అధిక దిగుబడులనిచ్చే గడ్డిజాతి పంటలను మరియు మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించాలి. అయినప్పటికీ పశువుల ఉత్పత్తిలో సాంప్రదాయక ఆహార వనరులు చాలా ఖర్చుతో కూడుకున్నవి. కావున ప్రత్యామ్నాయ ఆహార వనరులను గుర్తించి ఉపయోగించాల్సిన అవసరం ఉంది. పశువుల ఆహారానికి ఒక మంచి ఆశాజనకమైన పశుగ్రాస ఆధారం దశరథ గడ్డి.

దశరథ గడ్డి అనేది బహువార్షిక పప్పుధాన్యపు గడ్డి, దీని యొక్క సంవత్సర గడ్డి ఉత్పత్తి 90-100 టన్నులు ఒక హెక్టారు ఇచ్చేటువంటి మంచి పోషక పదార్థం కలిగి పశువులకిచ్చే నూనె కేక్ (తెలగ పిండి) ఆహారంలో ఈ గడ్డిని ఉపయోగిస్తారు. ఈ దశరథ గడ్డిని నీటిపారుదల సౌకర్యం గల ప్రాంతాల్లో మరియు వర్షాధారంగా సంవత్సరం పొడవునా సాగు చేస్తారు. మేత మేసే పశువులకు దశరథ గడ్డి చాలా పోషకాలు మరియు రుచికరంగా ఉండి పంటకాలం మొత్తం గడ్డి దొరుకుతుంది. కావున ఆర్థికపరంగా మరియు సుస్థిరమైన పశుగ్రాసం, పెరుగుతున్న పశుసంపద యొక్క డిమాండుకు అనుగుణంగా సరఫరా చేయబడుతుంది.

## దశరథ గడ్డిలో పోషక విలువలు:

దశరథ గడ్డిలో పోషక మరియు మొక్క సంబంధ రసాయనాలు లభిస్తాయి. ఇతర పప్పుధాన్యపు పశుగ్రాసాల్లో లాగానే, దశరథ గడ్డిలో కూడా అత్యధికంగా మాంసకృత్తులు కలిగి ఉంటుంది మరియు దీని యొక్క కాండంలో కంటే ఆకులలోనే అత్యధిక మాంసకృత్తులు కలిగి ఉంటుంది. దీని కాళీ కాయల్లో చాలా చాలా తక్కువ మాంసకృత్తులు ఉంటాయి. దశరథ గడ్డిలో సరాసరి ముడి మాంసకృత్తులు విలువ 18% పొడి పదార్థం (డిఎమ్) ఉండగా, పప్పుదినుసు పశుగ్రాస చెట్టు అయిన సుబాబుల్ నందు 25% పొడి పదార్థం ఉంటుంది. అదేవిధంగా దశరథ గడ్డిలో న్యూట్రల్ డిటర్జెంట్ ఫైబర్ విలువ ఇంచుమించుగా 50% పొడి పదార్థంగా ఉంటుంది. దశరథ గడ్డిలో ఒక ఎకరం విస్తీర్ణంలో ఆరుసార్లు కోస్తే సుమారుగా 40 టన్నుల బయోమాస్ లభించడమే కాకుండా మొత్తం జీర్ణమయ్యే పోషకం మరియు జీవక్రియ చేయగల శక్తి విలువ సుమారుగా 59% మరియు 5.6 మి.జౌల్స్/కిలో వరుసగా ఉంటుంది. దశరథ గడ్డిలో మధ్యస్థంగా లిగ్నిన్ (7% పొడి పదార్థం) మరియు ఇతర పప్పుదినుసు పశుగ్రాసాల్లాగా ఎక్కువ మొత్తంలో సాపోనిన్ దీనితోపాటు అతి తక్కువ టానిన్స్‌ను కలిగి ఉంటుంది.

## దశరథ గడ్డిలో న్యూట్రియంట్ మరియు ఫైటోకెమికల్ మిశ్రమాలు

| కెమికల్ మిశ్రమము | % పొడి పదార్థం ఆధారంగా |
|---|---|
| పొడి పదార్థం (డ్రై మాటర్) | 25 |
| సేంద్రియ పదార్థం | 92 |
| ముడి మాంసకృత్తులు | 18 |
| ఈతర్ సారం | 2.4 |
| న్యూట్రల్ డిటర్జెంట్ ఫైబర్ | 52 |
| యాసిడ్ డిటర్జెంట్ ఫైబర్ | 41 |
| లిగ్నిన్ | 7 |

### దశరథ గడ్డి జీవక్రియ మిశ్రమాలు

| | | |
|---|---|---|
| 1. | మొత్తం ఫినాల్స్ (%) | 1.34 |
| 2. | మొత్తం టానిన్స్ (%) | 0.48 |
| 3. | కండెన్స్‌డ్ టానిన్స్ (%) | 0.08 |
| 4. | హైడ్రోలైజబుల్ టానిన్స్ (%) | 0.40 |
| 5. | సపోనిన్స్ (మి.గ్రా. /గ్రా.) | 14.9 |
| 6. | ఫ్లేవనాయిడ్స్ (మి.గ్రా. /గ్రా.) | 1.7 |

### పశువుల నిర్వహణపై దశరథ గడ్డి యొక్క ప్రభావం:

పశువులు దశరథ గడ్డిని రుచికరంగా స్వీకరిస్తాయి. కానీ దీన్ని రుచికరంగా స్వీకరించడమనేది, రకము మరియు దీని యొక్క ఎండుగడ్డిని "సమతుల్య మిశ్రమ మేత" లో కలపటం ద్వారా పెరుగుతుంది.

పాలు ఇచ్చే ఆవుల్లో, ఆహారంగా దశరథ గడ్డి యొక్క ఎండిన ఆకులను మాంసకృత్తులు అందించుటకు ప్రతిరోజు ఒక్కో ఆవుకు 3 కిలోలు చొప్పున పీచు పదార్థ మిళిత ఆహార పరిమాణంతో కలిపి ఇచ్చినట్లైతే పాల దిగుబడి వృద్ధి చెందటమే కాకుండా పాలల్లో కొవ్వు శాతం తక్కువగా నమోదు అవుతుంది.

ఉస్మానాబాది మేక ఉత్పత్తిలో, అత్యధిక పోషక విలువలు కలిగిన దాణా బదులుగా 50% వరకు దశరథ గడ్డిని ఆహారంగా అందించినట్లైతే మేకల యొక్క పెరుగుదల వృద్ధి చెంది అధిక నికర లాభం పొందవచ్చు.

దశరథ గడ్డిని ఉపయోగించి పులియబెట్టిన గడ్డి తయారుచేయడానికి నల్ల తుమ్మ యొక్క కాయలను సుమారుగా 5% వరకు కలిపితే, పులియబెట్టిన గడ్డి యొక్క నాణ్యత వృద్ధి చెంది మేకలకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది.

గొర్రెల యొక్క నూలు మరియు శరీర బరువు వృద్ధి చెందటానికి ప్రతిరోజు 200 గ్రా. దశరథ గడ్డి యొక్క ఎండుగడ్డి మరియు 600 గ్రా. గడ్డి యొక్క ఎండుగడ్డిని కలిపి గొర్రెకు ఇవ్వాలి. దీనికి కారణం అత్యధిక మాంసకృత్తులు మరియు సల్ఫర్ లభించడం.

అలాగే, పందుల యొక్క ఆహారంలో దశరథ గడ్డి ఆకులు ఆహారం 17% కంటే మించి ఇవ్వకూడదు. ఆడ కోడిపిల్లలు ఆహారంలో దశరథ గడ్డి ఆహారంను లేయర్ ఆహారంలో 6% ఇచ్చినట్లైతే గ్రుడ్ల నాణ్యత మరియు పొదుగు పైన ఎటువంటి చెడు ప్రభావం ఉండదు. అంతేకాదు గ్రుడ్డు తెల్లసొన యొక్క రంగు వృద్ధి చెందుతుంది.

తెలంగాణ మరియు తమిళనాడు రాష్ట్రాలలో కుందేళ్ళ పెంపకంలో ప్రత్యేకంగా ఆడ కుందేళ్ళ పునరుత్పత్తి కోసం దశరథ గడ్డిని ఉపయోగిస్తారు. సాంప్రదాయ చెట్ల యొక్క ఆకుల కన్నా దశరథ గడ్డి యొక్క ఆకులను ఆహారంగా ఇస్తే కుందేళ్ళ యొక్క శరీర బరువు పెరుగుతుంది. పెరిగే కుందేళ్ళకు, గాఢ మిశ్రమం ఆహారం కంటే ప్రతిరోజు కుందేళ్ళకు 50 నుండి 70 గ్రా. దశరథ గడ్డిని ఇచ్చినట్లైతే పెరుగుదల రేటు వృద్ధి చెందుతుంది.

అందువలన, నెమరు వేయు జంతువులు మరియు కుందేళ్ళకు సంవత్సరం పొడవునా మంచి పోషక విలువలు కలిగిన పచ్చిగడ్డి అందించే పశుగ్రాసం దశరథ గడ్డి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9010406447**

### సెప్టెంబర్ 2025 మాసంలో పి.జె.టి.ఎ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 08.09.2025 | అధిక వర్షాలకు ప్రత్తిని ఆశించే తెగుళ్ళు - నివారణ |
| 2. | 10.09.2025 | సమగ్ర వ్యవసాయంతో రైతులకు లాభాలు |
| 3. | 16.09.2025 | అధిక వర్షాలకు కంది పంటలో సూచనలు |
| 4 | 17.09.2025 | వరిలో పోస్ట్ ఎమర్జన్స్ కలుపు మందులతో కలుపు నివారణ |
| 5 | 27.09.2025 | డిజిటల్ వ్యవసాయం (రైతు నేస్తం ఎపిసోడ్ 69) |
| 6 | 30.09.2025 | డ్రాగన్ ఫ్రూట్ సాగు - (రైతు నేస్తం ఎపిసోడ్ 69) |

# చేపల చెరువులో నీటి యాజమాన్యం




**డా॥ జి. గణేష్**

**కృషి విజ్ఞాన కేంద్రం,**

**పి.వి. నరసింహా రావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం,**

**మామునూర్, వరంగల్**


చేపల చెరువులోని నీటి లక్షణాల పరిరక్షణలో మత్స్యకార రైతులు తగిన శ్రద్ధ తీసుకోవాలి. నీటి లక్షణాలు ఒకదాని మీద ఇంకొకటి ప్రభావము చూపుతూ నిలకడగా ఉండకుండా మార్పులు చెందుతూ ఉంటాయి. వాతావరణం మారినప్పుడు నీటి లక్షణాలలో మార్పు గమనిస్తూ మంచి యాజమాన్య పద్ధతులను అవలంభించాలి.

**మంచినీటి చేపల పెంపకంలో నీటి నాణ్యత మరియు యాజమాన్యం:** మంచినీటి చేపల చెరువులో నీటి లక్షణాలు రెండు రకాలుగా ఉంటాయి అవి భౌతిక లక్షణాలు మరియు రసాయనిక లక్షణాలు

1) **భౌతిక లక్షణాలు:** నీటి రంగు, ఉష్ణోగ్రత మరియు పారదర్శకత

2) **రసాయనిక లక్షణాలు:** నీటి యందు ప్రాణవాయువు, ఉదజని, క్షారత్వము, కఠినత్వము, విషవాయువులైన కార్బన్ డై ఆక్సైడ్, అమ్మోనియా, నైట్రేట్, హైడ్రోజన్ సల్ఫైడ్ మొదలగునవి.

### భౌతిక లక్షణాలు

**నీటి రంగు:** నీటి యొక్క రంగు నీటిలో గల సూక్ష్మజీవులు, లవణాలు, ఘనపదార్థాలు మరియు సేంద్రీయ పదార్థాలను సూచించును. నీటి రంగు మార్పు వివిధ ప్రజాతుల వృక్ష ప్లవకాలు, జంతు ప్లవకాల అధికృత వలన వచ్చును. లేత ఆకుపచ్చ రంగు గల నీరు చేప పెరుగుదలకు మంచిది. ముదురు ఆకుపచ్చ రంగు (అల్గే అధికంగా ఉండుట వలన) చేపల పెంపకంనకు మంచిది కాదు.

**ఉష్ణోగ్రత:** చేపలు స్థిరోష్ణ జీవులు. సాధారణంగా వీటికి 28-32 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అవసరం. నీటి యొక్క ఉష్ణోగ్రత పెరిగిన కొద్దీ ప్రాణవాయువు అవసరం పెరుగును. వేసవిలో నీరు ఎక్కువగా ఆవిరి అగుట వలన నీటి ఉప్పుదనం మరియు నీటి కఠినత్వం పెరిగి చేపలు తట్టుకోలేని స్థితికి చేరును. నీటి ఉష్ణోగ్రత వివిధ లోతులలో అసమానంగా ఉంటుంది. సాధారణంగా చెరువు నీరు పైభాగంలో వేడిగా ఉంటుంది. అడుగుభాగం చల్లగా ఉంటుంది. చెరువులో ఏరియేటర్లు లేదా మోటారుబోట్లు నీటిలో త్రిప్పుట వలన ఉపరితల వేడి నీరు అడుగున చల్లని నీటితో కలియుట వలన చెరువులలో ఉండే ఉష్ణోగ్రత వ్యత్యాసాలను నివారించవచ్చును.

**నీటి పారదర్శకత మరియు బురదతనము:** ప్లవకాలు మరియు నీటిలో మట్టి రేణువుల వలన నీటి పారదర్శకత లేకపోవడం ఏర్పడుతుంది. దీనిని 'సెచిడిస్క్' సహాయంతో కొలుస్తారు. 'సెచిడిస్క్' పై రీడింగ్ 20 సెం.మీ. నుండి 30 సెం.మీ. చూపించిన యెడల ప్లవకాల సాంద్రత అనుకూల స్థాయిలో ఉన్నట్లుగా భావించాలి. ఈ కొలత 20 సెం.మీ. ల కన్నా తక్కువ ఉన్న యెడల ప్లవకాలు అధిక సాంద్రతలో ఉన్నట్లు, అటువంటి సందర్భాలలో ఎరువుల వినియోగం తగ్గించాలి, నీటి మార్పిడి చేసుకోవాలి.

నీటిలో గల సూక్ష్మరేణువులు, మట్టి కణాలు (బురద) సూర్యరశ్మి ప్రసరణను నిరోధించుట వలన ప్లవకాల పెరుగుదల తగ్గును. నీటిలో గల బురద, చేప మొప్పలలో చేరి శ్వాసక్రియకు భంగం కలిగించును. హేచరీలలో బురద నీటిని వినియోగించినచో గుడ్లు పొదుగుదల, లార్వా పెరుగుదలపై ప్రభావం చూపును.

### రసాయనిక లక్షణాలు

**ప్రాణ వాయువు:** చేపల సాగు నందు నీటిలో కరిగిన ఆక్సిజన్ చాలా ముఖ్యమైనది. ఆక్సిజన్ పరిమాణం తగ్గినచో చేపలలో చురుకుదనం తగ్గి మేత తీసుకొనక నీరసించి జబ్బులు సోకుటకు ఆస్కారం ఏర్పడును. ఆక్సిజన్ విలువలు 2 పి.పి.యం. కన్నా తక్కువైన యెడల చేపలు కొన్ని గంటల్లో చనిపోవును. నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణము ఉష్ణోగ్రత, మొక్కలు మరియు జంతువులు శ్వాసక్రియ మరియు సేంద్రియ పదార్థాల సాంద్రతపై ఆధారపడి ఉంటుంది.

ప్లవకాలు అధికమైనచో సూర్యరశ్మి ప్రసరణను తగ్గించును. అందువలన కిరణజన్య సంయోగ క్రియ ఉపరితలం

నీటి పొరలలో చాలా వేగవంతంగా జరిగి అడుగు భాగంలో ఆక్సిజన్ విలువలు తక్కువ ఉండుట వలన చేపల ఆరోగ్యానికి హానికరం. వేకువ జామున నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం తక్కువగా ఉండును. పగటిపూట కిరణజన్య సంయోగక్రియ వలన నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం పెరిగి మధ్యాహ్నం అధికంగా ఉండును. రాత్రి కిరణజన్య సంయోగక్రియ జరుగనందువలన మరియు చెరువులోని జీవుల శ్వాసక్రియ వలన నీటిలో కరిగే ఆక్సిజన్ గ్రహించబడి ఆక్సిజన్ విలువలు బాగా తగ్గుతాయి. కాలుష్యపు నీరును చెరువులోనికి పెట్టుట వలన మరియు బ్యాక్టీరియ ద్వారా సేంద్రియ పదార్థాలు కుళ్ళుట వలన నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం తగ్గును. ఉత్పత్తి పెంచు నిమిత్తం ఎక్కువగా మేత వినియోగించినట్లైతే నీటి నాణ్యత రాత్రి సమయంలో ఇంకను తగ్గును. నీటి మార్పిడి, కుళ్ళిన సేంద్రియ పదార్థముల తొలగింపు, నీటిలో కరిగిన ఆక్సిజన్ స్థాయి పెరుగుటకు సహాయపడును.

**నీటి ఉదజని:** నీటి లక్షణాలైన ఆమ్ల (<7) లేదా క్షార (>7) గుణములు చేపలపై నేరుగా ప్రభావం చూపిస్తాయి. పి.హెచ్ విలువ నీటిలో ఉన్న జీవకాలు, కిరణజన్య సంయోగక్రియ మరియు నీటి సారంను సూచించును. మిగిలిపోయిన ఆహారం, చనిపోయిన నాచు మరియు విసర్జితాలు పేరుకుపోవుట వలన పి.హెచ్. విలువ మార్పు చెందును. అధిక పి.హెచ్. నందు అమ్మోనియా యొక్క విషప్రభావం పెరుగును.

**చేపలపై ఉదజని ప్రభావం:** వ్యవసాయ జిప్సంను వినియోగించి క్షార స్వభావం గల నేల సరిచేయవచ్చును. కానీ ఎట్టి పరిస్థితులలోను ఒక రోజులో పి.హెచ్. విలువలు మార్పు 0.5 నుండి 10 దాటరాదు.

**క్షారత్వము మరియు కఠినత్వము:** నీటిలో కరిగియున్న బైకార్బోనేట్, కార్బోనేట్ అయానుల సాంద్రతను మొత్తం అల్కలినిటిగా నిర్వచించవచ్చు. కఠినత్వము అనునది నీటిలో గల మొత్తము కాల్షియం, మెగ్నీషియంల యొక్క సాంద్రతగా నిర్వచించవచ్చును. నీటిలో గల ప్రధాన క్షార గుణము మరియు కఠినత్వము విలువలు 80 నుండి 300 పి.పి.ఎం. వరకు చేపకు అనుకూలము. 80 పి.పి.యం. కన్నా తక్కువగా ఉన్న నీటియొక్క పి.హెచ్. ను పెంచుటకు సున్నం జల్లవలెను.

**కార్బన్ డైఆక్సైడ్:** కార్బన్ డై ఆక్సైడ్ విలువ 0–20 పి.పి.యం. వరకు చేపకు హాని కలిగించవు. రాత్రి సమయంలో మరియు మబ్బుగా ఉన్న వాతావరణ పరిస్థితులలో కార్బన్ డై ఆక్సైడ్ సాంద్రత ఎక్కువ ప్లవకాల మరణమునకు దారితీయును. అధిక కార్బన్ డైఆక్సైడ్ వలన పి.హెచ్. విలువ తగ్గి చేపలకు ఒత్తిడిని కలిగిస్తుంది. ఈ పరిస్థితిని అధిగమించుటకు సున్నం చల్లుట శ్రేయస్కరము.

**అమ్మోనియా:** చెరువులోని చేపల విసర్జితాలు, మేత వ్యర్థమైనప్పుడు, సేంద్రియ పదార్థాలు చెరువు అడుగున పేరుకుపోయి అమ్మోనియా ఉత్పత్తి అవుతుంది. అమ్మోనియా విషవాయువు. దీని గాఢత 1 పి.పి.యం కంటే ఎక్కువగా ఉన్నదో విషప్రభావము వలన మొప్పలు దెబ్బతిని ఆక్సిజన్ గ్రహించు శక్తి తగ్గును.

చెరువు నీటిలో అమ్మోనియా ఏర్పడినప్పుడు ఈ క్రింది చర్యలు చేపట్టాలి.

1) అమ్మోనియా విషప్రభావం తగ్గించుటకు నీటిలో ఆక్సిజన్ స్థాయి పెంచవలెను.
2) సేంద్రియ వ్యర్థపదార్థములను ఎప్పటికప్పుడు తొలగించాలి.
3) జియోలైటు ఎకరానికి 10–15 కేజీల చొప్పున ఇసుకలో కలిపి చెరువులో చల్లుకోవాలి.
4) బయోరెమిడియేషన్ పద్ధతి ద్వారా ఉపయోగపడే బ్యాక్టీరియాలను చెరువులలో చల్లుట ద్వారా (ప్రోబయోటిక్స్) అమ్మోనియాను తగ్గించుకోవచ్చును.
5) మేత వృధా కాకుండా మేత యాజమాన్యం పాటించాలి.

**హైడ్రోజన్ సల్ఫైడ్:** ఇది కూడా విషవాయువు. చెరువు నీటిలో 0.003 పి.పి.యం. కన్నా ఎక్కువ ఉండరాదు. ఏ విధమైన పరీక్షలు చేయకుండానే నీరు, కుళ్ళిన కోడిగ్రుడ్ల వాసన వచ్చిన యెడల హైడ్రోజన్ సల్ఫైడ్ ఉన్నట్లు గ్రహించవచ్చును.

**యాజమాన్యం:** మేత అధికంగా వేయుట వలన, సేంద్రియ మరియు రసాయన ఎరువులు అధిక మొత్తంలో వాడుట వలన సేంద్రీయ వ్యర్థపదార్థాలు అధిక సాంద్రతలో చెరువుల అడుగుభాగాన చేరుతాయి. ఇవి సకాలంలో విచ్ఛిన్నమై అనగా నైట్రేట్ మరియు సల్ఫేట్స్ మారిన యెడల చేపలకు హాని కలుగదు. మరియు ఇవి మంచి ప్లాంక్టాన్ ఉత్పత్తి అగుటకు దోహదపడుతుంది. సేంద్రీయ పదార్థాలు అసంపూర్తిగా విచ్ఛిన్నం అవ్వడం వలన అమ్మోనియా, నైట్రేట్ మరియు హైడ్రోజన్ సల్ఫైడ్ మొదలగు విషపదార్థాలు ఉత్పత్తి అయి చేపలకు ఒత్తిడి కలిగించి చేపలను మరణాలకు గురిచేస్తాయి. బయోరెమిడియేషన్ పద్ధతి ద్వారా ఉపయోగపడే బ్యాక్టీరియాలను (ప్రోబయోటిక్స్) చెరువులో వాడుట వలన విషవాయువుల ప్రభావం చేపలపై తగ్గి పెరుగుదల కనబడును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6281836891**

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1 | 06.10.2025 | యాసంగి పంటల్లో కలుపు యాజమాన్యం | **డా॥ టి. రాం ప్రకాష్**, ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 7396657949 |
| 2 | 08.10.2025 | యాసంగి పంటలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు | **శ్రీ పి. విజయ్ కుమార్**, ఎస్.యం.ఎస్. (ప్లాంట్ ప్రొటెక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్, ఫోన్ నెం. 9701456634 |
| 3 | 17.10.2025 | విత్తన నిల్వలో ఆశించు పురుగులు - నివారణ చర్యలు | **డా॥ ఎ. పద్మశ్రీ**, ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంపాలెం, ఫోన్ నెం. 9000791123 |
| 4 | 27.10.2025 | ఉద్యానవన పంటలలో మల్చింగ్ వాడకం - ప్రయోజనాలు | **డా॥ యు. స్రవంతి**, ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, ఫోన్ నెం. 9490844782 |
| 5 | 29.10.2025 | ప్రస్తుతం ఉన్న వివిధ పంటలలో తెగుళ్ళు - సస్యరక్షణ | **డా॥ ఎ. విజయభాస్కర్**, సీనియర్ శాస్త్రవేత్త (క్రాప్ ప్రొటెక్షన్) కో-ఆర్డినేటర్ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్, ఫోన్ నెం. 9849817896 |
| II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 06.10.2025 | శనగ పంటలో ఆశించే చీడపీడలు - వాటి నివారణ | **డా॥ కె. రాజశేఖర్**, సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) వ్యవసాయ పరిశోధన స్థానం, అదిలాబాద్, ఫోన్ నెం. 9908556659 |
| 2 | 13.10.2025 | వానాకాలం వరి పంటలో సస్యరక్షణ | **డా॥ ఐ. అరుణ శ్రీ**, శాస్త్రవేత్త (ఎంటమాలజీ) వరి పరిశోధన విభాగం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9701051104 |
| 3 | 27.10.2025 | కూరగాయల సాగులో మెళకువలు | **డా॥ బి. వెంకట రాజ్‌కుమార్**, శాస్త్రవేత్త (హార్టికల్చర్) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్, ఫోన్ నెం. 9866240346 |
| III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 04.10.2025 | యాసంగిలో కుసుమ పంట సాగు రకాలు - సూచనలు | **డా॥ డి. శివాని**, ప్రొఫెసర్ (ప్లాంట్ బ్రీడింగ్) ఎగ్జామినేషన్ సెంటర్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9908100099 |
| 2 | 18.10.2025 | యాసంగిలో వేరుశనగ సాగు - యాజమాన్యం | **డా॥ వి. రామి రెడ్డి**, అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్లాంట్ బ్రీడింగ్) వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9705960580 |
| 3 | 25.10.2025 | యాసంగి మొక్కజొన్న సాగులో మెళకువలు | **డా॥ యం. సుజాత**, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న) & హెడ్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9182968409 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సి. పద్మవేణి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. ప్రొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి యాసంగి కాలం అనువైనది. ఆడ, మగ వరుసలు ఏ నిష్పత్తిలో విత్తాలి?**

ఎ) 5:1 బి) 4:1
సి) 3:1 డి) 2:1

**2. నీటి ఎద్దడిని తట్టుకునే తక్కువ కాలపరిమితి గల యాసంగికి అనువైన వేరుశనగ రకం ఏది?**

ఎ) కదిరి-8 బి) కదిరి-9
సి) జెసిజి-88 డి) కదిరి-6

**3. రైతుల నుండి పత్తిని సేకరించడానికి కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన యాప్ ఏది?**

ఎ) కపాస్ కిసాన్ యాప్
బి) కాటన్ కార్పోరేషన్ యాప్
సి) సారథి యాప్
డి) ఏదీకాదు

**4. పంట తొలిదశలో ఆశించే రసంపీల్చే పురుగుల నివారణకు విత్తనశుద్ధికి విరివిగా ఉపయోగించే రసాయనం ఏది?**

ఎ) కాప్టాన్
బి) ఇమిడాక్లోప్రిడ్
సి) కార్బండాజిమ్
డి) పైవన్నీ

**5. మిరపలో నల్లతామర పురుగు నివారణకు ఎకరానికి ఎన్ని నీలిరంగు జిగురు అట్టలను పెట్టాలి?**

ఎ) 15-20 బి) 25-30
సి) 35-40 డి) 45-50

**6. బెండలో పల్లాకు తెగులు (శంఖు రోగం) ఏ పురుగు ద్వారా వ్యాప్తి చెందుతుంది?**

ఎ) పేనుబంక బి) తెల్లదోమ
సి) పచ్చదోమ డి) తామర పురుగులు

**7. పురుగులలో నిరోధక శక్తి పెరగడానికి గల కారణాలు?**

ఎ) ఒకే రకం పురుగు మందును ఎక్కువ సార్లు వాడటం వలన
బి) నష్టం చేసే పురుగులతోపాటు మేలు చేసే పురుగులు కూడా చనిపోవడం వలన
సి) అప్రధానంగా ఉన్న పురుగులు సమస్యగా మారడం
డి) పైవన్నీ

**8. మామిడి తోటలో పూత బాగా రావాలంటే ఏ సమయంలో ఎన్ని నెలలు బెట్ట అవసరం?**

ఎ) 3 నెలలు (అక్టోబర్-డిసెంబర్ వరకు)
బి) 2 నెలలు (అక్టోబర్-నవంబర్ వరకు)
సి) 2 నెలలు (నవంబర్-డిసెంబర్ వరకు)
డి) 1 నెల (డిసెంబర్)

**9. భారతదేశంలో టీ సిటీ అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?**

ఎ) అస్సాం బి) డార్జిలింగ్
సి) కేరళ డి) తమిళనాడు

**10. పండ్ల చెట్లు మధ్యలో ఆహార పంటలు పెంచే పద్ధతిని ఏమంటారు?**

ఎ) అగ్రి సిల్వికల్చర్ బి) అగ్రి హార్టికల్చర్
సి) హార్టి పాస్ట్యురల్ డి) సిల్విపాస్ట్యురల్

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు

## అంకుర సంస్థలకు పిజెటిఏయు గుర్తింపు పత్రాలు

అగ్రి హబ్ ఇన్నోవేషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 1న సాంకేతిక శిక్షణ పూర్తి చేసుకున్న 15 వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలకు ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య గుర్తింపు పత్రాలను అందజేయడం జరిగింది. తదనంతరం కూరగాయల సాగులో మానవ ప్రమేయం తగ్గించి రైతులకు తోడ్పాటు అందించేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆవిష్కరించిన రోబోని లాంఛనంగా ప్రారంభించారు. అలాగే గ్రామీణ యువత, అభ్యుదయ రైతులకు చేయూతనందించే కార్యక్రమంలో భాగంగా నాబార్డ్ ఆర్థిక సహకారాన్ని ఆరుగురికి అందజేశారు. అంతేకాకుండా పిజెటిఏయు అగ్రి హబ్ ద్వారా మరో రెండు అంకుర సంస్థలకు ఒక్కొక్క దానికి 40 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రి హబ్ తరపున ఇప్పటికి సుమారు 150 అంకుర సంస్థలకు నాబార్డ్ సహాయంతో తోడ్పాటు అందించామని, 2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్‌గా రూపొందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని, దేశ సంపద మూలాలు ఈనాటికీ గ్రామీణ భారతంలో, వ్యవసాయ రంగంలోనే కేంద్రీకృతమై ఉన్నందున ఈ రంగాలకి పెద్దపీట వేసి వ్యవసాయంతో పాటు వ్యవసాయ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా నాబార్డ్ డిజిఎమ్ దీప్తి, వి హబ్ ప్రతినిధి సీత, వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్, ఎజి హబ్ ఎమ్‌డి డా॥ జి. వెంకటేశ్వర్లు, వివిధ అంకుర సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు మరియు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ అవగాహన ఒప్పందం

విశ్వవిద్యాలయంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ సెప్టెంబర్ 24న ఒక ఏడాది కాల పరిమితి కలిగిన పీజీ డిప్లమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ కోర్స్‌ను పంటల ఆరోగ్య యజమాన్యంలో నైపుణ్యాభివృద్ధితో కూడిన అంశాలతో ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా రూపొందించి, ఈ రెండు సంస్థలు కలిసి పనిచేయడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది.

## వర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) 2025 లో 24వ ర్యాంక్

దేశంలోని అన్ని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు, సంస్థల జాబితాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఏయు) 24వ ర్యాంక్‌ను సాధించిందని ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 10 నెలల క్రితం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అనేక కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఈ ఏడాది ర్యాంకు మెరుగుపడిందని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రత్యేకంగా 4 ఆధునిక పరిశోధన కేంద్రాలు ప్రారంభించామని, రాష్ట్రవ్యాప్తంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసి సుమారు 1200 గ్రామాల్లో 1,20,000 మంది రైతులని శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా కలిసి ఆ అంశాలపై అవగాహన కల్పించారని, అలాగే సుమారు 11 వేల గ్రామాల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకి నాణ్యమైన 40 వేల విత్తన కిట్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్దతు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల కృషి తోడ్పాటు ర్యాంక్ పెరుగుదలకు దోహదం చేసిందని అన్నారు.

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల సందర్భంగా సెప్టెంబర్ 17న జాతీయ పతాకాన్ని రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్ ఆవిష్కరించి, జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఉత్సవాలను సెప్టెంబర్ 27న ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ పరిపాలన భవనం వద్ద ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య ఉత్సవాలు ప్రారంభించి మహిళా ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులతోపాటు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయ కేంద్రాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ష్ బాబు

# ఆముదం విత్తనోత్పత్తి - రైతు విజయగాథ



డా॥ కె. సదయ్య, డా॥ జి. ఈశ్వర రెడ్డి, డా॥ వి. దివ్యారాణి, జి. మాధురి, డా॥ ఎం.ఎం. కాడసిద్ధప్ప, డా॥ ఎం. శ్రీధర్ మరియు డా॥ టి. రామ్ ప్రకాష్

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, నాగర్ కర్నూల్

ఆముదం పంటను సాధారణంగా తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ తెలంగాణ జిల్లాలైన నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, రంగారెడ్డి మరియు నల్గొండ జిల్లాలలో వర్షాధార పంటగా మరియు నీటి పారుదల వసతి ఉన్న ప్రాంతాల్లో యాసంగి పంటగా పండిస్తారు. అయితే ఆముదంను వర్షాధార పంటగా కంటే యాసంగిలో నీటి వసతి కింద సాగు చేసినట్లయితే చీడపీడల బెడద తక్కువగా ఉండి అధిక దిగుబడులు సాధించవచ్చు. తద్వారా రైతుకి ఎక్కువ రాబడి సమకూరుతుంది. అయితే యాసంగిలో ఆముదంను సాధారణ పంటగా కంటే విత్తన పంటగా పండించినట్లయితే రైతుకి అధిక మొత్తంలో రాబడి వచ్చే అవకాశం ఉంటుంది.

ఆముదం విత్తనోత్పత్తికి కేవలం యాసంగి కాలం మాత్రమే అనుకూలం. అధిక దిగుబడి, తెగుళ్లను తట్టుకునే అనువంశిక రకాలను (మగ మరియు ఆడ) ఇతర ఆముదం మొక్కల నుండి తగినంత వేర్పాటు దూరంలో విత్తి నాణ్యమైన హైబ్రిడ్ ఆముదం విత్తనాన్ని పొందవచ్చు. ఈ పద్ధతిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం శాస్త్రవేత్తలు ప్రతి సంవత్సరం ఉత్తమమైన రైతులను ఎంపిక చేసుకొని యాసంగిలో ఆముదం విత్తనోత్పత్తిని చేస్తున్నారు.

అందులో భాగంగా, 2024-25 యాసంగిలో నాగర్ కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, పాలెం గ్రామానికి చెందిన రైతు శ్రీ. కె. బాలకృష్ణ గారి క్షేత్రంలో 5 ఎకరాలలో నీటి పారుదల కింద ఆముదం విత్తనోత్పత్తిని శాస్త్రవేత్తల పర్యవేక్షణలో చేపట్టడం జరిగింది.

రైతు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి సంబంధించిన ఆడ మరియు మగ మొక్కలను అక్టోబర్ రెండవ వారంలో విత్తడం జరిగింది. విత్తే సమయంలో ఆడ మొక్క విత్తనాలను మూడు వరసలలో మరియు మగ మొక్క విత్తనాలను ఒక వరుసలో విత్తడం జరిగింది. ఇలా తన 5 ఎకరాలలో ఆడ మరియు మగ మొక్క విత్తనాలను 3:1 నిష్పత్తి లో నాటుకోవడం జరిగింది. అదే విధంగా విత్తనోత్పత్తి పొలం చుట్టూ రెండు వరుసలలో మగ మొక్కలను విత్తడం జరిగింది. తద్వారా తగినంత పుప్పొడి ఆడ మొక్కలలో గింజ కట్టడానికి సమకూరుతుంది.

విత్తే సమయంలో రెండు ఆముదం వరుసల మధ్య 120 సెం.మీ., అలాగే ఒక వరుస లోని మొక్కల మధ్య 60 సెం.మీ దూరం పాటించి మనుషులతో నాటించడం జరిగింది. విత్తే ముందు కిలో విత్తనానికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయడం జరిగింది.

విత్తిన 45 రోజుల వరకు కలుపు నివారణకు 2-3 సార్లు అంతర కృషి చేయడం జరిగింది. అదేవిధంగా పంట కాలం మొత్తం (దాదాపు 150 రోజులు) ప్రతి 10-12 రోజులకు ఒకసారి నీటి తడిని ఇచ్చి తద్వారా పంట ముఖ్య దశలలో నీటి ఎద్దడికి గురి కాకుండా కాపాడారు.

ఎరువుల యాజమాన్యంలో భాగంగా విత్తే ముందు ఆఖరి దుక్కిలో 50 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 20 కిలోల పొటాష్ ఎరువులను వేయడం జరిగింది. అదే విధంగా విత్తిన 30 రోజులకు మరియు 65 రోజులకు ఎకరానికి 30 కిలోల చొప్పున యూరియాని మొక్క మొదళ్ల దగ్గర వేయడం జరిగింది.

నాణ్యమైన హైబ్రిడ్ విత్తనోత్పత్తి కొరకు, పంట పుష్పించే దశ మొదలయ్యాక ప్రతి రోజు సొంతంగా మరియు కూలీల సహకారంతో ఆడ మొక్కలలో వచ్చే మగ మొగ్గలను తుంచడం జరిగింది. అదే విధంగా మగ మొక్కలలో కూడా ఎక్కువ మగ మొగ్గలు ఉన్న మొక్కలను పుష్పించే ముందే పీకేయడం జరిగింది. తద్వారా ఆడ మొక్కలపైన మేలైన హైబ్రిడ్ విత్తనాన్ని పొందడం జరిగింది.

సస్యరక్షణలో భాగంగా పంటలో చీడ పీడల నివారణ కొరకు, పురుగు లేదా తెగులును తొలి దశలోనే గమనించి సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రైతుకి నాణ్యమైన దిగుబడి లభించింది.

ఇలా సరైన సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఒక ఎకరానికి 6 క్వింటాళ్ల హైబ్రిడ్ విత్తనాన్ని పొందడం జరిగింది.

**రైతు అభిప్రాయం:** యాసంగిలో ఆముదంను సాధారణ పంట లాగా కాకుండా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో విత్తన పంటగా పండించడం ద్వారా ఎక్కువ నికర ఆదాయాన్ని పొందవచ్చు అని పేర్కొన్నారు. అదే విధంగా, ఈ రకంగా విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా రైతు శ్రీ. కె. బాలకృష్ణ గారికి ఒక ఎకరానికి సుమారు రూ. 74,300/- నికర ఆదాయం లభించింది.

**సాగు ఖర్చు వివరాలు**

| సాగు పద్ధతులు | ఖర్చు / ఎకరాకు (రూ.) |
|---|---|
| నేల తయారీ మరియు పశువుల ఎరువులు | 5,000 |
| విత్తనశుద్ధి | 100 |
| విత్తడానికి | 1,000 |
| కలుపు నివారణ | |
| అంతరకృషి (దంతెలు-3 సార్లు) | 3,000 |
| అంతరకృషి (మనుషులతో - 2 సార్లు) | 2,400 |
| నీటి తడులు | 5,000 |
| ఎరువులు ఖర్చు | 5,200 |
| పురుగు మందుల ఖర్చు | 1,500 |
| మందుల పిచికారి (3 సార్లు) | 1,500 |
| మొగ్గలు గిల్లడం | 45,000 |
| కోత (3 సార్లు) | 3,000 |
| నూర్పిడి మరియు సంచులు నింపడం | 3,000 |
| మొత్తం ఖర్చు | 75,700 |
| దిగుబడి | * 6 క్వింటాళ్లు |
| స్థూల ఆదాయం (క్వింటా రూ.25,000/-) | 1,50,000/- |
| నికర ఆదాయం | 74,300/- |

* కేవలం హైబ్రిడ్ విత్తన దిగుబడి మాత్రమే.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.

**28వ పేజీలోని పదవినోదం సమాధానాలు**

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | చ్చ | దో | మ | | 2 వ | రి | | న్ | స్థా | జ | రా 3 |
| | | | దో | | ర్మి | | | రా | | | |
| | | | ల్ల | | వా | | | 4 బో | | | |
| | | | తె 5 | | ష్ | | | | | | |
| | న్స్ | | | | | 6 స్పై | రో | మె | సి | ఫె | న్ |
| 7 హై | 8 డ్రో | ఫో | ని | క్స్ | | | | | | | లో |
| డ | | | | | | | | | | | య |
| రా | | 9 అ | గ్గి | తె | గు | లు | | | | | డ |
| బా | | ర | | | | | గ | | | | మో |
| ద్ | | టి | | | | | ఈ | | | | 10 బ్రో |
| | | | | 11 మా | ని | పం | డు | తె | గు | లు | |
| | | | | | | | 12 పం | | | | |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు :** 1. సి 2. బి 3. ఎ 4. బి 5. బి 6. బి 7. డి 8. ఎ 9. ఎ 10. బి

# గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు


















RNI No : TELTEL/2015/60296 October, 2025
Total No. of Pages : 52

Postal Regd.No:HSE/1013/2024-2026
Date of Publication : 06.10.2025
Date of Posting : 09.10.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



## ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ మరియు త్రుప్పు తెగుళ్ళను సమర్థవంతంగా తట్టుకునే మధ్యకాలిక వేరుశనగ రకం

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152